**ఒకటో యూనిట్**

# 1. వర్షాలు

కింది చిత్రం చూడండి.





**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలో పిల్లలు ఏం చేస్తున్నారు?
- మీరు ఎప్పుడైనా ఇలా చేశారా?
- వర్షం పడుతూంటే ఎవరెవరు ఏమేం చేస్తారో చెప్పండి?



**పిల్లలూ! ఇలా చేయండి.**


- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



వచ్చెను వచ్చెను వర్షాలు మా వసుధారాణికి తలబ్రాలు
విచ్చిన పూలై ప్రజాముఖమ్మున వెల్లివిరిసెను మురిపాలు
కత్తులు కత్తులు కలిసిన యట్టుల
ఉత్తర దిక్కున ఉరిమింది, కనుపాపల చెక్కని మెరిసింది.
గడగడ గడగడ దివి ఉరిమింది
చకచక చకచక దిశ మెరిసింది,
చలిగాడుపు రివరివ విసిరింది
॥ వచ్చెను ॥

పాడు కరవులకు బాణాలు మా
పంట చేలకివి ప్రాణాలు మా
కాపు కన్నులకు ముత్యాలు వరి
కర్రల నోళ్ళకు చనుబాలు ॥ వచ్చెను ॥

కోడెనాగులై ఉరికే వాగులు
క్షీరధారలై పారే తోగులు
భూసతి వానల తానములాడి
పచ్చిక కోకల పైట సవరించె
॥ వచ్చెను ॥



మదవృషభమ్ములు కొమ్ముల గ్రుమ్ముచు
మట్టిని జిమ్ముచు అంకెవేయగా
ముదితమయూరం పింఛము విప్పి
ముద్దుగ నాట్యం సలిపింది. ॥ వచ్చెను ॥


ఆరవేసిన చీరలవోలె
తూరుపుగట్లం దావులు మేసె
నడిచే నల్లని గండ శిలలవలె
పడమటి గట్లను గేదెలు మేసె
॥ వచ్చెను ॥

కమ్మగొడుగుతో కాపు ఛత్రపతి
చేలలోన భూపాలుండయ్యె
పశుపతియై ములుకోలను బూని
కరువుల పాలిటి కాలుండయ్యె
॥ వచ్చెను ॥

– శ్రీవానమామలై వరదాచార్యులు గారి "విప్రలబ్ధ" నుంచి

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం




(అ) గేయాన్ని రాగంతో పాడండి, అభినయం చేయండి.


(ఆ) వర్షాలు పడకపోతే ఏమవుతుందో చెప్పండి.

(ఇ) ఈ పాఠంలో వేటిని గురించి చెప్పారు?

(ఈ) వర్షం పడినప్పుడు మీరేమేమి చేస్తారు?

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం





**(అ) గేయంలోని ప్రాసపదాలను గుర్తించి రాయండి.**

**ఉదా:** ఉరిమింది - మెరిసింది

**(ఆ) పాఠాన్ని చదవండి. కవి వేటిని వేటితో పోల్చారో జతపరచండి.**

| | |
|---|---|
| కోడెనాగులు | గేదెలు |
| గండ శిలలు | ఛత్రపతి |
| పచ్చిక | పారే తోగులు |
| కాపు | ఉరికే వాగులు |
| క్షీరధారలు | కోక |



**(ఇ) గేయం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. వానలో స్నానమాడింది ఎవరు? ______________
2. మట్టిని జిమ్మి అంకె వేసిందెవరు? ______________
3. తూరుపు గట్లలో మేసిందెవరు? ______________
4. కరువుల పాలిట కాలుండెవరు? ______________
5. ముద్దుగా నాట్యం సలిపిందెవరు? ______________
6. పడమటి గట్లను మేసిందెవరు? ______________
7. వరికర్రల నోళ్లకు చనుబాలైందేమిటి? ______________

© SCERT not to be republished

**(ఈ) గేయం ఆధారంగా కింది గేయ పంక్తులను సరి చేసి రాయండి.**

1. వాగులు కోడెనాగులై ఉరికే
పారే తోగులు క్షీరధారలై
వానల భూసతి తానములాడి
పైట సవరించె కోకల పచ్చిక

2. ఛత్రపతి కమ్మ కాపు గొడుగుతో
భూపాలుండయ్యె చేలలోన
బూని పశుపతియై ములుకోలను
పాలిటి కాలుండయ్యె కరువుల

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



1. రైతును "దేశానికి వెన్నెముక" అంటారు కదా! ఎందుకు?
2. వాన కురిసేటప్పుడు మీకు ఎలా ఉంటుందో రాయండి.
3. వాన పడ్డప్పుడు మీ ఇంట్లో, ఇంటిబయట వీధులు ఎలా ఉంటాయో వర్ణించి రాయండి.
5. గేయసారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



**(అ) కింది వర్ణమాలలో ఉన్న అక్షరాలతో పదాలు తయారు చేయండి. పట్టికలో రాయండి.**

| వర్ణమాల | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ | ఋ | ౠ | ఌ | ౡ |
| ఎ | ఏ | ఐ | ఒ | ఓ | ఔ | ఁ | ం | ః | |
| క | ఖ | గ | ఘ | ఙ | | | | | |
| చ | ౘ | ఛ | జ | ౙ | ఝ | ఞ | | | |
| ట | ఠ | డ | ఢ | ణ | | | | | |
| త | థ | ద | ధ | న | | | | | |
| ప | ఫ | బ | భ | మ | | | | | |
| య | ర | ల | వ | శ | ష | స | హ | ళ | ఱ |

| రెండు అక్షరాల పదాలు | మూడు అక్షరాల పదాలు | నాలుగు అక్షరాల పదాలు | జంటపదాలు |
|---|---|---|---|
| | | | |

© SCERT not to be republished

**(అ)** కింది గళ్ళలో వర్షానికి సంబంధించిన పదాలు ఉన్నాయి. వాటిని గుర్తించి, ఆ పదాలతో సొంతవాక్యాలు రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| మ | పి | వా | మ | న | ఉ |
| గొ | డు | గు | బ్బు | ది | రు |
| ది | గు | వ | లు | క | ము |
| జ | వ | మె | రు | పు | లు |
| ల్లు | ర | ల | తు | ఫా | ను |
| లు | ద | వ | డ | గ | ళ్ళు |



| | పదం | సొంతవాక్యం |
|---|---|---|
| ఉదా : | గొడుగు | వర్షం కురుస్తూ ఉంటే గొడుగు పట్టుకొని బయటకు వెళ్లాను |
| | ______ | ______________________________ |

**(ఇ)** కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.

1. వసంత ఋతువు వచ్చింది. <u>వసుధ</u>కు అందం తెచ్చింది. వసుధ = ________
2. <u>మయూరం</u> పురి విప్పి నాట్యం చేస్తుంది. మయూరం = ________
3. నాగలికి రెండువైపులా '<u>వృషభాలు</u>' కడతారు. వృషభం = ________

**(ఈ)** మీ ప్రాంతంలో పండే పంటల పేర్లను రాయండి.

**ఉదా :** వరి

**(ఉ)** గేయంలోని కింది పదాలను చదవండి. అలాంటివే మీరు రాయండి.

**ఉదా:** గడగడ ఉరిమింది, చకచక మెరిసింది

________ ________

**(ఊ)** పాఠంలో కింది ఏకవచనాలకు బహువచనాలు ఉన్నాయి. వాటిని వెతికి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | వర్షం | ________ | 5. | ముత్యం | ________ |
| 2. | కొమ్మ | ________ | 6. | పువ్వు | ________ |
| 3. | గట్టు | ________ | 7. | కత్తి | ________ |
| 4. | చేను | ________ | 8. | బాణం | ________ |

© SCERT not to be republished

## V సృజనాత్మకత



అ) **కింది గేయాన్ని పొడిగించి రాయండి.**

పోదాం పోదాం పల్లెకు పోదాం
పల్లెను చూసి పరవశించుదాం
చుట్టు ఎత్తుగ కొండలుంటవి
పచ్చ పచ్చని పొలాలుంటవి ....................................

## VI




**ప్రశంస:** రైతులు కష్టపడి పంటలు పండిస్తారు కదా! ఇలా వివిధ రంగాలలో కష్టపడి పనిచేసేవారు ఎవరు? వారిని మనం ఎందుకు గౌరవించాలి?

## VII భాషను గురించి తెలుసుకుందాం

(అ) **మూడో తరగతిలో అచ్చులు, హల్లులు గురించి తెలుసుకున్నారు కదా! పాఠం చదవండి. పాఠంలోని అచ్చు అక్షరాలను, హల్లు అక్షరాలను రాయండి.**

(ఆ) **5వ పేజీలోని వర్ణమాలను చూడండి. వాటిలో మీకు తెలియని అక్షరాలు ఏమున్నాయో చెప్పండి.**



□ లోని అక్షరాలు ప్రస్తుతం వాడుకలో లేవు. ఁ, ం, ః లను ఉభయాక్షరాలంటారు. ఁ పద్యాలలో, ప్రాచీన గ్రంథాలలో కనిపిస్తుంది.

" ౘ , ౙ , ఱ" వీటిని ఎలా పలుకుతారు? పలకండి. వీటికి బదులుగా చ,జ,ర అక్షరాలను రాయడానికి ఉపయోగిస్తున్నారు. ఈ అక్షరాలున్న పదాలున్నాయి. వాటిని చదవండి.

| ౘ | ౙ | ఱ |
|---|---|---|
| ౘలి - చలి | ౙల్లెడ - జల్లెడ | ఱంపం - రంపం |
| ౘలువ - చలువ | ౙంకు - జంకు | ఱంకె - రంకె |
| ౘన్నీళ్ళు - చన్నీళ్ళు | ౙమ - జమ | ఱెక్క - రెక్క |
| ౘందమామ - చందమామ | ౙంగుపిల్లి - జంగుపిల్లి | ఱొమ్ము - రొమ్ము |

**ప్రాజెక్టు పని**



వర్షానికి సంబంధించిన గేయాలు/చిత్రాలు సేకరించండి. వాటి గురించి చెప్పండి.

### నేనివి చేయగలనా?

1. గేయాన్ని రాగంతో పాడగలను. వర్షం గురించి మాట్లాడగలను. ఔను/కాదు
2. గేయం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలను. ఔను/కాదు
3. వర్షాలను గురించి సొంతమాటల్లో రాయగలను. ఔను/కాదు
4. గేయాన్ని పొడిగించగలను. ఔను/కాదు

ప్రకృతి పెరుగుదల మానవులకో వరం - ప్రకృతి నాశనం మానవులకు శాపం

**- జీవవైవిధ్య సదస్సు, 2012**

© SCERT not to be republished

చదువు
ఆనందించు

# పడవలు చేద్దాం...

రారండోయ్ రారండి... పిల్లల్లారా రారండి
మబ్బులనెక్కి వస్తున్నా – పడవలు చేయగ రారండి!!

సముద్రాలను నింపుకొని
మేఘాలల్లో దాచుకొని
చిటపట చినుకుల రూపంలో
మురిపెంగానే వస్తున్నా!

ఆనందాలే హద్దులుగా
ఆడుకుందాం రారండోయ్!!

కుండపోతగా కురుస్తూ
వాగులు వంకలు దాటుతూ
చెరువులు కుంటలు నింపుతూ
మీ ఇళ్ళ ముంగిట కొస్తున్నా!

సంతోషంగా గంతులు వేస్తూ
చిందులు వేయగ రారండోయ్!!

వస్తువులన్నీ తేవడానికి
బజారునంతా చుట్టేద్దాం
డబ్బులు దాచిన హుండీలనూ
బద్దలుకొట్టి తీసుకువద్దాం!

ఊళ్లో ఉన్న పిల్లలందరూ
పరుగు పరుగునా రారండోయ్!!

ఎరుపు, పసుపు, నీలం, పచ్చ
మెరుపు కాగితాలన్నిటితో
భలే భలేగా పడవలు చేస్తూ
వర్ణశోభితం చేసేద్దాం!

కలిసి మెలసి మీరంతా
సందడి చేయగ రారండోయ్!!

వానల్లోనూ తడిసిన వెరవక
చెత్తలోనా ఇరికిన బెదరక
చెదరని బాల్యపు గుర్తులకోసం
నావకు నడకను నేర్పిద్దాం!

ఆలోచనలకు పదును పెడుతూ
అందరు ఒకటై రారండోయ్!!

నాతరమా నీతరమా అని
సోమరితనాన్ని దరి రానీకు
కష్టంలోనే ఫలితముందనీ
కలిసి ముందుకు నడుద్దాం!!

రారండోయ్ రారండోయ్ ... పిల్లల్లారా రారండోయ్

**– మూలం: ఎన్.సి.ఇ.ఆర్.టి, పాఠ్య పుస్తకం**

© SCERT not to be republished

ఒకటో యూనిట్


# 2. సూది కథ

కింది చిత్రం చూడండి.



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**


- చిత్రంలో ఎవరున్నారు? వారు ఏం చేస్తున్నారు?
- వారు తలపై తెస్తున్నవి ఏమిటి?
- అలా వాళ్ళు వరసలో ఎందుకు వస్తున్నారు? వీళ్ళు వస్తున్న తీరును గమనిస్తుంటే మీకు ఏమనిపిస్తుంది?




**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

ఒక గురువుగారికి అమాయకులైన శిష్యులున్నారు. వాళ్ళు అమాయకత్వంతో చేసే పనులు మనకు నవ్వుతెప్పిస్తాయి. ఈ కథలో అమాయకులైన శిష్యులు ఏం చేశారో చూడండి.



ఒకసారి పరమానందయ్య గారికి కాలిలో ముల్లు విరిగింది. ఆ ముల్లు తీసివేయడానికి సూది కావలసి వచ్చింది. అది తన ఇంట్లో లేకపోవడంతో ఇరుగు పొరుగువారిని ఎవరినైనా అడిగి సూదిని తెమ్మని శిష్యులను పురమాయించారు. “సరే! అలాగే” అంటూ అయిదుగురు శిష్యులు సూదిని తీసుకురావడానికి వెళ్లారు. శిష్యుల గురించి ఇది వరకే తెలిసి ఉండడంతో అందరూ “మా దగ్గరలేదు” అనీ, “మా ఇంట్లో సూది లేదు” అనీ చెప్పి తప్పించుకున్నారు.




శిష్యులు పట్టు వదలకుండా పొరుగూరు వెళ్లి సూదిని సంపాదించేందుకు ప్రయత్నించారు. ఓ అవ్వ వాళ్లకు సూదినిచ్చింది. సూది చిన్నదిగా ఉంటుంది కనుక ఓ శిష్యుడు దాన్ని జాగ్రత్తగా పట్టుకొని చేజారితే ఎక్కడైనా పడిపోతుందనే భయంతో సూది వైపే చూస్తూ తమ ఊరికి బయలుదేరాడు. మిగిలిన నలుగురు అతణ్ణి అనుసరించారు. “సూదిని వీడొక్కడే తీసుకెళ్తున్నాడు. గురువుగారికి ఉపకారం చేయడంవల్ల వచ్చే పుణ్యం వీడికి ఒక్కడికే దక్కేలా ఉంది.” అని మరో శిష్యుడికి అనుమానం వచ్చింది. మిగిలినవారితో అదే మాట అన్నాడు. అంతే! సూదిని “నేను తెస్తాను” అంటే, “నేను తెస్తాను” అని వాదులాడారు. అప్పటి వరకు సూదిని పట్టుకున్న శిష్యునిపై మిగిలిన నలుగురూ కలియబడ్డారు.

ఈ తగాదాలో సూది ఎక్కడో పడిపోయింది. అందరూ సూదికోసం వెదికారు. మొత్తంమీద సూది దొరికింది. మళ్లీ సూదిని తేవడం కోసం నేనంటే నేనని వాదులాడుకున్నారు. ఒకడు సూదిని ఒకవైపు

© SCERT not to be republished

పట్టుకోగా మరొకడు ఇంకోవైపు పట్టుకున్నాడు. ఇంకొకడు సూదిని మధ్యలో పట్టుకొని ఆశ్రమం వైపు నడవసాగాడు. కానీ మరో ఇద్దరు శిష్యులకు ఆ సూదిని పట్టుకొనే అవకాశం లేకపోవడంతో వాళ్లిద్దరికీ కోపం వచ్చింది." గురువుగారికి ఉపకారం చేసి ఆ పుణ్యాన్ని మీరు ముగ్గురే పొందాలని అనుకుంటున్నారా? మీరు ఇక్కడే ఉండండి. మేమిద్దరం గురువుగారి దగ్గరకు వెళ్లి సూదిని ఎలా తీసుకురమ్మంటారో అడిగి వస్తాం" అన్నారు. వెంటనే వాళ్ళిద్దరూ ఆశ్రమానికి పరుగెత్తుకువెళ్ళారు. గురువుగారికి చెప్పారు.

విషయం విన్న పరమానందయ్యగారు "ఏ కష్టం వచ్చినా, సుఖం వచ్చినా మీరంతా కలిసి పంచుకోవాలి, నాయనలారా!" అని హితవు చెప్పారు. వెంటనే ఆ ఇద్దరు శిష్యులు పరుగుపరుగున తిరిగి వెళ్ళారు. సూది పట్టుకున్న వాళ్ళ దగ్గరకు చేరుకున్నారు. గురువుగారు చెప్పిన సలహా గురించి వివరించారు. అప్పుడు ఐదుగురు కలిసి సూదిని ఆశ్రమానికి ఎలా తీసుకువెళ్ళాలా? అని ఆలోచించసాగారు. బాట పక్కనే వారికి తాటిదూలం ఒకటి కనిపించింది. దాన్ని చూడగానే శిష్యులకు ఓ ఉపాయం స్ఫురించింది. సూదిని తాటి దూలానికి గుచ్చి, "ఇక దీన్ని పట్టండిరా! మనందరం కలిసి ఈ తాటిదూలాన్ని మోసుకుపోదాం! కష్టాన్ని అంతా కలిసి పంచుకోవడం అంటే ఇలాగే మరి" అని ఒకరికొకరు సర్ది చెప్పుకున్నారు.



ఆ ఐదుగురూ తాటిదూలాన్ని తమ భుజాల పైకి ఎత్తుకొని ఆపసోపాలు పడుతూ ఆశ్రమానికి చేరుకున్నారు. తాటిదూలాన్ని కిందికి దించి సూదికోసం వెతికితే ఇంకేముంది?

**ఆ తరువాత ఏం జరిగిందో ఊహించండి.**

# ఇవి చేయండి

## I వినడం - ఆలోచించి చెప్పడం




(అ) ఈ కథను పొడిగించండి. శిష్యుల అమాయకత్వాన్ని చూసి గురువుగారు ఏమనుంటారు?

(ఆ) ఈ కథ విన్న మీరు నవ్వుకున్నారు కదా! ఇలాంటివి మీకు నవ్వు తెప్పించిన సంఘటనలు ఏమేమి ఉన్నాయి? చెప్పండి.

(ఇ) మీరు మీ గురువుగారికి ఏ ఏ విషయాలలో సాయపడ్డారో చెప్పండి.

## II ధారాళంగా చదవడం- అర్థంచేసుకొని చెప్పడం. రాయడం



**(అ) పాఠం ఆధారంగా కింది వాక్యాలు తప్పో, ఒప్పో గుర్తించండి.**

1. పరమానందయ్య కాలిలో మేకు దిగింది. (   )
2. సూదికోసం శిష్యులు పక్క ఊరికి వెళ్లారు. (   )
3. సూదికోసం శిష్యులు తగవులాడుకున్నారు. (   )
4. శిష్యులు సూదిని అరటిబోదెకు గుచ్చి తీసుకెళ్ళారు. (   )
5. శిష్యులు తెచ్చిన సూదితో పరమానందయ్య కాలిలో ముల్లును తీశారు. (   )



**(ఆ) పాఠంలోని ఈ వాక్యాలు చదవండి. వాటికి ప్రశ్నలు తయారు చేయండి.**

**ఉదా :** మా ఇంట్లో సూది లేదు. – మీ ఇంట్లో సూది ఉందా?

1. సూది నేను తెస్తాను. – ____________
2. వాళ్ళిద్దరికీ కోపం వచ్చింది. – ____________
3. సూది జారిపడిపోయింది. – ____________
4. అందరూ సూదికోసం వెతికారు. – ____________

**(ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. శిష్యులు సూది తీసుకెళ్లడానికి దూలాన్ని ఎన్నుకోవడానికి కారణం ఏమిటి?
2. శిష్యునికి వచ్చిన అనుమానం ఏమిటి? దానివల్ల ఏం జరిగింది?
3. శిష్యులు చేసిన తెలివితక్కువపని ఏమిటి?
4. పాఠంలో ఏ పేరా మీకు నవ్వు తెప్పించింది?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) కథలో ముల్లు తీయడానికి సూది అవసరం ఏర్పడింది కదా! సూదిని ఇంకా ఏ ఏ పనులకు ఉపయోగిస్తారో రాయండి.

© SCERT not to be republished

(ఆ) కథలో ఏ సన్నివేశం చదివితే మీకు చాలా నవ్వు వచ్చింది? ఆ సంఘటనను సొంతమాటల్లో రాయండి.

(ఇ) సూదిని చాలా జాగ్రత్తగా పట్టుకొని వచ్చారు కదా! మరి మీరు వేటిని తెచ్చేటప్పుడు జాగ్రత్తగా తీసుకొస్తారు?

(ఈ) కథలో కష్టసుఖాలను కలిసి పంచుకోవాలన్నారు కదా! పిల్లలుగా మీరు ఏవేవి ఎవరితో కలిసి పంచుకొంటారు?

(ఉ) కథ చదివారు కదా! పరమానందయ్య శిష్యులు ఎలాంటివారు? వాళ్ళను గురించి ఐదు వాక్యాలు రాయండి.

## IV పదజాలం

(అ) పాఠం ఆధారంగా కింది గుణింతాలతో మొదలయ్యే పదాలను వెతికి రాయండి. ఇలాంటి పదాలు మీకు తెలిసినవి మరికొన్ని రాయండి.



| ✓ | ా | ి | ీ | ు | ూ |
|---|---|---|---|---|---|
| | | | | | |

(ఆ) 'కష్టసుఖాలు' – కష్టం, సుఖం అనే రెండు పదాలు కలిసి జంటగా కష్టసుఖాలు అని ఒకే పదంగా వచ్చింది. దీన్ని 'జంటపదం' అంటారు. ఇలాంటి జంటపదాలను మరికొన్నింటిని రాయండి.

ఉదా : లాభనష్టాలు  పాపపుణ్యాలు  ____________  ____________

(ఇ) "పురమాయించడం" అంటే ఎవరైనా పనిని మరొకరికి అప్పగించడం. మరి మీకు ఎవరెవరు ఏమేమి పురమాయిస్తారో కింది పట్టికలో రాయండి.

| ఎవరు? | వేటిని పురమాయిస్తారు? |
|---|---|
| అమ్మ | ____________ |
| నాన్న | ____________ |
| తాత/అమ్మమ్మ/నాయనమ్మ | ____________ |
| ఉపాధ్యాయుడు | ____________ |

(ఈ) కింద కొన్ని బహువచన రూపంలో ఉన్న పదాలు ఉన్నాయి. వాటి ఏకవచన రూపాలు పాఠంలో ఉన్నాయి. గుర్తించండి. రాయండి.

సూదులు, శిష్యులు, అనుమానాలు, ఉపకారాలు, ఆశ్రమాలు, దూలాలు

________ ________ ________ ________ ________ ________

©SCERT not to be republished

(ఉ) కింద ఇచ్చిన ఆధారాలతో పదాలను పూరించండి.

1. పర్వదినానికి మరో పేరు

2. రైతు పండించేది

3. పక్షులను ఉంచకూడని చోటు

4. పెళ్లికి వేసేది

5. కాయ పక్వానికి వస్తే

| | | |
|---|---|---|
| పం | | |
| పం | | |
| పం | | |
| పం | | |
| పం | | |

V సృజనాత్మకత



(అ) 'సూది కథ'లో శిష్యులు సూదిని జారవిడిచి తాటి మొద్దుతో వచ్చారు కదా! అప్పుడు గురువుగారు శిష్యులతో ఏమి మాట్లాడి ఉంటారో ఊహించుకొని గురుశిష్యులమధ్య సంభాషణ రాయండి.


(ఆ) 'సూది కథ'ను నాటకీకరణ చేయండి.

VI ప్రశంస : పరమానందయ్య గారి శిష్యులు చాలా అమాయకులు కదా! మరి ఇటువంటి అమాయకులు మనకు ఎదురైతే వారి పట్ల మనం ఎలా ప్రవర్తించాలో చెప్పండి.



VII భాషను గురించి తెలుసుకుందాం

(అ) కింది పేరాను చదవండి. (. ,) గుర్తులను సరైన చోట గుర్తించండి. అట్లాగే నామవాచకం, సర్వనామం, క్రియా పదాలను గుర్తించండి.



స్నిగ్ధ ఫణి రమ్య వర్ధన్ జంతు ప్రదర్శనశాలకు వెళ్ళారు వాళ్ళు అక్కడ సింహం పులి ఏనుగు జిరాఫీ కోతి మొదలైన జంతువులను చూశారు అంతేకాకుండా చిలుక నెమలి పావురం లాంటి రకరకాల పక్షులను చూశారు జంతు ప్రదర్శనశాల ముందు పండ్లబండి ఉంది వారు జామ బత్తాయి అరటిపండ్లు కొని తిన్నారు ఆటో ఎక్కి ఇంటికి వచ్చారు.

(ఆ) పాఠం చదవండి. . , గుర్తుల ముందున్న పదాలను గుర్తించి రాయండి.

(.) కు ముందున్న పదాలు ________ ________ ________

(,) కు ముందున్న పదాలు ________ ________ ________

**ప్రాజెక్టు పని**



హాస్య కథలను సేకరించండి. మీకు నచ్చిన కథను రాసి తరగతిలో ప్రదర్శించండి.

**నేనివి చేయగలనా?**

| | | |
|---|---|---|
| 1. | కథను సొంతమాటల్లో చెప్పగలను. పొడిగించగలను. | ఔను/కాదు |
| 2. | కథను ధారాళంగా చదవగలను. తప్పొప్పులను గుర్తించగలను. | ఔను/కాదు |
| 3. | పరమానందయ్య శిష్యుల గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | 'సూదికథ'ను సంభాషణ రూపంలో రాయగలను. | ఔను/కాదు |

లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాసక్తుల్ని లక్ష్య సాధనలో సైతం చూపించాలి. విజయరహస్యమంతా ఇదే.
- స్వామి వివేకానంద

© SCERT not to be republished

ఒకటో యూనిట్

# 3. బాల తిమ్మరుసు

కింది చిత్రం చూడండి.




**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రం చూడండి. ఏమేమి ఉన్నాయో చెప్పండి.
- కింది భాగంలో సూచించిన బొమ్మలు చిత్రంలో దాగున్నాయి. అవి ఎక్కడ ఉన్నాయో గుర్తించండి. ఒక్కొక్క దానికి ఒక రంగు వేయండి.
- మీరు వాటిని ఎలా గుర్తించగలిగారు?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



**తెలివితేటలకు పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు అనే తేడాలేదు. చిన్న పిల్లలు తమ మేధాశక్తితో పెద్దవాళ్ళను ఆశ్చర్యపరిచే ప్రతిభను ప్రదర్శిస్తుంటారు. ఇలా ఒక బాలుడు తన తెలివితేటలతో ఎంత గొప్ప పదవి పొందాడో ఈ కథను చదివి తెలుసుకుంటారు.**

ఒకరోజు గురువుగారి దగ్గరకు ఇద్దరు రాజభటులు వచ్చారు. వారి చేతిలో ఒకరాతి పలక ఉంది. ఆ పలక మీద ఒక గీత ఉంది. రాజభటులు గురువుగారికి పలకను చూపించి “ఆర్యా! మేం విజయనగర సామ్రాజ్యాధీశులైన శ్రీశ్రీశ్రీ వీరనరసింహ రాయలవారి సేవకులం. మహారాజుగారి ఆజ్ఞానుసారం మహామంత్రి పదవికి తగిన బుద్ధిమంతుడూ సమర్థుడూ అయిన వ్యక్తికోసం ఊరూరా తిరుగుతున్నాం. కాని, ఎక్కడా మాకు అటువంటి వ్యక్తి కనిపించలేదు. తమరిని కూడా దర్శించి పోదామని ఇలావచ్చాం” అన్నారు.

అప్పుడు గురువుగారు “ఆశ్చర్యంగా ఉన్నదే! ఇంత వరకూ మీ ప్రయత్నం సఫలం కాలేదా? అయితే మహామంత్రి పదవికి అధికవయస్సు, విశేషానుభవం వంటి నియమాలు ఏమైనా ఉన్నాయా!” అని అడిగారు.



రాజభటులు “మహాశయా! మంత్రికావడానికి వయస్సు, అనుభవం, అందం చందం, చదువూ సంధ్యలతో నిమిత్తం లేదు. బుద్ధికుశలత ఉంటేచాలు. అందుకే మహారాజుగారు ఒక పరీక్షపెట్టారు. ఇదిగో చూడండి. ఈ పలకమీద ఉన్న గీతను ఎవరైతే తాకకుండా, చెరపకుండా చిన్న గీతగా చేయగలరో వారిని వెంటనే వెంటబెట్టుకొని రమ్మని రాజాజ్ఞ” అని విన్నవించారు.

అందుకు గురువుగారు ఆశ్చర్యపోతూ “ఇది చాలా విచిత్రంగా ఉన్నదే! ఇదెలా సాధ్యం? ఉన్న గీతను తాకకుండా, చెరపకుండా చిన్నది చేయాలంటే ఏ మంత్రమో, తంత్రమో, మహేంద్రజాలమో కావాలి. అంతేకాని సామాన్యులకు వీలయ్యే విషయం కాదిది” అని నీళ్ళునమిలారు.

ఆ సంభాషణ అంతా ఆసక్తిగా ఆలకిస్తున్న ఒక బాలుడు ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. “గురువర్యా! ఆ పలక ఇలా ఇవ్వండి ఒక్కమారు చూస్తాను” అన్నాడు. గురువుగారు చిరాకుపడుతూ “నీకెందుకురా ఇది? కొమ్ములు తిరిగినవాళ్లకే ఇది సాధ్యంకాలేదు. ఇక నీకేం తెలుస్తుంది? అయినా ఏం పోయిందిలే, చూడు” అంటూ పలకను అతని చేతికిచ్చాడు. పిల్లలంతా కళ్ళార్పకుండా ఆ బాలునివైపే చూస్తున్నారు.

© SCERT not to be republished

ఆ బాలుడు పలకమీద ఉన్న గీతను పరీక్షగా చూశాడు. వెంటనే ఒక బలపం తీసుకొని ఆ గీత కింద మరొక పెద్ద గీత గీశాడు. దాన్ని చూపిస్తూ "చూశారా? గురువుగారూ! గీతను చెరపకుండా పెద్ద గీతను చిన్నదాన్ని చేశాను. నేను గీసిన ఆ పెద్ద గీతముందు ఇది చిన్నదేగా!" అన్నాడు ఆ బాలుడు. గురువుగారు శిష్యుడి మేధాశక్తికీ, కుశాగ్రబుద్ధికీ, సమయస్ఫూర్తికీ ఎంతో సంతోషించారు. రాజభటులు ఆ బాలమేధావిని గుఱ్ఱంమీద కూర్చుండబెట్టుకొని సగౌరవంగా రాజసభకు తీసుకువెళ్లారు.


విజయనగర సార్వభౌముడైన వీరనరసింహరాయలు కొలువుతీరి ఉన్నారు. రాజభటులు ఆ బాలుని ప్రభువుకు చూపించి "మహారాజా! తమరు పెట్టిన పరీక్షలో నెగ్గినవాడు ఈ బాలుడే" అని పలకను అందించారు.

మహారాజు ఆశ్చర్యంతో "ఈ ముక్కుపచ్చలారని ముద్దుబాలుడు ఎంత ప్రతిభావంతుడు! నాకు ఇటువంటి బుద్ధిమంతుడే మహామంత్రిగా కావాలి" అని మనసారా కోరుకున్నాడు. అనంతరం ఆయన ఆ బాలుణ్ణి చూస్తూ, "నీ ప్రతిభ అనన్యసామాన్యం. ఇదిగో ఈ బంగారు ఉంగరాన్ని ఈ ఉన్నత రత్నపీఠంమీద పెడుతున్నాను. నీవు నిలబడిన చోటు నుండి ఇక్కడిదాకా ఉన్న పట్టుతివాచీపై పాదం పెట్టకుండా వచ్చి ఉంగరం తీసుకోవాలి. బయలుదేరిన చోటుకి తిరిగి వెళ్ళాలి. అలా చేయగలిగితే ఈ సువర్ణాంగుళీయకమే నీకు అధికార చిహ్నంగా భాసిస్తుంది" అని పలికాడు.

©SCERT not to be republished

ఆ బాలుడు చిరునవ్వుతో "చిత్తం ప్రభూ! అలాగే ప్రయత్నిస్తాను" అంటూ అంత పెద్ద తివాచీపై నడవకుండా ఎలా వెళ్ళాలా అని ఒక్కక్షణం ఆలోచించాడు. సభ్యులందరూ కుతూహలంగా ఆ బాలుడినే తిలకిస్తున్నారు. ఆ బాలుడు వెంటనే పట్టుతివాచీని పట్టుకొని నెమ్మదిగా చుట్టుకుంటూ ముందుకు నడిచి వెళ్లాడు. రత్నపీఠంమీద తళతళా మెరిసిపోతున్న బంగారు ఉంగరాన్ని అందుకున్నాడు. తిరిగి తివాచీని విప్పి పరుచుకుంటూ యథాస్థానానికి వచ్చాడు. సభాసదులందరూ ఆ బాలుని ధీయుక్తికీ, సమయస్ఫూర్తికీ జేజేలు పలుకుతూ కరతాళ ధ్వనులు చేశారు. ఆ బాలమేధావే తిమ్మరుసు. తిమ్మరుసు వినయపూర్వకంగా వీరనరసింహరాయల వైపు చూశాడు. మహారాజు మహానందంతో అతన్ని ఆలింగనం చేసుకొని అమాత్యపీఠాన్ని అలంకరింపజేశాడు. "మహామేధానిధీ ఈ క్షణంనుంచి ఈ విజయనగర సామ్రాజ్యానికి మహామాత్యులు మీరే. అన్ని విషయాలలో మాకు మార్గదర్శకులై, అమాత్యలోకానికి ఆదర్శప్రాయులై వర్ధిల్లండి," అన్నారు. వెంటనే గుబాళిస్తున్న గులాబీల దండను తిమ్మరుసు మెడలో వేశాడు వీరనరసింహ రాయలు. "మహామంత్రి తిమ్మరుసుకు జై" అన్న నినాదాలతో మహాసభ మారుమ్రోగింది.

**– కరుణశ్రీ డా॥ జంధ్యాల పాపయ్య శాస్త్రి.**



# ఇవి చేయండి

**I** **వినడం, ఆలోచించి చెప్పడం**




(అ) తిమ్మరుసును బుద్ధిమంతుడు, సమర్థుడు అని సభలోని వారు పొగిడారు కదా! తెలివిగా ఏపని చేసినా అలా మెచ్చుకుంటారు. మీరు ఏ ఏ పనులను సమర్థతతో చేయగలుగుతారు?

(ఆ) అన్ని పనులూ అందరికీ సాధ్యం కావు. మీకు సాధ్యమయ్యే పనులేవి? సాధ్యంకాని పనులేవి?

(ఇ) బాల తిమ్మరుసు కథను మీ సొంతమాటల్లో చెప్పండి.

**II** **ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం**



(అ) "గీతను తాకకుండా, చెరపకుండా చిన్నది చేయాలంటే ఏ మంత్రమో, తంత్రమో, మహేంద్రజాలమో కావాలి" అని ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారో చెప్పండి.

(ఆ) కింది పదాలు చదవండి. ఆ పదాలతో వచ్చే వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించండి. ఆ వాక్యాల కింద గీత గీయండి. ఆ వాక్యాల అర్థం చెప్పండి.

విశేషానుభవం, బుద్ధికుశలత, ముక్కుపచ్చలారని, సార్వభౌముడు, అనన్యసామాన్యం.

(ఇ) **పాఠం చదవండి రాయండి.**

1. కథపేరు : ____________________
2. కథలో ఉన్నవారు (పాత్రల పేర్లు) : ____________________
3. కథలో ఉన్న ముఖ్యమైన విషయం/ సమస్య : ____________________
4. ముగింపు (చివరకు ఏమి జరిగింది?) : ____________________

(ఈ) **కింది పేరాను చదవండి. పేరాలో తారుమారైన పదాలను ఉండవలసిన చోట పెట్టి పేరాను తిరిగి రాయండి.**



మహారాజు వీరనరసింహరాయలు తిమ్మరుసును ఉద్దేశించి నీ బయలుదేరిన అనన్య సామాన్యం. ఇదిగో ఈ పట్టు ఉంగరాన్ని ఈ ఉన్నత రత్న పాదం మీద పెడుతున్నాను. మీరు నిలబడిన చిహ్నం నుండి ఇక్కడి దాకా బంగారు తివాచీ పరచి ఉన్నది కదా! మీరు ఆ తివాచీపై పీఠం పెట్టకుండా వచ్చి ఉంగరం అందుకొని ప్రతిభ చోటుకు రావాలి. అలా చేయగలిగితే ఈ సువర్ణాంగుళీయకమే మీకు అధికార చోటుగా లభిస్తుంది అని పలికాడు.

(ఉ) **కింది పేరాను చదవండి. ప్రశ్నలు రాయండి.**

ఒకరోజు తిమ్మరుసు గురువుగారి వద్దకు ఇద్దరు రాజభటులు వచ్చారు. వారిచేతిలో ఒక రాతి పలక ఉన్నది. ఆ పలకమీద ఒక గీత ఉన్నది. రాజ భటులు గురువుగారికి పలకను

© SCERT not to be republished

చూపి "అయ్యా! మేము రాజభటులం. ఈ పలకమీద ఉన్న గీతను తాకకుండా, చెరపకుండా, చిన్నదిగా చేసినవారిని వెంటబెట్టుకొని రమ్మని రాజాజ్ఞ. ఇది మంత్రి పదవికోసం పరీక్ష" అన్నారు. గురువుగారు ఏ మంత్రమో, తంత్రమో, మహేంద్రజాలమో! అయితే తప్ప ఇది సాధ్యం కాదన్నారు. తిమ్మరుసు ఆ పలకను తీసుకొని ఆ గీత కింద మరొక పెద్దగీత గీసి చిన్నదిగా చూపించాడు. గురువుగారు శిష్యుడి మేధాశక్తిని మెచ్చుకున్నారు.

**(ఊ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. రాజభటులు గురువుగారితో ఏమని చెప్పారు?
2. మహారాజు పెట్టిన పరీక్షలో తిమ్మరుసు ఎలా నెగ్గాడు?
3. ఉంగరం పరీక్షలో తిమ్మరుసు నెగ్గిన తరువాత మహారాజు తిమ్మరుసును ఉద్దేశించి ఏమన్నాడు?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) కథలో మీకు ఆశ్చర్యం కలిగించిన సంఘటన ఏది? అది మీకు ఎందుకు ఆశ్చర్యం కలిగించిందో రాయండి.

(ఆ) మహారాజుగారు మంత్రిపదవికి పరీక్ష ఎందుకు పెట్టవలసి వచ్చిందో ఊహించండి.


(ఇ) మహారాజు తిమ్మరుసును చూసి నీ ప్రతిభ "అనన్య సామాన్యం" అని అన్నాడు కదా! అంటే అర్థమేమిటి? అనన్య సామాన్యం అని ఇంకా ఏ ఏ సందర్భాలలో అంటారు.

(ఈ) తిమ్మరుసు ఎలాంటి వాడు? 5, 6 వాక్యాలు రాయండి.

## IV పదజాలం



**(అ) మీరంతా గుణింతాలు నేర్చుకున్నారు కదా! కింది చక్రంలోని అక్షరాలతో గుణింతాన్ని జతచేయండి. ఒక్కొక్క అక్షరంతో వచ్చే పదాలను రాయండి.**






© SCERT not to be republished

(ఆ) **1, 2, 3 పాఠాలు చదవండి. కింది గుణింతాక్షరాలతో ప్రారంభమైన పదాలు పాఠాలలో వెదికి రాయండి. పాఠంలో అలాంటి పదాలు లేకుంటే సొంతంగా రాయండి.**

| ✓ | ◌ా | ◌ి | ◌ీ | ◌ు | ◌ూ | ◌ృ | ◌ౄ | ◌ె | ◌ే | ◌ై | ◌ొ | ◌ో | ◌ౌ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | | | | | | |

(ఇ) **అందం చందం, చదువూ సంధ్యలాంటి పదాలు మరికొన్ని ఇక్కడ ఉన్నాయి. ఖాళీలను తగిన పదాలతో పూరించండి. ఇలాంటివే మరికొన్ని రాయండి.**

1. తోడు ____________; 2. సిరి ____________;
3. పాడి ____________; 4. వంట ____________;
5. ఈడూ ____________; 6. పురుగు ____________;
7. పిల్లా ____________; 8. నగా ____________;
9. చిందర ____________; 10. రాళ్ళూ ____________;

(ఈ) **కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అదే అర్థం వచ్చే పదాలతో కొత్తవాక్యం రాయండి.**

1. రాజభటులు గురువుగారిని దర్శించి పోదాం అని వచ్చారు.
______________________________________________
2. తిమ్మరుసు సమయస్ఫూర్తికి సభలోని వారందరూ కరతాళ ధ్వనులు చేశారు.
______________________________________________
3. తిమ్మరుసు సువర్ణాంగుళీయకం ధరించాడు.
______________________________________________
4. సభలోని వారందరూ బాల తిమ్మరుసునే కుతూహలంగా తిలకించారు.
______________________________________________
5. మా సామ్రాజ్యానికి మహామాత్యులు మీరే.
______________________________________________



(ఉ) **తిమ్మరుసు ఎంతో ప్రతిభావంతుడు కదా!**

1. ప్రతిభకలిగిన వాణ్ణి ప్రతిభావంతుడు అంటారు.
2. బుద్ధికలిగిన వాణ్ణి ____________ అంటారు.
3. సమర్థంగా పనిచేసేవాణ్ణి ____________ అంటారు.

©SCERT not to be republished

4. మేధాశక్తి ఎక్కువగా ఉంటే __________ అంటారు.

5. తెలివిలేనివాణ్ణి __________ అంటారు.

6. అందరికీ మార్గం చూపేవాణ్ణి __________ అంటారు.

7. అందరికీ ఆదర్శంగా నిలిస్తే __________ అంటారు.

**(ఊ) ఈ కింది పేరా చదవండి. గీతగీసిన పదాలలో ఏవి ఏకవచనాలో, ఏవి బహువచన పదాలో గుర్తించి రాయండి.**


ఒక అడవిలో కొన్ని జంతువులు ఆశ్చర్యకరంగా ప్రవర్తించేవట. ఆ అడవిలో ఒకచోట నిర్మల సరోవరం ఉంది. అక్కడికి నీళ్ళు తాగడానికి నాలుగు రకాల అడవి జంతువులు వేళ తప్పకుండా వస్తూ ఉండేవి. లేళ్ళు మూడేసి రోజులకొకసారి, చమరీమృగాలు ఐదేసి రోజులకొకసారి మధ్యాహ్నం నడినెత్తిన సూర్యుడున్నప్పుడు ఆ సరస్సుకు వచ్చేవి. ఖడ్గమృగాలు ఏడేసి రోజులకొకసారి, ఏనుగులు తొమ్మిదేసి రోజులకొకసారి అదే వేళకు వచ్చేవి. అవి అన్నీ కలసి ఒకచోట గుమిగూడి భయం లేకుండా నీళ్ళు తాగుతూ ఉంటే, ఏనుగులు తొండాలతో నీళ్ళుపీల్చి సరదాకి ఇతర జంతువుల మీద చిమ్ముతూ ఉంటే ఆ దృశ్యం చూడ ముచ్చటగా ఉండేది.

© SCERT not to be republished

**V. సృజనాత్మకత:** బాల తిమ్మరుసును అతని స్నేహితులు కలిశారు. వాళ్ళు ఏమి మాట్లాడుకున్నారో ఊహించి సంభాషణ రాయండి.



**VI ప్రశంస: కింది వాటిలో ఏదైనా ఒక దానిని చేయండి.**




(అ) గురువుగారు తిమ్మరుసు సమయస్ఫూర్తిని మెచ్చుకున్నారు కదా! అట్లాగే మీ ఉపాధ్యాయులు కూడా మిమ్మల్ని మెచ్చుకోవడానికి ఏమేమి చేస్తారో చెప్పండి.


(ఆ) తిమ్మరుసులాగా మీ స్నేహితులు ఏవైనా పరీక్షల్లో నెగ్గితే ఎలా ప్రశంసిస్తారు? ఓడిపోతే ఏం చెబుతారు?

**VII భాషను గురించి తెలుసుకుందాం**

**(అ) కింది వాక్యాలను చదవండి.**




- పాలపిట్ట అందంగా ఉంది.
- నేను జాతరలో ఎర్రని గాజులు కొన్నాను.
- వేపకాయ చేదుగా ఉంటుంది.
- మల్లెపూలు మంచి వాసననిస్తాయి.



**పై వాక్యాలలో గీతగీసిన పదాలను గమనించండి.**

‘అందంగా, ఎర్రని, చేదుగా, మంచి’ అనేవి గుణాన్ని తెలిపేపదాలు. ‘పాలపిట్ట, గాజులు, వేపకాయ, మల్లెపూలు’ అనేవి నామవాచక పదాలు. ఇలా నామవాచకాల గుణాలను తెలిపే పదాలను ‘విశేషణాలు’ అంటారు.

**(ఆ) కింది వాక్యాలు చదవండి. విశేషణ పదాల కింద గీత గీయండి.**



1. ఏనుగు పెద్ద జంతువు.
2. చక్కెర తియ్యగా ఉంటుంది.
3. సీత అందమైన అమ్మాయి.
4. కాటుక నల్లగా ఉంటుంది.
5. అత్తరు వాసన మంచిగా ఉంటుంది.

**(ఇ) కింది విశేషణ పదాలను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

తెలివైన, వేగంగా, చిక్కని, చక్కని, పొడవైన

_______________________________________________

_______________________________________________

_______________________________________________

© SCERT not to be republished

**ప్రాజెక్టు పని**



సమయస్ఫూర్తికి సంబంధించిన కథలను సేకరించండి. చదవండి. మీకు నచ్చిన కథను రాసి గోడపత్రికలో ప్రదర్శించండి.

**నేనివి చేయగలనా?**

| | |
|---|---|
| 1. కథను సొంతమాటల్లో చెప్పగలను. సాధ్యమయ్యేవి, కానివాటి గురించి చెప్పగలను. | ఔను/కాదు |
| 2. కథను ధారాళంగా చదవగలను. చదివిన అంశానికి ప్రశ్నలు రాయగలను. | ఔను/కాదు |
| 3. తిమ్మరుసు గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. సంభాషణలను ఊహించి రాయగలను. | ఔను/కాదు |

పదవులకు అలంకారం దుస్తులు కావు. వ్యక్తిత్వం, సేవా భావం ముఖ్యం.

ఒకటో యూనిట్


# 4. చిన్నారి కల

కింది చిత్రం చూడండి.



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రం చూడండి. ఏమి జరుగుతుందో చెప్పండి.
- మీకు కూడా ఇలా ఎప్పుడైనా కలలు వచ్చాయా? ఏ ఏ కలలు వచ్చాయి?
- చెట్లకు రెక్కలు వచ్చి ఎగిరితే ఎలా ఉంటుందో చెప్పండి. అవి మనతో మాట్లాడితే ఏం చెబుతాయో చెప్పండి.



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**మనందరికీ కలలొస్తుంటాయి కదా! అలాగే ప్రజ్ఞకు కూడా కల వచ్చింది. ఆ కలలో కనిపించిన కొన్ని వస్తువులు ప్రజ్ఞతో తమ గురించి చెప్పుకున్నాయి. వాటి మాటలు విన్న ప్రజ్ఞలో మార్పు వచ్చింది. ప్రజ్ఞకు కలలో ఏం కనిపించాయి? అవి ఏమి చెప్పాయి? పాఠం చదివి తెలుసుకోండి.**

ప్రజ్ఞకు చాలా సంతోషంగా ఉంది. ఆరోజు తనకు కొత్త పుస్తకాలు వచ్చాయి. వాటిని సర్దుకోవాలి. ప్రజ్ఞకు కథలంటే చాలా ఇష్టం. తన వద్ద బోలెడు కథల పుస్తకాలు కూడా ఉన్నాయి. కథల పుస్తకాలను, తన తరగతి పుస్తకాలను సర్దుకోవాలనుకుంది. పుస్తకాల అలమరలో పైభాగం ఖాళీ చేయాలి. కానీ ఆ చోట అన్నీ



పాత కాగితపు సంచులు, ధూళితో నిండి ఉన్నాయి. ప్రజ్ఞ కాగితపు సంచులన్నీ తీసి చెత్తబుట్టలో పారేసింది. అలమర అంతా చక్కగా శుభ్రం చేసి, పుస్తకాలను సర్దేసింది. అలసిపోయిన ప్రజ్ఞ చందమామ పుస్తకం తీసుకొని చదవడం మొదలు పెట్టింది. చదువుతూ, చదువుతూనే నిద్రలోకి జారుకుంది.

© SCERT not to be republished

అంతలోనే ప్రజ్ఞ కళ్లముందు ఒక చిత్రమైన సన్నివేశం కనిపించింది. తాను పారేసిన కాగితపు సంచులన్నీ గుంపుగా ఓచోట చేరి గుసగుసలాడుకుంటున్నాయి.

ప్రజ్ఞ శ్రద్ధగా వాటి మాటలను వినసాగింది.

‘ఇప్పుడు మనల్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇంతకుముందైతే ప్రజ్ఞ వాళ్ళ అమ్మానాన్నలు మనల్ని జాగ్రత్తగా దాచిపెట్టి మరీ వాడేవారు.” అంది ఓ సంచి.


"ఇన్ని రోజులుగా మనం దుమ్ముపట్టి మూలిగాం. ఈరోజు ప్రజ్ఞ మనల్ని తీసింది! ఏం లాభం! తీసి నేరుగా చెత్తబుట్ట లోకే విసిరేసింది." అని మరో సంచి అంది.

"ఇప్పుడంతా ప్లాస్టిక్ యుగమే బాబూ! కాగితపు సంచులు ఎవరికి కావాలి? కుర్చీలు, బల్లలు, గిన్నెలు, డబ్బాలు అన్నీ ప్లాస్టిక్‌మయమే! ఎటు చూసినా ప్లాస్టిక్! ప్లాస్టిక్! చివరికి ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే జెండాలు, ఫోటోలు సైతం బట్టతో చేసినవి కాక ప్లాస్టిక్‌వే కదా! అందరికీ ప్లాస్టిక్ పిచ్చే పట్టింది." అంది మరో సంచి.

ఈ మాటలు విన్న ప్రజ్ఞ కాగితపు సంచుల్తో ఇలా అంది. "అవును మరి! ప్లాస్టిక్‌తో ఎన్నో లాభాలున్నాయి కాబట్టే అందరికీ ప్లాస్టిక్‌పై మోజు పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు వివిధ రంగుల్లో ఆకర్షణీయంగా ఉంటాయి. మట్టి వస్తువుల్లా అవి త్వరగా పగిలిపోవు. అలాగే కాగితపు వస్తువుల్లా నీళ్ళు తగలగానే చిరిగిపోవు. అంతే కాదు ప్లాస్టిక్ వస్తువులు, స్టీలు వస్తువుల్లా ఎక్కువ ఖరీదు కూడా ఉండవు" మరి.

"కానీ ప్లాస్టిక్ వల్ల ఎంతో నష్టం ఉంది. అది తెలుసా నీకు?" అని మరో కాగితపు సంచి ప్రజ్ఞతో అంది.

"తెలియదు" అన్న ప్రజ్ఞతో కాగితపు సంచి ఇలా అంది. "విను మరి! కాగితపు సంచులు, మట్టి వస్తువులు, కర్రవస్తువులు పాడైపోయినప్పుడు వాటిని పారేస్తారు కదా! అవి కొన్ని రోజుల తర్వాత కరిగి మట్టిలో కలసిపోతాయి. కాని, ప్లాస్టిక్ వస్తువులను మట్టిలో పారేస్తే అవి మట్టిలో కలిసిపోవు, సరికదా మట్టి అంతా ప్లాస్టిక్ మయం అవుతుంది.



© SCERT not to be republished

ప్లాస్టిక్ వస్తువులు, సంచులు ఎన్ని సంవత్సరాలైనా నశించకుండా భూమి పొరల్లో అలాగే ఉండిపోయి, పంటలు పండకుండా చేస్తాయి. ఈ ప్లాస్టిక్/ పాలిథిన్ సంచులు చెరువులు, కాలువలు, జలాశయాల్లో ఉండి కొన్ని సంవత్సరాల వరకు నీటిలో ఉన్న చేపలు, కప్పలు చనిపోయేటట్లు చేస్తున్నాయి. కాలుష్యకారకాలవుతున్నాయి. అలాగని వాటిని కాల్చేద్దాం అని అనుకుంటే కరిగిన ఆ ప్లాస్టిక్ నుండి విషవాయువులు విడుదలై జీవకోటికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది తెలుసా?" అంది కాగితపు సంచి.

"అయితే సరే! ప్లాస్టిక్ పర్యావరణాన్ని పాడు చేస్తుంది. నష్టపరుస్తోంది అని నమ్ముదాం. కానీ మనం ప్లాస్టిక్ వాడడం మానేసి, కాగితాన్నే వాడడం మొదలుపెడితే ఎంత కాగితమైనా సరిపోతుందా? అందుకు ఎన్నో చెట్లను నరికివేయాల్సి వస్తుంది కదా! దీనివల్ల పర్యావరణం నష్టపోదా! చెప్పండి!" అని ప్రజ్ఞ ఎదురు ప్రశ్న వేసింది.

పెద్ద కాగితపు సంచి ప్రజ్ఞకు నచ్చజెబుతూ ఇలా అంది. "మన అవసరాలకు కావల్సినంత వినియోగించుకోవడంలో తప్పు లేదు. కానీ అవసరాలకు మించి వృథాచేయడం సరికాదు. గాంధీగారు ప్రకృతి వనరుల గురించి "ప్రకృతి వనరులు మనిషి అవసరాలకు కావలసినంతగా ఉన్నాయి. కానీ వాటిని వృథా చేసేంతగా వనరులు మనకు లేవు." అన్నారు. మనం కాగితాన్ని కావల్సినంత పద్ధతిగా, పొదుపుగా వాడుకుంటే అనవసరంగా ఎక్కువ చెట్లను నరకాల్సిన పని కూడా ఉండదు.

మరోమాట ప్రజ్ఞా! ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటారనుకో! చెట్లకు కొదవే ఉండదు కదా! నీకు గుర్తుందా! మన పక్కింటి రుత్విక్ పుట్టినప్పుడు వాళ్ళ నాన్న శీను అందుకు గుర్తుగా అదే రోజు ఓ వేపమొక్కను నాటారు. నువ్వు కూడా నీ ప్రతి పుట్టినరోజునాడు ఓ మొక్క నాటినట్లైతే ఎంత బాగుంటుందో కదా! ఆలోచించు", అని అంది.

'ఔను, నిజంగానే మంచి ఆలోచన. చాలా మంచి మాటలు చెప్పావు. ఇప్పుడే అఖిల్, మనోజ్ఞ, నిఖిల్, లిఖిత, నితీశ్, శివ వాళ్ళందరికీ ఈ విషయం చెబుతా. మీ సలహా తప్పక పాటిస్తాం. తప్పక చెట్లను నాటుతాం." అంది ప్రజ్ఞ.




"మరి అలాగని మాకు మాట ఇవ్వు" అని ఓ చిన్న కాగితపు సంచి అనగానే, ప్రజ్ఞ చిరునవ్వు నవ్వి, "నేను మీకు మాట ఇస్తున్నాను. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి మీ కాగితంతో తయారయిన వస్తువులనే ఎక్కువగా వినియోగిస్తాను." అంది ఇంతలో "ప్రజ్ఞా లేమ్మా! తెల్లారింది" అంటూ ప్రజ్ఞను వాళ్ళ అమ్మ నిద్రలేపింది. అంతే!

ప్రజ్ఞ ఒక్క ఉదుటున లేచి గబగబా పక్క దిగింది. వెంటనే చెత్తబుట్టవద్దకు వెళ్లి చెత్తబుట్టలో పారేసిన కాగితపు సంచులన్నీ తీసి దుమ్ము దులిపి జాగ్రత్తగా అలమరాలో సర్దింది. అది చూసి వాళ్ళ అమ్మ చిరునవ్వు నవ్వింది.

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) మీ ఇళ్లల్లో వాడే ప్లాస్టిక్ వస్తువుల పేర్లు చెప్పండి. వాటిని దేనికి ఉపయోగిస్తారో చెప్పండి.

(ఆ) రుత్విక్ పుట్టిన రోజు నాడు వాళ్ళ నాన్న శీను ఒక వేపమొక్క నాటారు కదా! ఇలా ప్రతి ఒక్కరు చేస్తే ఎలా ఉంటుంది?

(ఇ) ప్రజ్ఞతో కాగితపు సంచులు తమగురించి మాట్లాడాయి కదా! అట్లాగే పక్షులైతే తమ గురించి ఏం మాట్లాడి ఉంటాయో ఊహించి చెప్పండి.

(ఈ) ప్లాస్టిక్ వినియోగం గురించి అఖిల్ సమర్థిస్తూ మాట్లాడాడు. సలీమా వ్యతిరేకిస్తూ మాట్లాడింది. మరి మీరైతే ఏం మాట్లాడతారు? చెప్పండి.

## II ధారాళంగా చదవడం అర్థంచేసుకొని చెప్పడం, రాయడం

**(అ) పాఠాన్ని చదవండి. కింది పట్టిక నింపండి.**



| అంశం | కారణం |
|---|---|
| ● ప్రజ్ఞ సంతోషంగా ఉంది. | ● ______________ |
| ● ప్రజ్ఞ అలమరను శుభ్రం చేసింది. | ● ______________ |
| ● చెత్తబుట్టలోని కాగితాలను ప్రజ్ఞ తీసింది. | ● ______________ |
| ● శీను అంకుల్ వేపమొక్క నాటాడు. | ● ______________ |
| ● ______________ | ● ______________ |

**(ఆ) పాఠం చదవండి. దాని ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**




1. ప్రజ్ఞ అలమరలో నుంచి కాగితపు సంచులు ఎందుకు తీసేసింది?
2. కాగితపు సంచులు తమలోతాము ఏం మాట్లాడుకుంటున్నాయి?
3. ప్రజ్ఞతో పెద్ద కాగితపు సంచి ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాల గురించి ఏమని చెప్పింది?
4. ప్రజ్ఞ కాగితపు సంచులకు ఏమని మాట ఇచ్చింది?
5. కల రాకముందు ప్రజ్ఞ ఏం చేసింది? కల అయిపోయాక ఏం చేసింది?

**(ఆ) కింది పేరాను చదవండి. దీని ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఈ మానవులకు ఎంతమాత్రం దయాదాక్షిణ్యాలు లేనే లేవు. మనం వీళ్లకు నీడనిస్తున్నాం. పూలు ఇస్తున్నాం. పండ్లను ఇస్తున్నాం. ఆకులు ఇస్తున్నాం. ఆహారాన్ని ఇస్తున్నాం. ఐనా ఏమాత్రం కనికరం లేదు. మనం చిన్నగా ఉంటే చూడకుండా తొక్కుకుంటూ నడుస్తారు.

© SCERT not to be republished



ఎప్పుడైనా బుద్ధిపుడితే నాటుతారు. కనీసం రోజూ నీళ్ళైనా పోయరు. మనలను కాపాడుకోవాలనే ప్రయత్నం చేయరు. మనవల్లనేకదా! ఈ భూమి అంతా పచ్చగా, అందంగా కళకళలాడుతూ చూడముచ్చటగా ఉంటుంది. తమ అవసరాలకోసం మాత్రం విచక్షణారహితంగా నరికివేస్తారు. మళ్లీ మనలను పెంచాలని, నాటాలని ఏమాత్రం ఆలోచించడం లేదు. మనం లేకుంటే భవిష్యత్తులో వీళ్ళు ఎన్ని కష్టాలు ఎదుర్కొంటారో! వీళ్ళను చూస్తే జాలేస్తుంది. వీళ్ళు మనలను నాటకున్నా, పెంచకున్నా, అడవుల్లో ఎదిగిన మనని రోజు రోజుకూ నరికివేస్తూ తమ ముప్పును తామే కొనితెచ్చుకుంటున్నారు. కనీసం ఈ బడిపిల్లలైనా మనగోడును వింటారేమో చూద్దాం. పిల్లలూ! మీరైనా ఏడాదికో మొక్కను నాటండి, నీరుపోయండి, వాటిని కాపాడండి. జాగ్రత్తగా పెంచండి. మేము పెద్దగా అయి మీకే ఉపయోగపడతాం!

1. పై మాటలు ఎవరు చెబుతున్నారు? ఎవరిని ఉద్దేశించి చెబుతున్నారు?
2. పై పేరాకు ఒక పేరు పెట్టండి.
3. చెట్లు ఎవరిని వేడుకుంటున్నాయి? ఏమని వేడుకుంటున్నాయి?
4. చెట్లు మనకు ఏ విధంగా ఉపయోగపడతాయి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) ప్రజ్ఞ కలలో కాగితపు సంచులు మాట్లాడుకుంటున్నట్లు చూసింది కదా! మరి వాటితో పాటు ప్లాస్టిక్ సంచులు కూడా ఉండి ఉంటే అవి ఏమి మాట్లాడేవో ఊహించి రాయండి.

(ఆ) "ఇప్పుడంతా ప్లాస్టిక్ యుగమే బాబూ!" అని కాగితపు సంచి అంది కదా! ఈ పరిస్థితిని మార్చాలంటే మనమేం చేయాలో రాయండి.

(ఇ) రుత్విక్ పుట్టినరోజునాడు చెట్టు నాటాడు కదా! ఇలా పుట్టిన రోజునాడు ఇంకా ఏ ఏ మంచి పనులు చేయవచ్చు?

(ఈ) మీ ఊరు/ వాడ/ కాలనీలో ఎవరి ఇంట్లో ఎక్కువ చెట్లు ఉన్నాయి? ఎందుకు?

## IV పదజాలం



**(అ) కింది పదాలు చదవండి. ఏవైనా రెండు పదాలను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| పుస్తకాలు | కాగితం | చెత్తబుట్ట | ప్లాస్టిక్ | భూమి |
| అవసరం | వినియోగం | రంగు | ముప్పు | కాపాడడం |

**(ఆ) మీ ఇంట్లో, మీ చుట్టుపక్కల వాళ్ళు ఏ ఏ ప్లాస్టిక్ వస్తువులను వాడుతున్నారో రాయండి.**

**ఉదా :** దువ్వెన ____________

____________ ____________

© SCERT not to be republished

(ఇ) పైన మీరు రాసిన వస్తువులు ప్లాస్టిక్‌తో కాకుండా ఏ ఇతర పదార్థాలతో తయారుచేసి వాడుకోవచ్చో ఊహించి రాయండి.

**ఉదా :** చెక్క దువ్వెన ____________ ____________

____________ ____________ ____________

(ఈ) ఒక అక్షరానికి అదే అక్షరం ఒత్తుగా వస్తే వాటిని **'ద్విత్వాక్షరాలు'** అంటారని మీకు తెలుసుకదా! కింద ఉన్న ద్విత్వాక్షరాలతో ఉన్న పదాలను ఇంతకు ముందు పాఠాల నుండి వెతికి రాయండి.

క్క గ్గ చ్చ జ్జ ట్ట డ్డ త్త ద్ద న్న

**ఉదా :** మొక్క __________ __________ __________

__________ __________ __________


(ఉ) పాఠంలోని పాపపేరు ప్రజ్ఞ కదా!

'ప్రజ్ఞ' పేరులో 'జ్ఞ' అనే అక్షరం ఉంది కదా! ఇలా 'జ్ఞ' ఉన్న పదాలను మరికొన్ని రాయండి.

**ఉదా:** ఆజ్ఞ, మనోజ్ఞ, __________ __________ __________

__________ __________ __________

## V సృజనాత్మకత



ప్లాస్టిక్ సంచుల్లాగే పక్షులు కలలో కనిపించి ప్రజ్ఞతో మాట్లాడాయి. గతంలో ఐతే వాటిపట్ల అందరూ ప్రేమగా ఉండేవారని, ఇప్పుడెవరూ పట్టించుకోవడంలేదని వాటి గోడును చెప్పుకున్నాయి. ఆ పక్షులు ప్రజ్ఞతో ఏమి మాట్లాడి ఉంటాయో ప్రజ్ఞకూ పక్షులకూ మధ్య సంభాషణను ఊహించి రాయండి.


## VI ప్రశంస



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలంటూ మీగ్రామంలో అందరూ అనుకున్నారు. ఇందుకోసం మీరు నినాదాలు రాసి ప్రదర్శించండి.

## VIII భాషను గురించి తెలుసుకుందాం

(అ) పిల్లలూ! నామవాచకాల గుణాన్ని తెలిపే పదాలను 'విశేషణం' అంటారని తెలుసుకున్నారు కదా!



ఇంతవరకు మీరు నేర్చుకున్న పాఠాలలోని విశేషణ పదాలను గుర్తించండి. ఆ పదాలనుపయోగించి వాక్యాలు రాయండి.

**ఉదా:** నల్లని : ఆకాశంలో నల్లని మబ్బులు కమ్మాయి.

© SCERT not to be republished

(ఆ) కింది పేరాలో గీత గీసిన పదాలు చదవండి. తారుమారైన విశేషణ పదాలను సరిచేసి రాయండి

రామయ్యకు సన్నని పూలతోట ఉంది. పిల్లలు ఆనందంగా తోటలోకి వెళ్లారు. తోటలోని తియ్యని గులాబీలు, ఘనంగా చేమంతులు పచ్చని మల్లెలు కోశారు. ముచ్చటైన దారం తెచ్చారు. ఎర్రని మాలలు కట్టారు. తెల్లని పందిరి వేశారు. పూల మాలతో చిట్టిపొట్టిగా పందిరిని అలంకరించారు. అందంగా బొమ్మలు తెచ్చారు. పెద్దగా బొమ్మల పెళ్ళి చేశారు. పొడవైన మిఠాయిలు పంచారు.

(ఇ) కింది వాక్యాలను చదవండి. క్రియా పదానికి ముందు విశేషణం చేర్చి రాయండి.

**ఉదా :** అనన్య పాట పాడింది. అనన్య పాట చక్కగా పాడింది

1. ఈశ్వర్ పరుగెత్తాడు.

   ______________________

2. అభిజ్ఞ నాట్యం చేసింది.

   ______________________

3. వహీదా బొమ్మలు చేసింది.

   ______________________

4. సింహం గర్జించింది.

   ______________________



**ప్రాజెక్టు పని**



వార్తా పత్రికలు, వాడేసిన చార్టు పేపర్లను ఉపయోగించి రకరకాల కాగితపు సంచులు, కవర్లు తయారు చేయండి. తయారు చేసిన విధానాన్ని వివరించండి.

**నేనివి చేయగలనా?**

| | |
|---|---|
| 1. పాఠంలోని విషయాల ఆధారంగా వర్ణిస్తూ లేదా వివరిస్తూ మాట్లాడగలను. | ఔను/కాదు |
| 2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. పట్టికను నింపగలను. | ఔను/కాదు |
| 3. నేను చేసే మంచి పనులను గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. పక్షులకూ ప్రజ్ఞకూ మధ్య జరిగిన సంభాషణను ఊహించి రాయగలను. | ఔను/కాదు |

ఒకరి కోసం అందరం, అందరికోసం ఒక్కరమై ప్రకృతిని కాపాడుదాం.

- జీవవైవిధ్య సదస్సు, 2012

© SCERT not to be republished

చదువు
ఆనందించు

# 'కవికోకిల' సరోజినీ నాయుడు



"ఎన్నిసార్లు చేసినా, ఆన్సర్ సరిగ్గా రాదు...పాడులెక్క!" అని విసుక్కుంటున్నది ఒక అమ్మాయి. ఆ అమ్మాయికి లెక్కలంటే తలనొప్పి, మిగిలిన పాఠ్యాంశములలో (Subjects) మాత్రం దిట్ట. మనసు మాత్రం లెక్కల మీదకు వెళ్లేదికాదు. ఒక తెల్ల కాగితం తీసుకుంది. ఆలోచిస్తూ కూర్చుంది. ఆంగ్లంలో కొన్ని వాక్యాలు రాసింది. తనలో తాను చదువుకుంది. అంతులేని సంతోషంతో బిగ్గరగా చదివింది. అవి మామూలు వాక్యాలు కావు. కమ్మని కవిత అది. ఆ అమ్మాయికప్పుడు పదకొండేళ్లు మాత్రమే.

ఆ అమ్మాయి, పన్నెండో ఏటనే మదరాసు విశ్వవిద్యాలయం వారి మెట్రిక్యులేషన్ పరీక్షలో, ఆ రాష్ట్రంలోనే ఫస్టుగా ప్యాసయింది. పదమూడవ ఏటనే ఇంగ్లీషులో ఒక కావ్యం రాసింది. దాని పేరే 'Lady of the Lake' (సరోవరపు సారసాక్షి).

ఆమె ఆంగ్ల కవయిత్రిగా మంచి పేరు సంపాదించింది. పెద్దల ప్రశంసలు అందుకున్నది. అంతేకాదు భారతదేశ 'కవికోకిల' (నైటింగేల్) అనే గొప్పపేరు కూడా సంపాదించింది. ఆమే 'సరోజిని నాయుడు'. సరోజిని 1879 సంవత్సరం ఫిబ్రవరి 13న హైదరాబాదులో జన్మించింది. ఆమె తండ్రి పేరు అఘోరనాథ ఛటోపాధ్యాయ. తల్లిపేరు వరదసుందరీ దేవి. ఆమె భర్త సుప్రసిద్ధ వైద్యుడు మేజర్ జనరల్ ముత్యాల గోవిందరాజులనాయుడు. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు. ఇద్దరు కుమార్తెలు. పెద్ద కొడుకు పేరు డా॥జయసూర్య. హోమియో వైద్యంలో ఆయన మంచిపేరు గడించారు.

1915 సం॥లో ఆమెకు మహాత్మాగాంధీతో పరిచయం ఏర్పడింది. ఆనాటి నుంచీ ఆమె రాజకీయాలకు అంకితమయింది. 1930 సం॥లో గాంధీజీ పిలుపునందుకొని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నది. ఆమెను ఎర్రవాడ జైలులో నిర్బంధించారు. జైలులో పూల మొక్కలకు నిత్యమూ నీరు పోసి చక్కగా పెంచుతుండేది. అదే ఆమె నిత్యకృత్యం. ఆ విధంగా తాను పెంచే మొక్కలలో మొగ్గలను సంతోషంతో ఆ మొక్కలను చూస్తూ, ఆనందిస్తూ కూర్చునేది. ఒకరోజు జైలరు "అమ్మా! ఈ వేళ మిమ్మల్ని విడుదల చేస్తున్నారు. సిద్ధంగా ఉండండి!" అని అన్నాడు. సాధారణంగా ఆ వార్త విన్న వాళ్లు సంతోషిస్తారు. కాని సరోజినీ నాయుడు మాత్రం విచారిస్తూ "ఇంకా ఇక్కడ ఒక్క వారం ఉంచండి! నేను పెంచిన మొక్కలకు పూలు వస్తాయి వాటిని చూడాలని నాకెంతో ఆశగా ఉంది" అని అన్నది. 'వీల్లేదమ్మా!' అన్నాడు ఆ అధికారి. ఆమెకు ప్రకృతి అంటే అంత ఇష్టమన్నమాట.

ఆమె ఆంగ్లంలో ఎన్నో కవితలు రాసింది. వాటిలో 'The golden threshold' (బంగారు వాకిలి), 'The bird of time' (కాలవిహంగము), 'The broken wing' (భగ్నపక్షము) అను కావ్యాలు ప్రసిద్ధిగాంచాయి.

© SCERT not to be republished

రెండో యూనిట్

# 5. జాతీయ జెండా

కింది చిత్రం చూడండి.




ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలో ఏమేమిఉన్నాయి?
- దేశపటంలో ఎన్నో విషయాలను చూస్తున్నారు కదా? మీకేమనిపిస్తుందో చెప్పండి.
- మన దేశం గొప్పదనం గురించి చెప్పండి.



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



విహరింపనిమ్మా! విహరింపనిమ్మా!
స్వాతంత్ర్య వినువీథి – జాతీయ జెండా!
॥ విహరింపనిమ్మా ॥

విశ్వవిఖ్యాతిగా – విజయ నాదాలతో
విశ్వమోహనముగా – వెలసిన జెండా
వీర భారత జాతి – వెలిగిన జెండా ॥ విహరింపనిమ్మా ॥

మూడు రంగుల తోడి – ముచ్చట గూడి
తోడు నీడయి – ధర్మచక్రమ్ము గూడి
క్రీడించు నీయండ – ప్రియమైన జెండా
॥ విహరింపనిమ్మా ॥

వీరుల రక్తమ్ము – ధారవోసి, యరి
వీరుల నోడించి – పేర్గొన్న జెండా
భారత వీరుల – జాతీయ జెండా ॥ విహరింపనిమ్మా ॥

సాహస త్యాగాలు – శాంతి సత్యాలు
ఆత్మ విశ్వాసాలు – ఔదార్య భావాలు
చక్కగా పాలించు – జాతీయ జెండా
॥ విహరింపనిమ్మా ॥

సేతు శీతాచల – స్థిర భరత జాతి
ఖ్యాతినిల్పిన యట్టి – జాతీయ జెండా
స్వాతంత్ర్య భారత – జాతీయ జెండా
॥ విహరింపనిమ్మా ॥

– గురజాడ రాఘవశర్మ




© SCERT not to be republished

## ఇవి చేయండి



### I వినడం, ఆలోచించి చెప్పడం




(అ) గేయాన్ని రాగంతో పాడండి. అభినయం చేయండి.

(ఆ) ఈ గేయం దేని గురించి చెబుతుంది?

(ఇ) ఈ గేయ సారాంశాన్ని మీ సొంతమాటల్లో చెప్పండి.

(ఈ) స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పాఠశాలలో ఉపన్యాస పోటీని నిర్వహిస్తున్నారు. మీరైతే ఏం మాట్లాడుతారు?

### II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



**(అ) గేయం ఆధారంగా కింది గేయ పాదాలను సరైన క్రమంలో రాయండి.**

క్రీడించు నీ యండ - ప్రియమైన జెండా
మూడు రంగుల తోడి - ముచ్చటగూడి
తోడు నీడయి ధర్మచక్రమ్ము గూడి

**(ఆ) గేయంలోని ప్రాస పదాలను గుర్తించి రాయండి.**

ఉదా:- జాతి - ఖ్యాతి

**(ఇ) కింది వాక్యాలు చదవండి. వీటికి సంబంధించిన గేయ పాదాలను పాఠంలో గుర్తించండి.**

1. మన జెండా మూడు రంగులతో ముచ్చటగా ఉంది.
2. హిమాలయాల నుంచి రామేశ్వరం దగ్గర ఉన్న వారధి వరకు భరతజాతి ఖ్యాతిని మన జెండా తెలుపుతుంది.
3. శత్రుసైన్యాలను ఓడించిన వీరుల త్యాగాలకు గుర్తు మన జెండా.
4. మన జెండా అందమైన జెండాగా ప్రపంచ ప్రఖ్యాతిని పొందింది.

**(ఈ) కింది పదాలను చదవండి. గేయం ఆధారంగా వాటిని జతపరచి రాయండి.**

| | |
|---|---|
| మూడు రంగుల తోడి | జాతీయ జెండా |
| చక్కగా పాలించు | వెలసిన జెండా |
| విశ్వమోహనముగా | ముచ్చట గూడి |
| తోడు నీడయి | వెలిగిన జెండా |
| వీర భారత జాతి | ధర్మ చక్రమ్ముగూడి |

© SCERT not to be republished

(ఉ) పాఠం చదవండి. పాఠంలో రెండేసి పదాలు కలిసి ఉన్న పదాలు ఉన్నాయి. వాటి కింద గీత గీయండి. చదవండి.

ఉదా: విశ్వవిఖ్యాతి, ధర్మచక్రము

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) మన జెండా వీరుల త్యాగానికి గుర్తు అని ఎలా చెప్పగలవు?

(ఆ) సేతు శీతాచల స్థిర భరత జాతి ఖ్యాతి నిల్పిన యట్టి జాతీయ జెండా – ఈ వాక్యాల ద్వారా మీరు తెలుసుకున్నదేమిటి?

ఇ) మన జెండా విశ్వవిఖ్యాతి పొంది విశ్వమోహనంగా ఉందని తెలుసుకున్నారు కదా? దీనిని సమర్థిస్తూ రాయండి.

ఈ) గేయ సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.

## IV పదజాలం



(అ) ఈ గేయంలోనూ ముందు పాఠంలోనూ ఉన్న కింది ఒత్తు పదాలను రాయండి.

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ్త | ్న | ్వ | ్ట | ్య | ్ర | ్ష | ్థ | ్చ | ్ల | ్గ | ్మ |

.............................. .............................. ..............................

.............................. .............................. ..............................

.............................. .............................. ..............................

(ఆ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.



1. పక్షులు వినువీథిలో ఎగురుతున్నాయి.
2. రవీంద్రనాథ్ ఠాగూర్ నోబెల్ బహుమతి పొందడం ద్వారా విశ్వవిఖ్యాతి పొందాడు.
3. ఎందరో వీరులు తమ ప్రాణాలు ధారవోసి మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టారు.
4. భగీరథుడు గంగను భూమి మీదికి తేవడం ద్వారా తమ ఖ్యాతినిలబెట్టాడు.
5. ఒక కాలు లేకున్నా ఆత్మవిశ్వాసంతో కష్టపడి సుధాచంద్రన్ ప్రఖ్యాత నర్తకిగా పేరుతెచ్చుకుంది.

© SCERT not to be republished

(ఇ) కింది గళ్లలో పాఠంలోని పదాలు దాగున్నాయి. వాటిని వెతికి వాటితో సొంత వాక్యాలు రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| వి | జ | య | నా | దం |
| శ్వ | శీ | తా | చ | లం |
| వి | శ్వా | సం | జా | తి |
| ఖ్యా | ధ | ర్మ | చ | క్రం |
| తి | ధా | ర | వో | సి |

1. ......................................
2. ......................................
3. ......................................
4. ......................................
5. ......................................
6. ......................................
7. ......................................


(ఇ) గేయం ఆధారంగా పట్టికను పూరించండి.

| | దీర్ఘ అక్షరం ఉన్న పదాలు | గుడి అక్షరం ఉన్న పదాలు | ద్విత్వాక్షరం ఉన్న పదాలు | సంయుక్తాక్షరం ఉన్న పదాలు |
|---|---|---|---|---|
| ఉదా: | సాహసం | విహరింపు | చక్కగా | ఖ్యాతి |

© SCERT not to be republished

## V సృజనాత్మకత

(అ) కింది గేయాన్ని పొడిగించండి.




ఉదా : కోకిలమ్మ పాడగలదు
జాతీయగీతం
కొండకోన వాగు పాడు
సంస్కృతి గీతం
...........................
...........................



(ఆ) పాఠంలోని మొదటి రెండు పాదాలు చదవండి. దానికనుగుణంగా చిత్రాన్ని గీయండి. రంగులు వేయండి. దాన్ని గురించి రాయండి, చెప్పండి.


## VI ప్రశంస



గేయాన్ని మీ తరగతిగదిలో ఎవరు బాగా పాడారు? ఎవరు బాగా అభినయం చేశారు? వాళ్ళు బాగా చేశారని మీరు ఎందుకు అనుకుంటున్నారో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం

**(అ) కింది పేరాను చదవండి. (?) ఈ గుర్తుకు '○' చుట్టండి.**



రవి సెలవుల్లో తాతయ్యగారి ఊరికివెళ్ళాడు. దారిలో గోపయ్య ఎదురయ్యాడు. "ఎవరు బాబు నువ్వు? ఎవరింటికి వెళ్లాలి? నీపేరేమిటి? మీ ఊరు ఏది? అంటూ ప్రశ్నించాడు. రవి చిరునవ్వుతో గోపయ్య ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్పాడు.

పిల్లలూ! ఈ గుర్తు (?) వాక్యంలో చివర ఉందని గుర్తించారు కదా! ఈ గుర్తును (?) 'ప్రశ్నార్థక చిహ్నం' అంటారు. ఈ గుర్తుగల వాక్యాలను 'ప్రశ్నార్థక వాక్యాలు' అంటారు.

**(ఆ) ఈ కింది వాక్యాలను గమనించండి. వీటిలో ప్రశ్నార్థక పదాలను గుర్తించి గీత గీయండి.**

- నీపేరు ఏమిటి?
- మీరు బజారుకు ఎందుకు వచ్చారు?
- మీరు బడినుంచి ఎప్పుడు వచ్చారు?
- మీరు ఎలా చదువుతున్నారు?
- మీదగ్గర ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?
- మీ ఊరు ఏది?
- జాతీయగీతం రాసినవారు ఎవరు?

**(ఇ) గీత గీసిన పై ప్రశ్నార్థక పదాలను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

**ప్రాజెక్టు పని**



మనదేశం గొప్పతనాన్ని తెలిపే ఏవైనా పాటలను/గేయాలను/కవితలను సేకరించండి, వాటిని చార్టు మీద రాసి ప్రదర్శించండి. చదివి వినిపించండి.

**నేనివి చేయగలనా?**

| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగ భావ యుక్తంగా పాడగలను. | ఔను/కాదు |
| 2. | గేయాన్ని ధారాళంగా చదవగలను. | |
| | గేయాన్ని గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | గేయసారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | ఆధారాలతో గేయాన్ని పొడిగించి రాయగలను. | ఔను/కాదు |

అన్నదమ్ములవలెను జాతులు, మతములన్నీ మెలగవలెనోయి.
- గురజాడ అప్పారావు

© SCERT not to be republished

రెండో యూనిట్

# 6. వినాయకచవితి

కింది చిత్రం చూడండి.



## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రం చూడండి. ఇది ఏ పండుగకు సంబంధించింది?
- చిత్రం ఆధారంగా బోనాలు పండుగ ఎలా జరుపుకుంటారో చెప్పండి.
- మీ ఊర్లో కూడా ఇలా ఏ ఏ పండుగలు జరుపుకుంటారు?




**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.


పండుగలంటే అందరికీ సరదా. ఒక్కో పండగను ఒక్కో రకంగా మనం జరుపుకుంటాం. అన్ని పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తాయి. ప్రతి పండుగకూ దాని ప్రత్యేకతను తెలియజేసే కథ ఉంటుంది. అలాంటిదే ఒక పండుగ కథను, ఆ పండుగ జరుపుకొనే విధానాన్ని, విశేషాలను తెలుసుకుందాం.

"జై జై గణేశా... జై జైజై గణేశా" అని పాడుకొంటూ పిల్లలంతా సంబరంగా ఉన్నారు. పెద్దలందరు కలిసి వేదిక కడుతున్నారు. మామిడాకుల తోరణాలు కడుతూ హడావిడిగా ఉన్నారు. ఈ సందడి అంతా వినాయకచవితి పండుగకోసమే! భారతదేశంలో జరుపుకొనే ముఖ్యమైన పండుగల్లో వినాయకుని పుట్టిన రోజైన వినాయకచవితి ఒకటి. దీన్నే 'వినాయకచతుర్థి' లేదా 'గణేశ చతుర్థి' అని కూడా అంటారు. ఈ పండుగ భాద్రపదమాస శుక్లపక్ష చతుర్థినాడు వస్తుంది.



వినాయకుని పుట్టుకకు ఒక కథ ఉంది. పూర్వం గజాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. దేవతల కోరిక మేరకు పరమశివుడు గజాసురుణ్ణి సంహరించి కైలాసానికి తిరిగి వస్తున్నాడు. పార్వతీదేవికి ఈ శుభవార్త తెలిసింది. శివుడు వచ్చేలోగా స్నానం చేయాలనుకొంది. తను స్నానం చేస్తున్నప్పుడు గుమ్మం దగ్గర కాపలాగా ఎవరినైనా ఉంచాలనుకొంది. వెంటనే నలుగుపిండితో బాలుని బొమ్మ చేసి, దానికి జీవం పోసింది. ఆ బాలుడెంతో ముద్దుగా ఉన్నాడు. ఆ బాలుణ్ణి ఎత్తుకొని పార్వతీదేవి కాసేపు ముద్దాడింది. "పుత్రా! నేను స్నానం చేయడానికి వెళుతున్నాను. ఎవ్వరినీ లోపలికి రానివ్వకుండా కాపలా ఉండు," అని చెప్పి వెళ్లింది పార్వతీదేవి.


ఆ చిన్ని బాలుడు కాపలాకాస్తూ గుమ్మం దగ్గరే నిలుచున్నాడు. ఇంతలో పరమశివుడు వచ్చాడు. లోపలికి వెళ్లబోతున్న పరమశివుణ్ణి ఆ బాలుడు అడ్డుకున్నాడు.



తనను లోపలికి వెళ్లనీయకుండా మొండిగా అడ్డుపడుతున్న బాలుడి మీద శివునికి కోపం వచ్చింది. వెంటనే ఆ బాలుని తలను నరికేశాడు. ఇంతలో పార్వతీదేవి వచ్చింది. జరిగిన ఘోరాన్ని చూసి ఆవేదన చెందింది. భోరుమని ఏడ్చింది. అసలు విషయం తెలుసుకున్న పరమశివుడు కూడా చింతించాడు. తన ఆజ్ఞమేరకు తన ప్రమథ గణాలవాళ్లు తెచ్చిన ఏనుగు తలను బాలుని మొండేనికి అతికించాడు. తిరిగి ప్రాణం పోశాడు. పార్వతీదేవి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.

© SCERT not to be republished

శివపార్వతులు ఆ బాలునికి గణేశుడు అని పేరు పెట్టారు. అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు. గణేశుడు 'అనింద్యుడు' అనే ఎలుకను వాహనంగా చేసుకొని కైలాసమంతా ఆనందంగా తిరుగుతున్నాడు. కొంతకాలం తరువాత శివపార్వతులకు మరో కుమారుడు కుమారస్వామి జన్మించాడు. కుమారస్వామి కొంచెం పెద్దయ్యాక నెమలిని తన వాహనంగా చేసుకున్నాడు. ఇద్దరు పిల్లల ముద్దుమురిపాలతో శివపార్వతులు సంతోషంగా ఉన్నారు.



ఒకరోజున దేవతలంతా కలిసి పరమశివుని దగ్గరకు వచ్చారు. "మానవుల సమస్యలు తీర్చడానికి మాకు ఒక నాయకుడు కావాలి. ఆ నాయకుడెవరో సూచించమని" పరమశివుణ్ణి కోరారు. తన కుమారులలో ఒకరిని ఎంపిక చేయాలని పరమశివుడు అనుకొన్నాడు. అందుకోసం వారిద్దరికీ ఒక పరీక్షపెట్టాడు. అందులో గెలిచినవారు మానవుల సమస్యలను పరిష్కరించే 'గణనాయకుడు' అవుతాడని చెప్పాడు.

పిల్లలను పిలిచి "ఇద్దరూ వెళ్లి ముల్లోకాల్లో ఉన్న అన్ని నదుల్లో స్నానంచేసి రావాలి. ఇలా చేసి ఎవరు ముందుగా తిరిగి వస్తారో అతనే గణనాయకుడౌతాడని" అని పరమశివుడు తెలియజేశాడు. తండ్రిమాటలు పూర్తి కాకముందే కుమారస్వామి ఆత్రుతతో తన వాహనం ఎక్కాడు. ఆకాశంలోకి ఎగిరిపోయాడు. తన చిన్ని ఎలుక వాహనంతో సోదరుడితో ఎలా పోటీపడాలో అర్థంకాక గణేశుడు ఆలోచనలో పడ్డాడు.

గణేశుడికి ఒక ఉపాయం తట్టింది. వెంటనే నారాయణ జపం చేస్తూ, శివపార్వతుల చుట్టూ భక్తితో మూడుసార్లు ప్రదక్షిణం చేశాడు. అంతే! ముల్లోకాల్లో ఉన్న మూడుకోట్ల యాభై లక్షల నదుల్లో స్నానం చేసిన ఫలితం వచ్చేసింది. గణేశుని సమయస్ఫూర్తికి, బుద్ధిబలానికి శివపార్వతులు అమితానందపడ్డారు. మెరుపు వేగంతో వెళ్లిన కుమారస్వామి అలసి సొమ్మసిల్లి కైలాసానికి చేరుకున్నాడు. గణేశుడు అప్పటికే అక్కడ ఉండడం చూసి, కుమారస్వామి అవాక్కయ్యాడు.


నిజం తెలుసుకున్న కుమారస్వామి "సోదరా! నీ శక్తియుక్తులను నేను గ్రహించలేకపోయాను. సమస్యలను పరిష్కరించి, విఘ్నరాజువుకాదగిన అర్హత కలవాడివినీవే" అని గణేశుణ్ణి కౌగిలించుకున్నాడు. ఇలా వినాయకుడు గణనాయకుడు అయ్యాడు. ఆ రోజే 'గణేశ చతుర్థిగా' ప్రసిద్ధి చెందింది. ఇది కూడా భాద్రపద మాసంలో శుక్లపక్ష చతుర్థినాడే జరిగింది. అందుకే మన దేశంలో అందరూ వినాయక చవితి పండుగను ఎంతో విశేషంగా జరుపుకొంటున్నారు.

© SCERT not to be republished

మట్టితో చేసిన వినాయకుని విగ్రహానికి పూజలు చేయడం ఆచారం అయింది. ప్రాచీనగ్రంథం 'ముద్గల పురాణం' ప్రకారం వినాయకుణ్ణి 32 రూపాల్లో పూజిస్తారు. వినాయకుడు కార్యారంభాలకు కూడా అధిపతి. అందుకే ఏపని ప్రారంభించినా విఘ్నాలు తొలగించడానికి వినాయకుడి పూజను విధిగా చేస్తారు.

వినాయకచవితి రోజున పూలతోబాటు ప్రత్యేకంగా ఇరవైఒక్క రకాల ఆకులతో పూజ చేస్తారు. వినాయకునికి ఇష్టమైన ఉండ్రాళ్ళు, లడ్డూలు, కుడుములు, పండ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. గణపతి నవరాత్రి వేడుకలను గొప్పగా చేస్తారు. తర్వాత వినాయక విగ్రహాలను ఘనంగా ఊరేగిస్తారు. దగ్గరలోని సముద్రం, నది, చెరువు లేదా బావి నీటిలో నిమజ్జనం చేసి పండుగను ముగిస్తారు.

ఈ పండుగను మన రాష్ట్రంలోనే కాక దేశమంతటా వైభవంగా జరుపుకొంటారు. మహారాష్ట్రలో వినాయకచవితిని అత్యంత వైభవంగా చేస్తారు. వినాయకచవితిని జాతీయసమైక్యతకోసం వినియోగించిన ఘనత బాలగంగాధర్ తిలక్‌గారికి దక్కింది. బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడడానికి ఐకమత్యం అవసరమని ఆయన గుర్తించారు. అందుకని 1892లో వినాయకచవితిని సాంఘిక సంబరంగా నిర్వహించారు. నాటి నుంచి ఈ పండుగను ఊరూ, వాడా సంబరంగా జరుపుకోవడం సంప్రదాయంగా మారింది. మన రాష్ట్రంలో కూడా వాడవాడల్లో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి, తొమ్మిది రోజులు ఘనంగా నవరాత్రులు జరుపుకొంటారు. చివరి రోజు నిమజ్జనం చేస్తారు.



మనరాష్ట్ర రాజధాని హైదరాబాదులో కూడా గణపతి ఉత్సవాలను భారీఎత్తున, వేడుకగా జరుపుతారు. ఖైరతాబాదులో ఏర్పాటు చేసే విగ్రహం భారీగా ఉంటుంది. హైదరాబాదులో ఈ పండుగకు వాడవాడలా వేలాది మంటపాలు ఏర్పాటు చేస్తారు. వినాయకుని విగ్రహాలను రకరకాల ఆకృతులలో తయారుచేస్తారు. వాటికి తొమ్మిది రోజులు పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా ఇందులో చోటు చేసుకుంటాయి.

హైదరాబాదు నగరం విభిన్న మతాలకు సంస్కృతులకు ముఖ్యమైన కూడలి. హిందువులు జరుపుకొనే వినాయకచవితి సంబరాల్లో ముస్లిం సోదరులు కూడా పాలుపంచుకొంటారు. ఇది మతసామరస్యానికి ప్రతీకగా భాసిల్లుతుంది. పండుగ సంబరాల్లో మండపాల నిర్వహణలో వీరుకూడా ముఖ్యపాత్ర వహిస్తారు. నిమజ్జనోత్సవంలో మంచినీరు అందించే చలువ పందిళ్ళు నిర్వహణలో ముస్లిం సోదరుల సహాయ సహకారాలు మరవరానివి. అదే విధంగా రంజాన్ మాసంలో ముస్లింలు జరుపుకొనే ఉత్సవాల్లో హిందువులు పాల్గొని సహాయం అందిస్తారు. ఇఫ్తార్ విందు కలిసి ఆరగిస్తారు. ఇలా మనం జరుపుకొనే పండుగలు జాతీయ సమైక్యానికి అద్దం పడుతున్నాయి.

**మూలం- ఆంధ్రమహాసభ ప్రచురణ**

**సీతాకోక చిలుకలు, ఎన్.కె.శర్మ.**

©SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) మీరు జరుపుకునే పండుగల పేర్లు చెప్పండి. ఏ ఏ పండుగలను ఎలా జరుపుకుంటారో చెప్పండి.

(ఆ) "పండుగలు సమైక్యానికి అద్దం పడతాయి" అని తెలుసుకున్నారు కదా! ఏ ఏ పండుగలను అందరూ కలిసి చేసుకుంటారు? ఎందుకు కలిసి జరుపుకోవాలి!

(ఇ) పార్వతీదేవి వినాయకుని బొమ్మ నలుగు పిండితో చేసిందని కథలో ఉంది కదా! మీరైతే పిండితో ఏ ఏ బొమ్మలను తయారు చేస్తారో చెప్పండి.

(ఈ) పండుగలకు దేవుళ్లబొమ్మలను ఇంట్లోనే కాదు వీధుల్లో కూడా పెట్టి అందరూ కలిసి సామూహికంగా పూజలు, సంబరాలు చేసుకుంటారు. ఇలా సామూహికంగా ఊరేగింపులతో జరుపుకునే పండుగలు ఏవేవి?

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం




(అ) కింది పేరాను చదవండి. ఇచ్చిన వాక్యాలను పొడిగించండి.

గజాననుడు గణాలకు అధిపతి అయినందువల్ల 'గణపతి' అని అంటారు. విశిష్టమైన నాయకుడైనందువల్ల 'వినాయకుడని' అంటారు. విఘ్నాలకు అధిపతి అయినందువల్ల 'విఘ్నేశ్వరుడ'ని అంటారు. బానవంటి పెద్ద పొట్టకలిగినందువల్ల లంబోదరుడ'ని అంటారు. వినాయక చవితి పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటున్నాం. మన తరవాత తరాలవారు కూడా ఈ పండుగను జరుపుకొనేలా మనం మన పర్యావరణాన్ని కాపాడుకోవాలి. వినాయకుని విగ్రహాల తయారీలో వాడే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు నిమజ్జనం చేసినపుడు నీటిలో కలువడం వల్ల జలకాలుష్యం సంభవిస్తుంది. ఎన్నో జలచరాలు చనిపోతున్నాయి. అందువల్ల బంకమట్టితో, ప్రకృతి సిద్ధమైన రంగులను వాడుతూ వినాయకుని విగ్రహాలను తయారుచేయాలి. ఈ పండుగ ప్రకృతినీ, దేవుణ్ణీ అనుసంధానం చేస్తుంది. అందుకనే ఈ పండుగతోపాటు ప్రకృతికి ప్రాధాన్యమిద్దాం. ఆనందంగా పండుగజరుపుకొని పర్యావరణాన్ని రక్షిద్దాం.

1. గణేశుణ్ణి గణపతి అంటారు. ఎందుకంటే ------------------------------
   ------------------------------------------------------------
2. వినాయకుని విగ్రహాల తయారీలో బంకమట్టినే వాడాలి. ఎందుకంటే------------
   ------------------------------------------------------------
3. గణేశుణ్ణి విఘ్నేశ్వరుడని ఎందుకంటారంటే ----------------------------
   ------------------------------------------------------------

© SCERT not to be republished



4. గణేశుణ్ణి లంబోదరుడు అని అంటారు. ఎందుకంటే --------------------
------------------------------------------------

5. వినాయక చవితి మతసామరస్యానికి ప్రతీక. ఎందుకంటే ----------------
------------------------------------------------


(ఆ) పాఠం చదవండి. కింది విషయాలు ఏ ఏ పేరాల్లో ఉన్నాయో గుర్తించండి. ఆ పేరా సంఖ్యను పట్టికలో రాయండి.

| విషయం | పేరా సంఖ్య |
|---|---|
| 1. వినాయకుని పూజా కార్యక్రమం | |
| 2. మహారాష్ట్రలో పండుగ ప్రత్యేకత | |
| 3. హిందూముస్లింల మతసామరస్యం | |
| 4. గణేశుని ఉపాయం | |

(ఇ) ఈ కింది పేరాను చదవండి. గీతగీసిన పదాలు తారుమారై ఉన్నాయి. వాటిని ఉండవల్సిన చోట ఉంచి చదవండి, రాయండి.

ఒక చవితినాడు వినాయకుడు దేవతల పూజలందుకొని 'చంద్రుడు' వస్తున్నాడు. దారిలో వినాయకుని బాన పొట్టను చూచి 'పురాణాలు' నవ్వాడట. దానికి కోపించిన పార్వతీదేవి చవితినాడు చంద్రుణ్ణి చూసినవారికి 'పూజాక్షతలు' వస్తాయని శపించింది. దానికి భయపడిన మునులు, దేవతలు 'తిరిగి' చేయమని కోరారు. పూజచేసి 'నీలాపనిందలు' తలపై ఎవరు చల్లుకుంటారో వారికి ఎలాంటి నీలాపనిందలు రావని చెప్పినట్లు 'శాపపరిహారం' చెబుతున్నాయి.

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) వినాయకచవితి పండుగ పాఠంలో మీరు ఏం గ్రహించారో మీ సొంతమాటల్లో రాయండి.

(ఆ) వినాయకుని విగ్రహాలను మట్టితోనే ఎందుకు చేయాలి?

(ఇ) మీ ప్రాంతంలో వినాయకచవితి ఉత్సవాలను ఎలా జరుపుకొంటారో రాయండి. ఆ రోజు మీరేం చేస్తారు?

(ఈ) 'హైదరాబాదు నగరం విభిన్న మతాలకు, సంస్కృతులకు నిలయం' ఎందుకు?

(ఉ) వినాయకచవితిని హిందువులు జరుపుకొంటారు కదా! ఇలా ఇంకా ఏ ఏ పండుగలను ఇతర మతాలవారు జరుపుకుంటారు? ఆ రోజు ఏం చేస్తారు? వినాయకచవితి పండుగతో పోల్చి కింది పట్టికలో రాయండి.

| వినాయకచవితి రోజు చేసేవి | ఇతర పండుగల నాడు చేసేవి |
|---|---|
| | |

## IV పదజాలం



(అ) 'ఒక రకం హల్లు'కు మరో రకం హల్లు ఒత్తుగా వచ్చి చేరిన అక్షరాలను 'సంయుక్తాక్షరాలు' అంటారు కదా! సంయుక్తాక్షరాలు ఉన్న పదాలు పాఠంలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

ఉదా : ముఖ్యమైన ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

(ఆ) ఖైరతాబాద్‌లో వినాయకుని 'భారీ విగ్రహం' ఏర్పాటు చేస్తారు కదా! ఇలా 'భారీ' అనే పదాన్ని కింది పదాలలో వేటికి కలిపి వాడతారో రాయండి. వాటితో వాక్యాలు రాయండి.

(ఎత్తున, వర్షం, వాహనాలు, కాయం, పనులు, భోజనాలు, ఉంగ్రాళ్ళు)

**ఉదా :** భారీ ఎత్తున : రంజాన్ రోజున ముస్లిం మతస్తులు భారీ ఎత్తున పేదలకు దానధర్మాలు చేస్తారు.

____________ ______________________________


(ఇ) గణపతి నవరాత్రి వేడుకలను గొప్పగా చేస్తారు కదా! 'నవరాత్రులు' అంటే తొమ్మిది రాత్రులు. ఇలాంటి పదాలే మరికొన్ని పట్టికలో ఉన్నాయి. అవి అంటే ఏమిటో రాయండి.

ఉదా :

| | | | |
|---|---|---|---|
| ఒకటి | ఏక | ఏకదంతం | ఒకటే దంతం |
| రెండు | ద్వి | ద్విముఖాలు | |
| మూడు | త్రి | త్రిలింగాలు | |
| నాలుగు | చతుః | చతుర్వేదాలు | |
| ఐదు | పంచ | పంచపాండవులు | |
| ఆరు | షట్ | షట్చక్రవర్తులు | |
| ఏడు | సప్త | సప్తఋషులు | |
| ఎనిమిది | అష్ట | అష్టదిక్కులు | |
| తొమ్మిది | నవ | నవగ్రహాలు | |
| పది | దశ | దశావతారాలు | |

© SCERT not to be republished

## V సృజనాత్మకత




(అ) వినాయకుని బొమ్మను లేదా ఇంకా ఏదైనా బొమ్మను మట్టితో చేసి రంగులు వేయండి. దాన్ని ప్రదర్శించండి. దాన్ని ఎలా తయారుచేశారో రాయండి. లేదా వినాయకుని బొమ్మ గీయండి. రంగులు వేయండి. వినాయకుని గురించి సొంతంగా ఒక పాట రాసి ప్రదర్శించండి.

ఉదా : ముద్దు ముద్దు గణేశా, ముచ్చటైన గణేశా...

**VI** 

**ప్రశంస :** ఇర్ఫాన్ ఇంట్లో రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రక్షిత్ వెళ్లాడు. అతన్ని చాలా ప్రేమగా పలకరించి పండ్లు, హలీం, మిఠాయిలు అన్నీ పెట్టారు. రక్షిత్ ఇర్ఫాన్‌కు కృతజ్ఞతలు చెప్పాడు. మరుసటి రోజు ఈ విషయం బడిలో మిగతా మిత్రులకు చెప్పాడు. రక్షిత్ ఏం చెప్పి ఉంటాడో ఆలోచించి చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) పిల్లలూ! ఈ గుర్తు(?)ను ప్రశ్నార్థకం అని తెలుసుకున్నారు కదా! మీరు ఇంతకు ముందు చదువుకొన్న పాఠాలలోని ప్రశ్నార్థక వాక్యాలను రాయండి.**

**(ఆ) బ్రాకెట్‌లో గల ప్రశ్నార్థక పదాలు చదవండి. వీటి ఆధారంగా కింది వాక్యాలను ప్రశ్నార్థక వాక్యాలుగా రాయండి. (ఎవరు, ఎప్పుడు, ఎందుకు, ఏమి, ఎలా, ఎక్కడ)**

**ఉదా :** అవ్వ శిష్యులకు సూదిని ఇచ్చింది. - అవ్వ శిష్యులకు ఏమి ఇచ్చింది?

1. గురువుగారి దగ్గరకు రాజభటులు వచ్చారు.
2. తిమ్మరుసు, పలక ఇలా ఇవ్వండి అని అడిగాడు.
3. ప్రజ్ఞ కాగితపు సంచులను చెత్తబుట్టలోకి పారేసింది.
4. ఉరుములు ఉత్తర దిక్కున ఉరిమాయి.
5. గురువుగారి కాలిలో ముల్లు విరిగింది.

© SCERT not to be republished



### ప్రాజెక్టు పని

ఇతర మతాల వారికి చెందిన ఏదైనా ఒక పండుగ గొప్పదనాన్ని గురించి తెలుసుకోండి. దాన్ని వివరించండి.

### నేనివి చేయగలనా?


| | | |
|---|---|---|
| 1. | నాకు తెలిసిన పండుగలు జరుపుకునే విధానాన్ని చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | చదివిన అంశం ఆధారంగా కారణాలు రాయగలను. | |
| | విషయానికి చెందిన పేరాలను గుర్తించగలను. | ఔను/కాదు |
| 3. | వినాయక చవితి పండుగను గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | మట్టితో వినాయకుని బొమ్మను చేసి రంగులు వేయగలను. | ఔను/కాదు |

సమస్త ప్రాణులు భగవత్‌స్వరూపాలే.

**- ఆదిశంకరాచార్యులు**

చదువు
ఆనందించు

# రంజాన్



పండుగ రోజంటే పదిమంది కలిసిమెలిసి ఆనందంగా గడిపేరోజు. పండుగలు, ఉత్సవాలు, జాతరలు ఒకనాటి సంస్కృతులకూ, సమైక్యతా విశ్వాసాలకూ దర్పణాలు. హిందువుల పండుగలవలెనే ముస్లిములు జరుపుకొనే పండుగల్లో రంజాన్ పండుగ ఒకటి.

మహమ్మద్ ప్రవక్త ప్రవచించిన మతం ఇస్లాం. ఇస్లాం మతం అనుయాయులు ముస్లిములు. వారు చేసుకొనే పండుగల్లో ముఖ్యమైన, పవిత్రమైన పండుగ రంజాన్, ఈ పండుగను 'ఈద్' అని 'ఈద్-ఉల్-ఫితర్' అని వ్యవహరిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలందరూ తరతమ భేదాలు లేకుండా నిర్వహించుకొనే పండుగ ఇది.

ఈ పండుగ ఫసలీకాలమానం ప్రకారం రంజాన్ నెల మొదటి రోజు నుండి ప్రారంభం అవుతుంది. ఆ రోజు రాత్రి చంద్రుడి దర్శనం చేసుకొన్నప్పటి నుండి ముప్పై రోజులు ఈ పండుగ జరుపుకొంటారు. ముస్లిములందరూ ఈ నెల రోజులు మహమ్మద్ ప్రవక్త బోధనలను పఠిస్తారు. పగలు కనీసం ఒక్క చుక్క మంచినీరైనా ముట్టగూడదనే నియమం పాటిస్తారు. చాలావరకు ఈ నెలలోనే 'జకాత్' ఇస్తారు. సంవత్సరానికి ఒకసారి తమ ఆస్తి, సంపదలపై ఓ లెక్క ప్రకారం పేదలకు చేసే దానధర్మాలనే 'జకాత్' అంటారు. ఈ విశాల విశ్వంలో తినడానికి తిండి, దప్పిక తీర్చుకోవడానికి నీరు దొరకని అనాథలు, నిరుపేదలు ఎందరో ఉన్నారు. వారి దప్పిక, ఆకలి సంపన్నులకు తెలియదు. ఈ అనుభూతులు స్వీయ

©SCERT not to be republished



అనుభవంలోకి తెచ్చే పండుగ ఇది అని వారి నమ్మకం. పవిత్రమైన జీవన విధానంతో అత్యంత నిష్ఠతో, భక్తితో వారంతా నెల రోజులు ఉపవాసాలు ఉంటారు. ప్రతి రోజు మసీదుకు వెళ్ళి కనీసం ఐదు పర్యాయాలు నమాజు చేస్తారు. వీటితో పాటు ప్రత్యేక నమాజ్ 'తరావిహ్' కూడా చేస్తారు. మసీదుకు వెళ్ళలేని వారు ఇళ్ల వద్దనే భక్తిశ్రద్ధలతో నమాజ్ చేస్తారు. ఈ రంజాన్ మాసంలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిందని మహమ్మదీయుల విశ్వాసం.

ఈ మాసంలో ముస్లిముల నిత్యకృత్యాలు ప్రత్యేకంగా ఉంటాయి. తెల్లవారుజామున నాల్గు గంటలకే నిద్రలేస్తారు. కాలకృత్యాలు తీర్చుకుంటారు. సూర్యోదయానికి సుమారు గంటన్నర ముందే భోజనాలు చేస్తారు. ఇలా చేసే ఉపవాస ప్రారంభాన్ని 'సహరి' అని అంటారు. పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం సూర్యాస్తమయం తరవాత ఉపవాసం విడిచి, నమాజ్ చేస్తారు. ఉపవాసం విడవడాన్ని 'ఇఫ్తార్' అంటారు.

రంజాన్ నెల తర్వాత షవ్వాల్ నెల ప్రారంభమవుతుంది. ఆ నెల మొదటి రోజు చంద్రదర్శనం చేసుకుంటారు. మరునాడు పెద్ద ఎత్తున పండుగ చేసుకుంటారు. ఉపవాస దీక్షలు విరమిస్తారు. ఇంటిల్లిపాదీ కొత్తబట్టలు ధరిస్తారు. అత్తరులు పూసుకుంటారు. 'ఈద్‌గాహ్'కు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేస్తారు. నమాజ్ చదివిన తర్వాత ఒకరికొకరు 'ఈద్ ముబారక్' అని శుభాకాంక్షలు తెల్పుతూ ఆలింగనం చేసుకుంటారు. ఆ తరవాత సేమియా పాయసంతో కూడిన విందును ఇంటిల్లిపాదీ కలిసి కూర్చొని ఆరగిస్తారు. మిత్రులను, బంధువులను కూడా ఈ విందులకు ఆహ్వానిస్తారు. బీదలకు దానధర్మాలు విరివిగా చేస్తారు.


మహమ్మదీయ సోదరులతోపాటు ఇతర మతాలవారు కూడా ఈ పండుగలో భాగస్వాములవుతారు. మహమ్మదీయ మిత్రులకు వారు 'ఇఫ్తార్' విందులిస్తారు. పండుగనాడు ముస్లిం మిత్రుల గృహాల్లో జరిగే విందులకు హాజరవుతారు. వారికి తమ శుభాకాంక్షలు తెలిపి ఆలింగనం చేసుకుంటారు. మత సామరస్యానికి, వర్గరహిత సమాజానికి పేద, ధనిక వ్యత్యాసాల నిర్మూలనకు ఈ పండుగ ఒక చిహ్నం. 'అల్లా' పేరు మీద నిర్వహించే ఈ పండుగ సుఖసంతోషాలను, ఆనంద సౌభాగ్యాలను ప్రసాదిస్తుంది. అందువల్లే రంజాన్ పండుగ పవిత్రతకు, క్రమశిక్షణకు మరియు మత సామరస్యానికి ప్రతీక.

© SCERT not to be republished

రెండో యూనిట్

# 7. ఆణిముత్యాలు


కింది చిత్రం చూడండి.




© SCERT not to be republished


**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలో ఏం జరుగుతోంది? ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
- మీరెప్పుడైనా ఇలాంటి ప్రదర్శనలను చూసినప్పుడు మీకేమనిపించింది?
- చిత్రంలోని వ్యక్తి ఏ పద్యం పాడుతున్నాడు? మీకు తెలిసిన పద్యాలు చెప్పండి.



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



1. కోపమునను ఘనత కొంచెమైపోవును
కోపమునను మిగుల గోడు చెందు
కోపమడిచెనేని కోరిక లీడేరు
విశ్వదాభిరామ వినురవేమ.

భావం : కోపంవల్ల గొప్పతనం తగ్గిపోతుంది. కోపం దుఃఖాన్ని కలుగజేస్తుంది. కోపాన్ని అణచుకోగల వారి కోరికలు నెరవేరుతాయి.



2. అనగ ననగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ.

భావం : సాధన చేయగా చేయగా రాగాలాపన ఇంపుగా ఉంటుంది. తినగా తినగా వేపాకు తియ్యగా ఉంటుంది. సాధన చేస్తే ఏ పనులైనా నెరవేరుతాయి.

3. ఇమ్ముగఁ జదువని నోరును
అమ్మాయని పిలిచి యన్నమడుగని నోరున్
దమ్ములఁ బిలువని నోరును
గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ!




భావం : ఇంపుగా చదవని నోరు, 'అమ్మా!' అని పిలిచి అన్నం పెట్టమని అడగని నోరు, తమ్ముళ్ళను ప్రేమతో పిలవని నోరు, కుమ్మరి మన్ను తవ్విన గొయ్యి వంటిది.



4. కూరిమిగల దినములలో
నేరములెన్నడును గలగనేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!


భావం : పరస్పరం స్నేహమున్న రోజుల్లో తప్పులెప్పుడూ కనిపించబోవు. ఆ స్నేహం చెడిపోగానే అన్నీ తప్పులుగానే కనబడుతూంటాయి. ఇది నిజం.

© SCERT not to be republished



5. వీడు పరులవాడు; వాడు నావాడని
అల్పబుద్ధి తలచు నాత్మయందు
సాధుపుంగవులకు జగమే కుటుంబంబు
లలిత సుగుణజాల! తెలుగుబాల!

భావం : వీడు పరాయివాడు, వాడు నావాడని బుద్ధిలేనివాడు అనుకొంటారు. సజ్జనులు ఈ ప్రపంచమంతా తన కుటుంబమేనని భావిస్తారు.



6. సత్ప్రవర్తనంబు, సౌఖ్యంబు, మర్యాద
మంచివారి పొందు మనకు నిచ్చు
కలుషమతుల పొందు కలహాలు గొనితెచ్చు
లలిత సుగుణజాల! తెలుగు బాల!

భావం : మంచివారి స్నేహంవల్ల మంచి నడవడిక, సుఖం, గౌరవం లభిస్తాయి. చెడవాళ్ళతో స్నేహంవల్ల పోట్లాటలు వస్తాయి.



7. ఎంత చెలిమియున్న ఎగతాళి చేయకు
సరసమంత నంత విరసమగును
మాట జారెనేని మరి తీసుకోలేము
తెలిసి మెలగుమయ్య తెలుగుబిడ్డ

భావం : ఓ తెలుగు బిడ్డా! నీవు ఎంత దగ్గరి వారినైనాగాని, స్నేహితులనైనా గాని ఎగతాళి చేయకూడదు. దీని వల్ల స్నేహం చెడిపోతుంది. స్నేహితుల మధ్య సంబంధాలు దెబ్బతింటాయి. దేన్నైనా వెనుకకు తీసుకోవచ్చు. కాని మాట జారితే మాత్రం వెనుకకు తీసుకోలేం. కాబట్టి ఇది తెలుసుకొని మనం మెలగాలి.

8. నల్లనిదని విడువజెల్లునె కస్తూరి
తెల్లనిదని దాల్తె రెల్లుపూవు
వన్నెలోన నేమి వైభోగమున్నది
విలువ కట్టి చూడ తెలుగుబిడ్డ



భావం : కస్తూరి సువాసన కలిగి ఉన్న పదార్థం. ఇది నల్లగా ఉంటుంది. నల్లగా ఉన్నంత మాత్రాన కస్తూరిని మనం వదిలి పెడతామా? అలాగే రెల్లు పువ్వు తెల్లగా ఉంటుంది. తెల్లగా ఉన్నంత మాత్రాన తలలో ధరిస్తారా? రంగుల వల్ల గొప్పదనం రాదు. దానికున్న విలువను బట్టి గొప్పదనం వస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

9. నిలిచి నీళ్ళు త్రాగ నీరుకాఋ బ్రతుకు
పరుగులెత్తవోయి పాలు త్రాగ
పరుగునుండె పుట్టె నరుని నాగరికత
వాస్తవమ్ము నార్లవారి మాట



భావం : నాగరిక ప్రపంచంలో నిదానంగా ఉంటే వెనుకబడిపోతావు. పరుగెత్తయినా పాలు తాగే కాలమిది. వేగం నుండే నేటి ఆధునికత పుట్టింది. ఇది నిజం.



10. చెప్పకు చేసిన మేలనొ
కప్పుడయిన గాని దాని హర్షింపరుగా
గొప్పలు సెప్పిన నదియును
దప్పేయని చిత్తమందు దలపు కుమారీ.

భావం : ఇతరులకు చేసిన సహాయాన్ని గురించి ఎవరితోను గొప్పగా చెప్పుకోకు. అలా చెప్పడాన్ని పెద్దలు మెచ్చుకోరు. గొప్పలు చెప్పుకోవడం అన్నది తప్పు అన్న విషయాన్ని మనసులో ఉంచుకోవాలి.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) పద్యాలను రాగయుక్తంగా పాడి, వాటి భావం చెప్పండి.
(ఆ) ఇంతకు పూర్వం మీకు తెలిసిన పద్యాలను గురించి చెప్పండి.
(ఇ) స్నేహితులంటే ఎలా ఉండాలో చెప్పండి. నీ స్నేహితులతో నువ్వు ఎలా ఉంటావు?
(ఈ) కలిసిమెలిసి ఉండడంవల్ల ఏం జరుగుతుంది?
(ఉ) పాఠంలోని పద్యాలలో మీకు ఏ పద్యం నచ్చింది? ఎందుకు?

### II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



(అ) పద్యాలు చదవండి. కింది అర్థాలు వచ్చే పదాలు పద్యాలలో గుర్తించండి. రాయండి.

(అ) గొప్పతనం (ఆ) సజ్జనులు (ఇ) సుఖం (ఈ) నీచుడు

అ. ________ ________ ________ ________

(ఆ) కింది భావాలకు సరైన పద్యపాదాలు రాయండి.

1. సాధనతో ఏ పనులైనా సాధించవచ్చు.

________________________

2. కోపంవల్ల గొప్పతనం తగ్గిపోతుంది.

3. చెడ్డవాళ్ళతో స్నేహం వల్ల పోట్లాటలు వస్తాయి.

4. సజ్జనులకు ఈ ప్రపంచమే వారి కుటుంబం.

**(ఇ) కింది పద్యాలను పూరించండి.**

1. "ఇమ్ముగc జదువని నోరును..................... సుమతీ!
2. "సత్రవర్తనంబు, సౌఖ్యంబు, మర్యాద............... తెలుగుబాల!



**(ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. కోపంవల్ల గొప్పతనం తగ్గిపోతుందని ఎందుకు అన్నారు?
2. సాధన చేస్తే ఏ పనులైనా నెరవేరతాయా? ఎలాగో చెప్పండి?
3. స్నేహం చెడిపోతే ఏమవుతుంది.
4. సజ్జనుడు ఏమని భావిస్తాడు?
5. దేన్నిబట్టి విలువ లభిస్తుంది?
6. గొప్పలు ఎందుకు చెప్పుగూడదు?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అనే పద్యంలో కష్టపడి సాధన చేస్తే ఏ పనులైనా సాధించగలం అని చెప్పారు కదా! మీరు ఏవేవి సాధన చేయాలనుకుంటున్నారు?

(ఆ) అందరినీ తనవారుగా మంచివాడు భావిస్తాడు. మీరు మీ తరగతిలో ఉన్న వారందరితో ఎలా ఉంటారు? ఎందుకు అలా ఉంటారో రాయండి.

(ఇ) మీకు బాగా నచ్చిన మీ స్నేహితుణ్ణి గురించి రాయండి. తను మీకు ఎందుకు బాగా నచ్చాడో రాయండి.

(ఈ) మంచి వాళ్ళతోనే స్నేహం ఎందుకు చేయాలి?

(ఉ) సజ్జనులు ప్రపంచాన్ని తన కుటుంబంగా ఎందుకు భావిస్తారు?

## IV పదజాలం


**(అ) కింది వాక్యాల్లోని గీతగీసిన పదాలకు అదే అర్థం వచ్చే పదాలు రాసి ఆ వాక్యాలు తిరిగి రాయండి.**



1. సత్రవర్తన వల్ల మంచిపేరు వస్తుంది.
2. ఎగతాళి చేయడం వల్ల మిత్రులుగా ఉన్నవారి మధ్య విరోధం పెరగడం వాస్తవం.
3. గాంధీజీ ఘనత పొందిన నాయకుడు.
4. మంచిపేరు సంపాదించిన పిల్లలను చూసి తల్లిదండ్రులు హర్షం పొందుతారు.
5. మంచి చిత్తం ఉన్నవారికి అంతా మంచే జరుగుతుంది.

© SCERT not to be republished


## V సృజనాత్మకత



(అ) పాఠంలోని ఏదో ఒక పద్య భావానికి తగిన విధంగా కథ రాయండి.

(ఆ) పాఠంలోని పద్యాల భావాల ఆధారంగా సూక్తులు, నినాదాలు రాయండి.

## VI ప్రశంస :



(అ) పాఠంలోని పద్యాలు పాడారు కదా! బాగా పాడినవారిని మీరు ఎలా మెచ్చుకుంటారు?

(ఆ) పద్యాల పోటీలలో మీ మిత్రులు గెలిస్తే ఎలా అభినందిస్తారు?

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కిందిపేరా చదవండి. ఈ గుర్తు(!)కు '○' చుట్టండి. ఈ గుర్తున్న (!) వాక్యాల కింద గీత గీయండి.**

రాజును ఎక్కడికి వెళ్లావని టీచర్ అడిగింది. "జూ కెళ్ళాం టీచర్. అబ్బో! జూ ఎంత పెద్దగాఉందో! రకరకాల జంతువులు, పక్షులు చూశాం" అన్నాడు. "ఏ జంతువులు చూశారు?" అని టీచర్ రాజును అడిగింది. "బాబోయ్! పెద్ద సింహం చూశాను టీచర్!" అన్నాడు. "అట్లాగా! ఇంకా ఏమేం చూశావ్?" అని టీచర్ అడిగింది.

పిల్లలూ ! నేను (!) ఆశ్చర్యకరమైన వాక్యాల చివర ఉంటానని గుర్తించారు కదా! నన్నేమంటారో తెలుసా!

నన్ను (!) ఆశ్చర్యార్థక చిహ్నం అంటారు. ఈ గుర్తుగల వాక్యాలను ఆశ్చర్యార్థక వాక్యాలు అంటారు. సంబోధన, ఆశ్చర్యం, సంతోషం, భయం మొదలైన పదాల తర్వాత కూడా నన్ను ఉపయోగిస్తారు.

పిల్లలూ! 4,5,6 పాఠాల్లో ఆశ్చర్యార్థకాలున్న వాక్యాలను గుర్తించండి. వాటి కింద గీత గీసి చదవండి.

### ప్రాజెక్టు పని



వేమన, సుమతి పద్యాలను సేకరించండి. తరగతిలో పాడి వినిపించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పద్యాలను రాగ, భావయుక్తంగా పాడగలను. | ఔను/కాదు |
| 2. | పద్యాల భావాలను సొంత మాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | స్నేహితుని గురించి రాయగలను. | ఔను/కాదు |
| 4. | పద్యాల భావాలకు తగిన కథను రాయగలను. | ఔను/కాదు |

ధనంపోతే తిరిగి సంపాదించవచ్చు - శీలం పోతే తిరిగి సంపాదించలేము.

© SCERT not to be republished

రెండో యూనిట్

# 8. ఎలుక విందు

కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రం చూడండి. ఏం జరుగుతోందో చెప్పండి.
- ఎలుక చేతిలో ఏమి ఉంది? ఎందుకు పట్టుకుంది.
- ఎలుకలు దేని గురించి మాట్లాడుకొంటూ ఉంటాయి? ఏమని మాట్లాడుకొంటూ ఉంటాయి?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**పిల్లి ఎప్పుడూ ఎలుకలను వేటాడి తింటుండడం మనకు తెలుసుకదా! పిల్లితో స్నేహంగా ఉందామని ఒక ఎలుకపిల్ల పిల్లిని విందుకు పిలిచింది. విందుకు వచ్చిన పిల్లి ఏం చేసిందో చూడండి...**



ఎలుక వచ్చి పిల్లిబావ నేమనన్నదీ?
అలుక వీడి తన యింటికి రమ్మనన్నదీ

అసలు పిల్లి అలిగి యేల కూరుచున్నదీ
ఎలుక పిల్ల ఎన్నడేమి పెట్టలేదనీ

విందుచేతు నేడు నీవు రమ్మనన్నదీ
ఎలుక మాటలాకు పిల్లి నవ్వుకొన్నదీ

ఎలుకముందు, పిల్లి వెనక ఏగుచున్నవీ
కలుగులోన రెండు కూడ కలుసుకొన్నవీ


భూమి అడుగులోన ఎలుక కిల్లున్నదీ
ఇంటిలోన దానికొక్క తల్లియున్నదీ

ఇల్లు జూచి పిల్లియెంతొ మెచ్చుకున్నదీ
భూమిలోన ఎలుకమేడ పెద్దగున్నదీ


గదులలోన రంగైన బొమ్మలున్నవీ
కుర్చీలు మంచాలు బల్లలున్నవీ


ఉయ్యాల మంచాలు ఊగుతున్నవీ
ఎలుక పిల్లలే వాటిని లాగుతున్నవీ

గదులలోన ధాన్యాలు నిండియున్నవీ
గోధుమల బియ్యాల రాసులున్నవీ









© SCERT not to be republished

కందిపప్పు పెసరపప్పు సారపప్పు జీడిపప్పు
కలకండ పంచదార బెల్లాలు కొల్లలు



మర్మరాలు చక్కిలాలు అటుకులున్నవీ
మణుగుబూరె పూర్ణాలు అరిసెలున్నవీ

వంట ఇంటి నుండి నేతి వాసనొచ్చెనూ
వాసనతో పిల్లినోట నీరు వచ్చెనూ



కొత్త చుట్ట మొచ్చెనని ఎలుక తల్లి మురిసింది
వెండిపూల పీటమీద పిల్లిని కూర్చోమన్నది



అరిటేకు విస్తరిలో అన్నం వడ్డించారు
కూరలన్ని చుట్టువేసి చారుగిన్నె పెట్టారు

వెన్న కాచినట్టి నెయ్యి అన్నంలో వేశారు
వట్టివేళ్ళ విసనకఱ్ఱతో పిల్లికి విసిరారు

పిల్లినిటకు తెచ్చినట్టి ఎలుకపిల్ల పక్కనుండె
రకరకాల వంటకాలు చక్కగ వడ్డించుండె

అతిథికేమి కావలెనో అడుగుటకై ఎలుకపిల్ల
పిల్లి ముందరే పీటను వేసుకొని కూరుచుండె



పిల్లి అన్ని వంటకాలు చల్లగాను కలయజూచె
కొద్దికొద్దిగా నాలుక కద్దుకోని రుచిచూచె

అన్నిటికన్నా పిల్లికి ఎదుటనున్న ఎలుకపిల్ల
రుచిగా నున్నట్లుతోచె దానినె తినుటకు చూచె

గబాలున ఎలుకమీద గంతువేసె పిల్లి తాను
ఎలుకపిల్ల దానినోట ఇరుక్కొన్న దప్పుడే

కీచుకీచుమని ఎలుక కేకలు పెట్టగసాగెను
ఇంటిలోని ఎలుకలన్ని ఏమిటేమిటని చూచెను

నోటకరచుకొని ఎలుకను పిల్లి ఉరుక ప్రయత్నించెను
'తల్లి ఎలుక' రోకలితో తలమీదొక్కటి దంచెను

© SCERT not to be republished



ఎలుకపిల్ల నోటి నుండి ఎగిరి కిందపడ్డది
పిల్లి పరుగుతీసి బయటి వసారాలో పడ్డది

ఈటెలతో బల్లేల్తో ఎలుకలన్ని వచ్చెను
పిల్లిపోయి ఒక తీగెల పొదలోపల చొచ్చెను

ఎలుకలన్ని కమ్ముకొనెను నలువైపులనుండీ
మ్యావు మ్యావుమని అరచెను పిల్లి పొదలనుండీ


పిల్లిని బయటికి లాగగ ఎలుకలన్ని ప్రయత్నించె
తుదకు వీలుగాక పక్క త్రోవలందు పొంచె

ఎలుక లేగెనని పిల్లి ఇవతలికేతెంచె
ఇంతలోన ఎలుకలన్ని పిల్లిపైకి దూకె

పిల్లి ఎలుకలా గోలకు ఇల్లు ఇల్లు మారుమోగె
ఇంటిలోన పిన్నపెద్దలెల్లరు నిద్దురలేచిరి

(ఆ తరువాత ఏమైందో ఊహించి చెప్పండి.)

– దాశరథి కృష్ణమాచార్య



© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) గేయకథను లయబద్ధంగా రాగంతో పాడండి.

(ఆ) గేయకథను సొంతమాటల్లో చెప్పండి.

(ఇ) ఎలుకపిల్ల పిల్లిని విందుకు పిలిచి వంటలు చేసింది కదా! ఇలా రకరకాల పిండివంటలు మీ ఇంట్లో ఎప్పుడెప్పుడు చేస్తారు?

(ఈ) ఎలుకలను మీరు ఎక్కడెక్కడ చూస్తారు. ఎలుకలు ఉండడం వల్ల మనకు లాభమా? నష్టమా?

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం. రాయడం



(అ) పాఠంలోని వాక్యాలలో '*' గుర్తు ఉన్న పదాలు ఉన్నాయి. వాటి కిందగీత గీయండి. రాయండి.

(ఆ) కింది భావాలను చదవండి. పాఠంలో వీటికి సంబంధించిన వాక్యాల కింద గీత గీయండి.

1. ఎలుకల ఇల్లు చాలా పెద్దగా ఉంది.
2. అన్నీ ఉన్నా పిల్లికి ఎలుకను తినాలనిపించింది.
3. పిల్లి ఒక పొదలో దాక్కుంది.
4. పిల్లికి రకరకాల వంటలు వడ్డించారు.
5. ఎలుక పిల్లిని విందుకు రమ్మని చెప్పింది.



(ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పిల్లి ఎందుకు అలిగింది?
2. ఎలుక ఇల్లు చూసిన పిల్లి ఎందుకు మెచ్చుకుంది?
3. ఎలుక ఇంట్లో పిల్లికి ఏమేమి కనిపించాయి?
4. ఎలుక పిల్లికి ఏమి వడ్డించింది?
5. పిల్లి ఎలుకను ఎందుకు పట్టుకుంది?
6. పిల్లితో ఎలుకలన్నీ ఎలా యుద్ధం చేశాయి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) కథలో తర్వాత ఏం జరిగిందో ఊహించి రాయండి.

(ఆ) ఎలుక ఇంటికి వచ్చిన పిల్లికి రకరకాల పిండివంటలు చేసి సకల మర్యాదలు చేశాయి కదా! మీ ఇంటికి వచ్చిన అతిథులకు మీరు ఎలా మర్యాద చేస్తారు?

(ఇ) గేయకథను మీ సొంతమాటల్లో రాయండి.

©SCERT not to be republished

(ఈ) కథలో పిల్లి చెడ్డదిగా కాకుండా మంచిగా ఉండి ఉంటే పిల్లి, ఎలుకల మధ్య స్నేహం ఎలా ఉండేదో ఊహించి రాయండి.


## IV పదజాలం



(అ) ఎలుక ఇంట్లో ఏమేమి ఉన్నాయో తెలుసుకున్నారు కదా! మరి మీ ఇంట్లో ఏమేమి ఉన్నాయో కింది పట్టికలో రాయండి.

| | వస్తువులు | బొమ్మలు | సరుకులు | పిండివంటలు | జంతువులు |
|---|---|---|---|---|---|
| ఉదా : | కుర్చీలు | రంగుబొమ్మలు | బియ్యం | చక్కిలాలు | ఎలుకలు |
| | | | | | |

(ఆ) కింద గీత గీసిన పదాలను చూడండి. వాక్యాలను చదివి వాటి సరైన అర్థాలను గుర్తించండి.



1. మా ఇంట్లో బొద్దింకలు కొల్లలుగా ఉన్నాయి. ( )

అ) తక్కువ ఆ) ఎక్కువ ఇ) కొద్దిగా

2. ఎలుక ముందు, పిల్లి వెనక ఏగుచున్నవి. ( )

అ) ఆడుతున్నాయి ఆ) పాడుతున్నాయి ఇ) వెళుతున్నాయి

3. తుదకు ఆ కథ సుఖాంతం అయ్యింది. ( )


అ) చివరకు ఆ) ప్రారంభంలో ఇ) మధ్యలో

సరైన జవాబులు కనుక్కొన్నారు కదా! వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

(ఇ) కింది వాక్యాలు చదవండి.

**ఉదా:** రామును పెన్ను ఇవ్వమని అడుగు.

మహాత్ముల అడుగుజాడల్లో నడవాలి.



గీతగీసిన పదం ఒక్కో వాక్యంలో ఒక్కో అర్థాన్ని ఇచ్చింది కదా! కింద ఇచ్చిన పదాలతో వేరు వేరు అర్థాలు వచ్చేలా వాక్యాలు రాయండి.

1. తేలు :
2. పెరుగు :
3. కలుగు :
4. తెలుపు :
5. చెప్పు :

© SCERT not to be republished

## V సృజనాత్మకత



(అ) ఎలుక, పిల్లి ముఖాల 'తొడుగులను' (మాస్కులను) అట్టలు, రంగు కాగితాలతో తయారు చేయండి. వాటికి రంగులు వేయండి.

(ఆ) గేయకథలో పిల్లి, ఎలుక మధ్య సంభాషణలను రాయండి. నాటకీకరణ చేయండి.

## VI ప్రశంస:



మీరు సెలవుల్లో మీ మిత్రుడి ఇంటికి వెళ్ళారు. అక్కడ వాళ్లు మిమ్మల్ని చాలా బాగా చూసుకున్నారు. తోటకు తీసుకెళ్ళారు. ఆటలు ఆడారు. కథలు చెప్పుకున్నారు. ఇలా ఎన్నో రకాలుగా ఆనందించారు. ఇందుకోసం మీరు మీ మిత్రుణ్ణి అభినందిస్తూ, కృతజ్ఞతలు తెల్పుతూ లేఖ రాయండి.

## VIII భాషను గురించి తెలుసుకుందాం



ముందు పాఠంలో సంబోధన, ఆశ్చర్యం, సంతోషం, భయం మొదలైన పదాల ముందు ఆశ్చర్యార్థకపు గుర్తు (!)ను ఉపయోగించాలని తెలుసుకున్నారు కదా! కింది పేరా చదవండి. ఈ గుర్తు(!)ను సరైన పదాల వద్ద ఉంచండి.

అక్బరు పాదుషా పకపకా నవ్వుతూ 'చూశావా బీర్బల్! ఎంత విచిత్రం జరుగుతున్నదో నేను ఇంత వరకు నాలుగు పళ్ళు కూడా తినలేదు. కాని ఈ మహారాణి చూశావా అప్పుడే ఎన్ని మామిడి పళ్ళు ఆరగించిందో ' అన్నాడు. బీర్బల్ ఆశ్చర్యంగా పాదుషావైపు చూసి 'రాణి గారు మాత్రం ఎన్ని పళ్ళు తిన్నారు హుజూర్ వారు మీకంటే మెల్లగానే ఆరగిస్తున్నారు కదా' అన్నాడు. రాణి మాత్రం వంచిన తల ఎత్తలేదు మౌనంగా పాదుషా మాటలు ఆలకించ సాగింది. పాదుషా రాణి పళ్ళెం వైపు చూపిస్తూ 'సరిగా చూడు బీర్బల్ ఆమె పళ్ళెం పక్కన ఎన్ని తొక్కలు పడి ఉన్నాయో చూడు ఎన్ని టెంకెలు గుట్టపడి ఉన్నాయో చూడు పాపం మహారాణికి ఎంత ఆకలిగా ఉన్నదో ఆ విధంగా అద్భుతమైన భోజన పరాక్రమం ప్రదర్శిస్తున్నది' అన్నాడు నవ్వుతూ.

### ప్రాజెక్టు పని



మీ పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు చదవండి. వాటిలో "ఎలుక-పిల్లి" వీటికి చెందిన కథలు చదవండి. వాటిని గురించి డైరీలో రాయండి. చదివి వినిపించండి.

### నేనివి చేయగలనా?

1. గేయాన్ని లయబద్ధంగా రాగంతో పాడగలను. కథను సొంతమాటల్లో చెప్పగలను. ఔను/కాదు
2. గేయాన్ని ధారాళంగా చదవగలను, భావాలకు తగిన వాక్యాలను గుర్తించగలను. ఔను/కాదు
3. గేయకథను సొంతమాటల్లో రాయగలను. ఔను/కాదు
4. 'తొడుగులు' (మాస్కులు) తయారు చేసుకొని, గేయకథను నాటకీకరణ చేయగలను. ఔను/కాదు

నిన్ను నువ్వెట్లా ప్రేమిస్తావో - నీ పొరుగువారిని కూడా అట్లాగే ప్రేమించు.

- జీసస్

© SCERT not to be republished

చదువు

ఆనందించు

# తెలుగు సంవత్సరాలు

దీపిక చేతిలోని శుభలేఖను చూసుకుంటూ మురిసిపోతోంది. ఇంట్లోకి వస్తున్న హారిక "ఏమిటమ్మా! అలా నీలో నీవే సంతోషపడుతున్నావు?" అంటూ దగ్గరకు వచ్చింది. "మా బాబాయి కొడుకు రాముకి పెళ్లికుదిరింది. ఇదిగో శుభలేఖ" అంటూ దాన్ని హారికకు ఇచ్చింది. హారిక శుభలేఖ చదివింది.

శుభలేఖలో 'నందననామ' సంవత్సరం అని ఉంది. "అమ్మా! ఇది 2012వ సంవత్సరం కదా! ఇందులో ఇలా రాశారేమిటి?" అని అడిగింది హారిక.

ఓహో? అదా నీ సందేహం! పోయిన నెలలో మనం 'ఉగాది' పండుగ జరుపుకున్నాం గుర్తుందా?" "గుర్తుందమ్మా! ఆ రోజు కొత్త సంవత్సరం వచ్చిందని నువ్వు ఉగాది పచ్చడి చేశావు. తాతయ్య పంచాంగశ్రవణం చేశాడు కదా!" "బాగా గుర్తుందే! 'నందన' అనేది ఒక తెలుగు సంవత్సరం పేరు" అంది దీపిక. "ఈ సంవత్సరాలు అనేవి ఎందుకమ్మా?" అడిగింది హారిక. చరిత్రలో ఎప్పుడు ఏం జరిగిందో చెప్పడానికి సంవత్సరాలు అవసరం కదా! అందుకని మన పెద్దలు సంవత్సరాల లెక్కలు, వాటికి పేర్లు ఏర్పాటు చేశారు."

"అంటే ఒక్కో సంవత్సరానికి ఒక్కో పేరు ఉంటుందన్నమాట" అంది హారిక.

"ఔను, మనకు తెలుగులో అరవై సంవత్సరాలు ఉన్నాయి" అంది దీపిక.

"వాటిపేర్లు నీకు తెలుసా? చెప్పవా అమ్మా!" అంది హారిక.

"తెలుసు!" అని అమ్మ సంవత్సరాల పేర్లు చెప్పింది. హారిక రాసుకుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. ప్రభవ | 11. ఈశ్వర | 21. సర్వజిత్తు | 31. హేవిళంబి | 41. ప్లవంగ | 51. పింగళ |
| 2. విభవ | 12. బహుధాన్య | 22. సర్వధారి | 32. విళంబి | 42. కీలక | 52. కాళయుక్తి |
| 3. శుక్ల | 13. ప్రమాది | 23. విరోధి | 33. వికారి | 43. సౌమ్య | 53. సిద్ధార్థి |
| 4. ప్రమోదూత | 14. విక్రమ | 24. వికృతి | 34. శార్వరి | 44. సాధారణ | 54. రౌద్రి |
| 5. ప్రజోత్పత్తి | 15. వృష | 25. ఖర | 35. ప్లవ | 45. విరోధికృతు | 55. దుర్మతి |
| 6. ఆంగిరస | 16. చిత్రభాను | 26. నందన | 36. శుభకృతు | 46. పరీధావి | 56. దుందుభి |
| 7. శ్రీముఖ | 17. స్వభాను | 27. విజయ | 37. శోభకృతు | 47. ప్రమాదీ(చ) | 57. రుధిరోద్గారి |
| 8. భావ | 18. తారణ | 28. జయ | 38. క్రోధి | 48. ఆనంద | 58. రక్తాక్షి |
| 9. యువ | 19. పార్థివ | 29. మన్మథ | 39. విశ్వావసు | 49. రాక్షస | 59. క్రోధన |
| 10. ధాత | 20. వ్యయ | 30. దుర్ముఖి | 40. పరాభవ | 50. నల | 60. అక్షయ |

© SCERT not to be republished

"ఈ అరవై సంవత్సరాలు పూర్తి అయిపోతే ఎలాగమ్మా! మళ్లీ కొత్త పేర్లు వస్తాయా?" సందేహం వెలిబుచ్చింది హారిక. అమ్మ చిరునవ్వు నవ్వింది. "ఈ అరవై సంవత్సరాలు ఇదే వరసలో ఒకదాని తరువాత ఒకటి మళ్లీ వస్తాయి. ఈ వరస పూర్తి అయిన తర్వాత మళ్లీ ఇవే మొదలవుతాయి. దీన్నే షష్టివర్ష చక్రం అంటారు." అని చెప్పింది దీపిక.

ఈ పేర్లను నేను చదివి జ్ఞాపకం పెట్టుకొంటాను. నోటికి నేర్చుకొంటాను. నేను తెలుసుకున్న ఈ తెలుగు సంవత్సరాల పేర్లను మా మిత్రులకు కూడా తెలియజేస్తాను", అంటూ సంతోషంగా వెళ్లింది హారిక.

మూడో యూనిట్

# 9. చిలుక సందేశం

కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**


- చిత్రం చూడండి. చిత్రంలో ఏమేమి ఉన్నాయి? అవి ఎక్కడ ఉన్నాయి? ఎందుకు?
- పులి, సింహం ఏమని మాట్లాడుకొంటున్నాయో ఊహించి చెప్పండి.
- పక్షుల్ని, జంతువుల్ని అలా బంధించి ఉంచడం మంచిదేనా? ఎందుకు?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**ఇది గేయ రూపంలో ఉన్న నాటిక. ఇందులో పిల్లలు రామచిలుకను చూసి ముచ్చటపడి ఆడుకుందామనుకుంటారు. కానీ రామచిలుక పిల్లలతో ఆడడానికి ఇష్టపడదు. రామచిలుకకూ, పిల్లలకూ మధ్య జరిగిన సంభాషణలో చివరికి ఏమి జరిగిందో ఈ పాఠం చదివి తెలుసుకోండి.**



పిల్లలు : అదిగో చిలుక – రండర్రా – రండి–
చిలుకతో మాట్లాడుదాం. (చిలుకనుద్దేశించి)

పాట : పచ్చపచ్చని ఆకు పరదాల దాగి
పలుకుబారిన జామి – పండుకొరికేటి
చిలుకమ్మ! మా చిన్ని పిలుపు వింటావా?
మా పెరటిలో కొక్కమారు వస్తావా?

కొండంత చుట్టేవు – కోనలో తిరిగేవు
మా ఇంటి కంటేను – మారాము చేస్తావు
దోరగా పండిన – దొండ పండిస్తాము
ఆరముగ్గిన పచ్చనరటి పండిస్తాము
పంజరం చేయించి పంచలో కడతాము
రంగురంగుల చిలుక! రావేమి? అలుకా?

చిలుక : (కొంటెగా నవ్వుతూ)

పంజరం నాకేల? పసిడి నాకేల?
పచ్చపచ్చని చెట్లు – పండ్లు కావాలి
ఊగిపోయే కొమ్మ ఉయ్యాలలుంటే
హాయిగా నేనూగి ఆడుకోవాలి.

దండిగా చివురుల తావి కావాలి
నిండుగా చల్లని నీడ కావాలి
నిర్మలంగా ఉన్న – నీరు కావాలి
నిశ్చింతగా నేను పాడుకోవాలి.

నేరేడు చెట్టయిన నీ ఇంటలేదు
మారేడు చెట్టన్న మాటయే లేదు
జామిచెట్టొకటైన – మావిచెట్టయిన
పెరటిలో పచ్చగ – పెరగనే లేదు



© SCERT not to be republished

పిల్లలు : చిలుకమ్మ నీతోటి చెలిమి కావాలి
నీకేమి ఇష్టమో మాకేమి తెలుసు?
మా ఇంటికే వచ్చి మాకు తోడుంటే
చెప్పినట్టే మేము-చేసి పెడతాము.



వాడితేరిన కొన - వంపుగా తిరిగి
చిలుకమ్మ నీ ముక్కు చిత్రంగ ఉంది
ఆకుపచ్చని రెక్కలమరి ఉన్నాయి
అందరము నీతోను ఆడుకుంటాము.

చిలుక : కాళ్ళు ముడుచుకొని కుదురుగ - కూర్చుని
చేతులతో మీ పనులు చేసుకుంటారు
చేతులవి వేరుగా లేని చిలుకలము
ముక్కుతోనే పనులు చేసుకోవాలి

తొందరగ శత్రువుకు దొరికిపోకుండా
ఆకుపచ్చని రంగు అభయమిస్తుంది
ఆకులో ఆకులా కలిసిపోతాము
గుబురులో గుట్టుగా - కూరుచుంటాము.

© SCERT not to be republished


పిల్లలు : నిన్ను చూస్తుంటేను నీతోను ఉండి
మాటలాడాలని మనసుగా ఉంది
ఆటలాడాలని - ఆశగా ఉంది
ఎగిరిపోవాలని - వేడుకగ ఉంది



చిలుక : ఆటపాటలమీద నాకెంతొ మనసు
ఆకతాయిల కెపుడు నేనంటె అలుసు
రాలుగాయలు నన్ను రాళ్ళతో కొట్టి
వేధించుతారన్న భీతి లేకుంటే
హాయిగా మీతోటి ఆడుకుంటాను
పాటలెన్నో కూర్చి పాడుకుంటాను.

పిల్లలు : రాళ్ళతో వేధించు రాలుగాయలు లేరు
ఆకతాయిలు ఎపుడు మా దరికిరారు
మాతోటి చెలిమిని మానబోకమ్మ
మా మాట నిజమమ్మ రామచిలుకమ్మ

చిలుక : విరివిగా తెచ్చి నే - విత్తనాలిస్తా
పెరటిలో మొక్కలు - పెంచుకొండమ్మా
పళ్ల చెట్లుంటేను - ఇళ్ళకే అందం
పచ్చ పచ్చని చెట్లు పల్లెకే అందం
పల్లెలో చెట్లుంటె - పక్షులొస్తాయి
పాటలెన్నో పాడి పరవశిస్తాయి
ఎండవేడికి తాళలేని పశువులు చేరి
నెమ్మదిగ మేతను నెమరువేస్తాయి
నీడలో హాయిగ నిద్రపోతాయి



చక్కగా చెట్లుంటే చిలుకమ్మలక్కడే
కాపురాలుండి రాగాలు తీస్తాయి
పచ్చ పచ్చని ఆకు పరదాల మాటునే

ముచ్చటలు చెప్పుకొని - మురిసిపోతాయి
పెరటిలో చెట్లను పెంచుకుంటేను
మీ చెట్లలో కొచ్చి మీకు తోడుంటా
మీ ఆట పాటలు మేలుగా నేర్చి
కొత్తపాటలు నేను కూర్చి నేర్పిస్తా.



మూలం- మల్లెపందిరి
గిడుగు రాజేశ్వరరావు

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం




(అ) గేయాన్ని రాగయుక్తంగా పాడండి, అభినయించండి.

(ఆ) ఈ గేయం దేన్ని గురించి చెబుతుంది? గేయం ద్వారా మీరేమి తెలుసుకున్నారు?

(ఇ) చిలుకలాంటి పక్షులు మన ఇంట్లోకి రావాలంటే మీరైతే ఏం చేస్తారు?

(ఈ) చిలుక అంటే అందరికీ ఇష్టమే! మరి ఆ చిలుక ఎలా ఉంటుందో అందరికీ ఇష్టం కలిగించేలా చక్కటి మాటలతో చిలుక గురించి చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం రాయడం



**(అ) గేయాన్ని చదవండి. కింది పదాలతో అంతమయ్యే వాక్యాలను గేయంలో గుర్తించండి. మీకు ఏమి అర్థం అయ్యిందో చెప్పండి.**

1. మారాము చేస్తావు
2. చేసి పెడతాము
3. అభయమిస్తుంది
4. ఆశగా ఉంది
5. మీకు తోడుంటా



**(ఆ) కింది పదాలు చదవండి. అవి వేటి గురించి చెబుతున్నాయో రాయండి.**

1. పల్లెకే అందం ______________
2. నెమరువేస్తాయి ______________
3. ముక్కు చిత్రంగా ఉంది ______________
4. దోరగా పండిన ______________
5. రాగాలు తీస్తాయి ______________

**(ఇ) గేయాన్ని చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. పిల్లలు చిలుకతో స్నేహం ఎందుకు చేయాలనుకున్నారు?
2. రామచిలుక చెట్లను గురించి ఏమని చెప్పింది?
3. చిలుక ఏమేమి కావాలంది?

© SCERT not to be republished

4. పిల్లలు రామచిలుకను ఇంటికి రమ్మని పిలిచారు కదా! చిలుక ఎందుకు వెళ్లలేదు.

5. చిలుక పిల్లలకు ఏమి నేర్పిస్తానంది?

6. చిలుకతో మాట్లాడిన పిల్లలు తమకు ఏమి ఆశగా ఉందని చెప్పారు?

7. చిలుక తమ ఇంటికి వస్తే పిల్లలు ఏమేమి చేస్తామన్నారు?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) గేయ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

(ఆ) చిలుక ఇష్టాలు ఏమిటో తెలుసుకున్నారు కదా! మీ ఇష్టాలు ఏమిటో రాయండి

(ఇ) మీ గ్రామంలో పచ్చని పొలాలను, చెట్లను చూసినప్పుడు మీకు ఏమనిపిస్తుందో రాయండి.

(ఈ) బంగారు పంజరం చేయించి పెడతామని పిల్లలు అడిగినా చిలుక ఎందుకు రానంది?


(ఉ) పంజరంలో కంటే బయట ఉండడానికే చిలుక ఇష్టపడింది కదా! ఎందుకు?

## IV పదజాలం



(అ) కింది పదాలను చదవండి. వేరుగా ఉన్నవాటిని గుర్తించి '○' సున్నా చుట్టండి.

1. పావురం, చిలుక, నక్క, కాకి
2. కానుగ, బత్తాయి, మామిడి, నేరేడు
3. నిమ్మకాయ, చింతకాయ, ఉసిరికాయ, అరటికాయ
4. అమ్మ, నాన్న, మామయ్య, ఉపాధ్యాయుడు
5. బంతి, మల్లె, మామిడి, గులాబి



(ఆ) కింది గళ్లలోని అక్షరాలలో కొన్ని పక్షుల పేర్లు దాగి ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.




| | | | | |
|---|---|---|---|---|
| పా | కి | గ | ట్ట | చి |
| మ | ఈ | వు | కా | ల |
| ద్ద | లి | రా | పి | చ్చు |
| కో | ము | పెం | న్ | గ్వి |
| లు | క | నె | రం | డి |

1. ________ 5. ________

2. ________ 6. ________

3. ________ 7. ________

4. ________ 8. ________



(ఇ) కింది వాక్యాలలో గీత గీసిన పదాల వచనాలను మార్చి రాయండి.

1. రహీం తాత కథ చెప్పాడు.
2. రామ చిలుక పండు తిన్నది.
3. నేను మొక్కను పెంచాను.

© SCERT not to be republished

4. మేము పక్షులకోసం మా ఇంటి ముందు నీళ్ళు, గింజలు పెడతాం.

5. విత్తనాలు నాటితే మొక్కలు వస్తాయి.


## V సృజనాత్మకత



(అ) రామచిలుక బొమ్మను గీసి రంగు వేయండి. చిలుక గురించి ఆసక్తి కలిగేలా రెండు వాక్యాలు లేదా చిన్న గేయం రాయండి.

(ఆ) గేయంలోని పాత్రలకు తొడుగులు (మాస్కులు) తయారుచేసి అభినయించండి.

## VI ప్రశంస




(అ) పచ్చని చెట్లు ఉంటే ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది కదా! మరి మీ పాఠశాలలోగాని, మీ ఇండ్లలోగాని చెట్లను పెంచడానికి మీరు ఏం చేయాలో రాయండి.


(ఆ) మనకు గాయమైతే ఎలా బాధపడతామో, పక్షులను రాళ్ళతో కొట్టినప్పుడు, చెట్లను నరికినప్పుడు అవికూడా ఎంతో బాధపడతాయి తెలుసా? కాబట్టి వాటి పట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలో రాయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం

**(అ) కింది వాక్యాలు చదవండి. క్రియా పదాలను సరైన పట్టికలో రాయండి.**



1. ఇక్బాల్ బంతిఆట ఆడుతున్నాడు.
2. సంయుక్త పాట పాడింది.
3. అమ్మ రేపు కొత్తబట్టలు కొనితెస్తుంది.
4. కోతి కొబ్బరిచెట్టు ఎక్కుతూ ఉంది.
5. బడినుంచి పిల్లలు విహార యాత్రకు వెళ్ళారు.
6. సక్కుబాయి వచ్చే ఆదివారం చిత్తూరు వెళుతుంది.




| జరిగిన పని | జరుగుతున్న పని | జరగబోయే పని |
|---|---|---|
| | | |

పట్టికను నింపారు కదా!

'పాడింది., వెళ్ళారు... ఈ పదాలు జరిగిపోయిన పనిని గురించి తెలియజేస్తున్నాయి. కదా! ఇలా జరిగిపోయిన పనిని గురించి తెలిపే పదాలున్న వాక్యాలు 'భూతకాలపు' వాక్యాలు.

© SCERT not to be republished



'ఆడుతున్నాడు, ఎక్కుతూ ఉంది' ఈ పదాలు జరుగుతున్న పనిని తెలియజేస్తున్నాయి కదా! ఇలా జరుగుతూ ఉన్న పనిని గురించి తెలిపే పదాలున్న వాక్యాలు 'వర్తమాన' కాలపు వాక్యాలు.

'కొనితెస్తుంది, వెళుతుంది'... ఈ పదాలు జరగబోయే పనిని తెలియజేస్తున్నాయికదా! ఇలా జరగబోయే పనిని గురించి తెలిపే పదాలున్న వాక్యాలు 'భవిష్యత్' కాలపు వాక్యాలు.

**(ఆ) కింది వాక్యాలను చదవండి. ఏ కాలంలో ఉన్నవో రాయండి.**

1. జోసఫ్ రేపు హైదరాబాదు వెళతాడు. ______________
2. గీత సినిమా చూసింది. ______________
3. సౌమ్య పాఠం చదువుతున్నది . ______________
4. సలీమా కథ రాసింది. ______________
5. వైష్ణవి బొమ్మలు గీస్తూ ఉన్నది. ______________
6. రాబర్ట్ ఆటల పోటీకి వెళతాడు. ______________

© SCERT not to be republished

### ప్రాజెక్టు పని



'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు', 'నేటి మొక్కే రేపటి చెట్టు' ఇలాంటి నినాదాలను సేకరించండి. ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

1. గేయాన్ని లయబద్ధంగా పాడగలను. చిలుక గురించి మాట్లాడగలను. ఔను/కాదు
2. గేయాన్ని ధారాళంగా చదవగలను.
   ఇచ్చిన పదాలు వేటి గురించి చెబుతున్నాయో రాయగలను. ఔను/కాదు
3. గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. ఔను/కాదు
4. గేయాన్ని నాటకీకరణ చేయగలను. చిలుక బొమ్మను గీసి కవిత రాయగలను. ఔను/కాదు

జీవుల్ని ప్రేమించండి - జీవవైవిధ్యాన్ని పెంపొందించండి.

**చదువు ఆనందించు**

# చిన్నికృష్ణుడు





కంసుడు మహాక్రూరుడైన రాక్షసుడు. కంసుని చెల్లెలు దేవకి. ఆమెకు వసుదేవునితో వివాహం జరిగింది. దేవకి వసుదేవుల ఎనిమిదవ సంతానంగా పుట్టే బిడ్డ తనను తుదముట్టిస్తాడని తెలిసి కంసుడు వారిని కారాగారంలో బంధించాడు. వారికి పుట్టిన బిడ్డలను అందరినీ హతమార్చాడు. కంసుని కారాగారంలో బందీలుగా ఉన్న దేవకి, వసుదేవులకు ఎనిమిదవ సంతానంగా కృష్ణుడు జన్మించాడు.

వసుదేవుడు ఆ పసివాణ్ణి చెరసాల నుండి తప్పించి కాపాడాలనుకున్నాడు. ఆ రాత్రికి రాత్రే గోకులంలో తన స్నేహితుడైన నందగోపుడి ఇంటికి చేరుకున్నాడు. చడీచప్పుడు చేయకుండా ఆ పసివాడిని నందగోపుడి భార్య యశోద పక్కన పడుకోబెట్టాడు. ఆమె పక్కలో ఉన్న ఆడపిల్లను తీసుకొని వడివడిగా చెరసాలకు చేరుకున్నాడు. దేవకి పక్కన పడుకోబెట్టాడు. తెల్లవారగానే ఆడ శిశువు పుట్టిందని కంసుడు తెలుసుకున్నాడు. ఆ శిశువును చంపబోయాడు. అంతట ఆ శిశువు "ఒరే మూర్ఖుడా! నీ పాలిట మృత్యువు మరొక చోట పెరుగుతున్నాడు" అని చెప్పి మాయమైపోయింది.

గోకులంలో యశోద దంపతులు తమ ముద్దుల పుత్రుడిని చూసి ఆనందం పట్టలేకపోయారు. అతనికి కృష్ణుడు అని పేరు పెట్టారు. నందగోపుని ఇంటి వద్దే వసుదేవుని మరో భార్యయైన రోహిణి కూడా ఉంది. ఆమె కృష్ణుడి కంటే పెద్దవాడైన బలరామునికి జన్మనిచ్చింది. ఇద్దరు పిల్లలను యశోద దంపతులు అల్లారుముద్దుగా పెంచుతున్నారు.

© SCERT not to be republished



కంసుడికి శ్రీకృష్ణుని గురించి తెలిసింది. చిన్ని కృష్ణుని సంహరించుటకు మొదట పూతన అను రాక్షసిని పంపించాడు. ఆ రాక్షసి అందమైన గోపిక రూపంతో గోకులానికి వెళ్ళింది. కృష్ణుడు పాలు తాగే నెపంతో ఆమె ప్రాణాలు పోయేలా గట్టి దెబ్బతీశాడు. పెద్దగా అరుస్తూ పూతన తన నిజ స్వరూపంలోకి మారి నేలపైబడి మరణించింది.

ఊయల్లో పడుకొని ఉన్న కృష్ణుణ్ణి చంపుటకు కాకాసురుడు కాకి రూపంలో వచ్చాడు. కాని చిన్నారి కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ ఎడమచేతితో ఆ కాకి గొంతును గట్టిగా పట్టుకొని గిరాగిరా తిప్పి విసిరివేశాడు. అది కంసుని సభామండపాన పడి మరణించింది.

రాక్షసుల అరాచకాలు కొనసాగుతూ ఉండేసరికి, వాటిని భరించలేక యశోద, నందగోప దంపతులు గోకులం నుంచి యమునా తీరంలోని బృందావనానికి వెళ్లారు.

ఒకరోజు బలరాముడు, మరికొంత మంది పిల్లలు కలిసి కృష్ణుడు మట్టి తిన్నాడని యశోదకు ఫిర్యాదు చేశారు.



అతని అల్లరికి విసిగిపోయిన యశోద కోపంతో కర్ర పుచ్చుకొని వచ్చి మన్ను తిన్న విషయం గురించి కృష్ణుణ్ణి ఆరా తీసింది.

"కావాలంటే నువ్వే చూసుకో!" అంటూ నోరు తెరిచాడు కృష్ణుడు. ఒక్కసారిగా యశోద దిగ్భ్రాంతికి గురైంది. ఆమెకు బాలకృష్ణుడి నోట్లో విశాల విశ్వమంతా వెలిగిపోతూ కనిపించింది. ఆమె కోలుకొనేలోపే కృష్ణుడు కిలకిలా నవ్వుతూ తన అల్లరి కొనసాగించడానికి అక్కడి నుంచి పరుగెత్తాడు.

కృష్ణుడు వెన్నను దొంగిలించి అత్తాకోడళ్ళకు తగువు పెట్టించేవాడు. కృష్ణుడు అల్లరి పనులతో యశోదమ్మ విసిగిపోయింది. ఇలా విసుగెత్తిన యశోద ఒకరోజు అతని నడుముకు తాడు కట్టి ఒక రుబ్బురోలుకు కట్టేసింది. కానీ అంత బరువైన రోలును కూడా ఈడ్చుకుంటూ దగ్గర్లో గల తోటలోకి వచ్చాడు. అలా వెళుతున్నప్పుడు రుబ్బురోలు రెండు మద్ది చెట్ల మధ్యలో ఇరుక్కుంది. ముందుకు వెళ్తూ కృష్ణుడు కొంచెం బలంగా లాగగానే ఆ రెండు చెట్లూ వేళ్ళతో సహా కూలిపోయాయి. ఆ రెండు మద్ది చెట్లు దేవతామూర్తులుగా మారాయి. వారు శాపవిమోచన చేసిన కృష్ణునికి కృతజ్ఞతలు తెలిపారు.



ఇలా కృష్ణుడు ముద్దు ముద్దు చిలిపి పనులతో అలరిస్తూ దైవ కార్యాలను నిర్వహిస్తూ తల్లి యశోదను ధన్యురాలిని చేశాడు. తండ్రి మాటను వింటూ, మిత్రులనూ, దీనులను ఆదరిస్తూ ఆదర్శప్రాయుడైన బాల్యాన్ని గడిపాడు.

మూడో యూనిట్

# 10. రైతు తెలివి

కింది వాక్యాలు చూడండి.

- అభ్యాసం కూసు విద్య
- పిట్ట కొంచెం కూత ఘనం
- నీరు పల్లమెరుగు నిజం దేవుడెరుగు
- గుండె కరిగింది
- బుద్ధి గడ్డితిని
- కాలికి బుద్ధి చెప్పు
- వెన్నతో పెట్టిన విద్య
- మానవ సేవే మాధవ సేవ
- అడవి కాచిన వెన్నెల

© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- పై వాక్యాలను ఏయే సందర్భాలలో ఉపయోగిస్తారు.
- పై వాక్యాల అర్థం ఏమిటి?
- మీకు తెలిసిన మరికొన్ని ఇలాంటి వాక్యాలను చెప్పండి. వాటితో ఒక చిన్న కథ చెప్పండి.



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**తెలివిగా ప్రవర్తిస్తే ఎటువంటి సమస్యనైనా తేలికగా ఎదుర్కోవచ్చు. ఈ కథలో రామయ్య తన తెలివితేటలతో ఎలుగుబంటిని ఎలా బోల్తా కొట్టించాడో చదివి తెలుసుకోండి.**

'రెక్కాడితేగానీ డొక్కాడని' పేదరైతు రామయ్య. 'గొర్రెతోక' లాంటి ఆదాయంతో రోజులు భారంగా గడిపేవాడు. 'కష్టాలు కలకాలం కాపురం ఉండవు' అని నమ్మే రామయ్య ఎప్పటిలాగే తన చేలో వేరుశనగ పంట వేసేందుకు వెళ్లాడు. ఇంతలోనే ఒక తల పొగరు ఎలుగుబంటి 'పులిమీద పుట్ర'లా వచ్చిపడింది. "ఈ చేను నాది ఇక్కడ పంటవేస్తే పంటను నాశనం చేస్తాను. కాదని వేస్తే చంపుతాను" అంటూ అట్టహాసం చేసింది.

రామయ్యకు దాన్ని చూడగానే గుండెల్లో గుబులు మొదలైంది. అయినా 'గుండె దిటవు' చేసుకున్నాడు. పొలం పనిలో తాను 'మడమ తిప్పకూడదను'కున్నాడు. "ఓ ఎలుగుబంటీ! ఈ పంటను నన్ను వేసుకోనిస్తే చక్కగా పంట పైభాగం అంతా నీకే ఇచ్చేస్తాను." అన్నాడు రామయ్య. తలతిక్క ఎలుగుబంటికి 'కీలెరిగి వాత' ఎలా పెట్టాలో రామయ్యకు తెలుసు.

ఎలుగుబంటి ఆలోచించింది. 'కడుపులో చల్ల కదలకుండా' బతకటం అంటే ఎలుగుబంటికి ఇష్టం. రైతు తన 'కాళ్ల బేరానికి వచ్చేశాడని' ఆనందించింది. కష్టపడకుండా 'కడుపే కైలాసంగా – ఇల్లే వైకుంఠంగా' గడిపేద్దామనుకొంది ఎలుగుబంటి. వెంటనే రామయ్యతో ఒప్పందానికి తలూపింది.

రైతు బాగా ఆలోచించాడు. పంట పై భాగం ఇచ్చేయాలంటే తను నష్టపోకుండా ఏ పంట వేయాలా అని ఆలోచించాడు. వేరుశనగ పంట వేశాడు. రైతు పంట చక్కగా పండింది. 'కంటికి రెప్పలా పంటను కాపాడుతూ' వచ్చాడు రామయ్య.





సగం పంటను ముక్కు పిండి వసూలు చేసుకోవాలని 'కాలుగాలిన పిల్లిలా' తిరుగుతున్న ఎలుగుబంటి పంటకోత సమయానికి వచ్చింది. రామయ్య పై పైరును కోసేసి ఎలుగుబంటికి ఇచ్చాడు. తెలివితక్కువ ఎలుగుబంటి పైరొట్టను పట్టుకెళ్లింది.

రామయ్య వేరుశనక్కాయల్ని తవ్వుకొని బస్తాలకెత్తుకొని పట్టుకెళ్లాడు. ఎలుగుబంటి 'తిక్కకుదిరిందని' సంతోషించాడు. ఎలుగుబంటి ఆ పైరును నోట్లో పెట్టుకొని కొరికింది. 'ఛీ' పసరువాసన అంటూ పారేసింది. రైతు తన 'కళ్లల్లో దుమ్ము' కొట్టాడని ఎలుగుబంటి 'కడుపుమండింది'. పరుగున రైతు దగ్గరకు వచ్చింది. మోసం చేశావంటూ 'నిప్పులుకక్కింది'.

రామయ్య ఎలుగుబంటిని శాంతపరుస్తూ, "ఈసారి పంటలో ఏ భాగం కావాలో కోరుకో అదే ఇస్తాను" అన్నాడు. ఎలుగుబంటి రామయ్యతో "ఈసారి పైభాగం నీది. కింది భాగం నాది" అంటూ హెచ్చరించింది. రామయ్య సరేనన్నాడు.

రామయ్య ఈసారి వరిపంట వేశాడు. ఎలుగుబంటి 'కాలికి బలపం కట్టుకొని' పంట కోతకు వచ్చేదాకా తిరిగింది. పంట కోతకు వచ్చింది. 'గోతికాడ నక్కలా' ఎలుగుబంటి రానే వచ్చింది. రామయ్య వరి పై పైరును తాను కోసుకొని దుబ్బుల్ని ఎలుగుబంటికి ఇచ్చాడు.

ఎలుగుబంటి దుబ్బుల్ని తీసుకొని వెళ్లింది. పరపరా దుబ్బుల్ని నమిలింది. 'ఛీ పాడు గడ్డి' అంటూ దుబ్బుల్ని విసిరి కొట్టింది.

not to be republished

ఎలుగుబంటి 'ఆటకట్టు' అయ్యిందనుకొన్న రామయ్య తాను తెచ్చుకొన్న వరి ధాన్యాన్ని బియ్యంగా దంచుకొని పేలాలు, అటుకులు, బియ్యంతో రకరకాల పదార్థాలు చేసుకొని నోరారా తింటున్నాడు.

కోపంతో గుండెలు బాదుకుంటూ ఎలుగుబంటి వచ్చింది. పళ్లు కొరుకుతూ రైతును దుర్భాషలాడింది. సగం పంట ఇస్తానని "అరచేతిలో వైకుంఠం చూపిస్తావా? చిల్లిగవ్వ విలువ చేయని పాడు దుబ్బుల్ని నాకు ఇస్తావా?" అంటూ 'ఒంటికాలి మీద లేచింది'.

రామయ్య దాన్ని శాంతపరుస్తూ "నీవు అడిగిన ప్రకారమే కదా! ఇచ్చాను. ఒప్పందం ప్రకారమే నీ భాగం పట్టుకెళ్లావు" అంటూ నచ్చజెప్పపోయాడు.

రైతు మాటతో ఎలుగుబంటికి 'అరికాలిమంట నెత్తికెక్కింది.' ఈసారి తాను మోసపోకూడదనుకుంది. "ఇదిగో చూడు ఈసారి పై పైరూ, కింది భాగమూ నాదే! మధ్యలో భాగమే నీది. అర్థమయ్యిందా? అంది ఎలుగుబంటి. తన తెలివి ముందు రైతు 'పప్పూలుడకవు' అనుకొంది. ఎలుగుబంటి షరతుకు రామయ్య ఒప్పేసుకున్నాడు. ఈసారి రామయ్య చెరుకుపంట వేశాడు. పంటకోత సమయానికి ఆవురావురుమంటూ ఎలుగుబంటి వచ్చింది. రామయ్య ఎలుగుబంటి చెప్పిన షరతు ప్రకారం చెరకు పై భాగంలో ఉన్న రొట్టనీ, కింది దుబ్బుల్ని కోసేసి దానికి ఇచ్చేశాడు. పళ్లికిలించుకొంటూ ఎలుగుబంటి పట్టుకెళ్లింది.

రామయ్య చెరకుగడల్ని పట్టుకెళ్లి బెల్లం చేసుకొన్నాడు. దానితో చక్కగా లడ్డూ, బూంది, జిలేబీలు, బెల్లం గారెలు చేసుకొని తింటున్నాడు.

ఎలుగుబంటి 'నిప్పు తొక్కిన కోతిలా' గెంతులేస్తూ వచ్చింది. 'అన్నం అడిగితే సున్నం పెట్టినట్లు' చేస్తావా? దమ్మిడీకి కొరగాని పచ్చిరొట్ట, మట్టిదుబ్బులూ ఇస్తావా? అంటూ మండిపడింది.



రైతు దాన్ని సమాధానపరుస్తూ, "నువ్వు చెప్పినట్టే కదా చేశాను! మళ్లీ నన్ను అంటావేం?" అంటూ ప్రశ్నించాడు. 'పొమ్మన లేక పొగపెట్టడం' అంటే ఇదే! నిన్ను నమ్ముకొని కూర్చుంటే 'కళ్లల్లో కారం కొడతావా'?" అంటూ కోపంతో 'మండిపడింది'.

"ఈసారి పంటలో ఏభాగం ఇవ్వాలో చెప్పు" అంటూ ఎలుగుబంటిని అడిగాడు రామయ్య. 'బలం ఉన్నవాడిదే రాజ్యం' అనుకున్నాను. వద్దు బాబోయ్ వద్దు! నీతో వ్యవసాయం అంటే 'కొరివితో తల గోక్కోవడమే" అంటూ ఎలుగుబంటి 'తోక ముడుచుకొని' అడవిలోకి వెళ్ళిపోయింది.

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) ఈ పాఠంలోని కథను మీ సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) ఈ కథకు ఇంకేం పేరు పెట్టవచ్చు? ఎందుకో చెప్పండి.

(ఇ) ఎలుగుబంటికి కష్టపడడమంటే ఇష్టంలేదు. ఎదుటివాళ్ళను అదిరించి, బెదిరించి పొందాలని చూస్తూంటుంది. ఎలుగుబంటి లాంటివాళ్ళు మన ఊళ్ళలో కూడా ఉంటారు. అలాంటి వారు ఏమేం చేస్తారు? వారికి మీరైతే ఎలా బుద్ధి చెబుతారు?

(ఈ) ఎలుగుబంటి, రైతు ఇద్దరిలో ఎవరిది న్యాయం? ఎందుకు? చర్చించండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం రాయడం



(అ) 'కడుపు మండింది' వంటి పదాలు పాఠంలో ఉన్నాయి. వీటిని జాతీయాలు అంటారు. వాటికింద గీత గీయండి.

(ఆ) పాఠంలోని సామెతలకింద గీత గీయండి.



(ఇ) కింది వాక్యాలను పాఠం ఆధారంగా సరిచేసి రాయండి.

1. రామయ్య మొదటి పంటగా చెరకు వేశాడు.
2. రామయ్య రెండో పంటగా వేరుశనగ వేశాడు.
3. రామయ్య మూడో పంటగా వరిపైరు వేశాడు.
4. పంటచేను ఎలుగుబంటికి చెందినది.
5. ఎలుగుబంటి చాలా తెలివైనది.


(ఈ) శరీర భాగాలకు సంబంధించిన పదబంధాలను పాఠం ఆధారంగా రాయండి.

ఉదా : కంటికి రెప్పలా, ----

(ఉ) 'రైతు తెలివి' పాఠం చదివి ఎలుగుబంటి స్వభావం గురించి, రైతు స్వభావం గురించి రాయండి.

| రైతు స్వభావం | ఎలుగుబంటి స్వభావం |
|---|---|
| ఉదా: కష్టజీవి | ఉదా: సోమరిపోతు |

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) 'రెక్కాడితే గాని డొక్కాడదు' అంటే ఏమిటి?

(ఆ) ఎలుగుబంటిని చూడగానే రామయ్యకు గుండెలో గుబులు మొదలైంది కదా! 'గుండెలో గుబులు' అనే దాన్ని ఇంకా ఏ ఏ సందర్భాల్లో వాడతారు? నీకు ఎప్పుడైనా అలా అన్పించిందా? ఎప్పుడు?

(ఇ) 'కడుపులో చల్ల కదలకపోవడం' అంటే ఏమిటి? దీన్ని ఏ ఏ సందర్భాల్లో వాడతారు?

© SCERT not to be republished

(ఈ) పాఠం ఆధారంగా రామయ్య గురించి అయిదు వాక్యాలు రాయండి.

(ఉ) ఈ కథలో ఎలుగుబంటి స్థానంలో కుందేలు ఉంటే ఏం జరిగి ఉండేది?

(ఊ) ఈసారి ఎలుగుబంటికి రైతు చేస్తున్న మోసం తెలిసింది. పంటమొత్తం నాదే! కేవలం పండించే బాధ్యత నీది అని ఎలుగుబంటి అన్నది. దానికీ రామయ్య ఒప్పుకున్నాడు. అయినా చివరకు రామయ్యకే మేలు జరిగింది! ఎలాగో ఆలోచించి రాయండి.

## IV పదజాలం

**(అ) కింది ఖాళీలలో సరైన జంతువులు, పక్షులను కనుక్కొని రాయండి.**



(హంస, మొసలి, ఎద్దు, నక్క, పిల్లి, లేడి, కోడి, కోతి)

ఉదా : ఈనగాచి నక్కల పాలు చేసినట్లు

1. కాలు గాలిన ______ లా తిరుగుతుండడం.
2. తినమరిగిన ______ ఇల్లెక్కి కూసిందట.
3. ______ కి కొబ్బరికాయ దొరికినట్లు.
4. ______ కి లేచిందే పరుగు.
5. ______ లా కన్నీళ్ళు.
6. గానుగ ______ పని చేయడం.
7. ఆదిలోనే ______ పాదు.

**(ఆ) రామయ్య వరితో అటుకులు, పేలాలు, బియ్యం వంటివి చేసుకున్నాడు కదా! వీటితో ఇంకా ఏమేమి తినుబండారాలు తయారవుతాయో కింది పట్టికలో రాయండి.**

| అటుకులతో చేసేవి | పేలాలతో చేసేవి | బియ్యంతో చేసేవి |
|---|---|---|
| | | |

**(ఈ) పట్టికలోని పదాలు కలిపితే కొన్ని జాతీయాలు ఏర్పడతాయి. వాటిని రాయండి.**

| | |
|---|---|
| పులిమీద | మండడం |
| ముక్కుపిండి | చెరగడం |
| తిక్క | పుట్ట |
| కడుపు | వసూలు |
| నిప్పులు | లేవడం |
| ఒంటికాలి మీద | పడడం |
| మండి | కుదరడం |

© SCERT not to be republished

(ఉ) **కింది కథను చదవండి. ఖాళీలలో సరైన జాతీయాలు/పదబంధాలను పూరించి కథను రాయండి.**

(స్వస్తి పలుకు, వెన్నతో పెట్టిన విద్య, అందెవేసిన చెయ్యి, పాపం పండింది, అరణ్యరోదన, పెడచెవిన పెట్టినందుకు, గుండెలు బాదుకొని, కాళ్ళా వేళ్ళా)

శంకరం దొంగతనం చేయడంలో __________ . కనిపించినది కాజేయడం __________ లా అబ్బింది. చివరికి __________ కటకటాల పాలయ్యాడు. తల్లిదండ్రులు, గురువుల మంచి మాటలు __________ తగిన శాస్తి అయిందని __________ బావురుమన్నాడు. దొంగతనాలకు __________తానని న్యాయాధికారుల ముందు ________ పడినా అతని గోల ________ అయింది.

## V సృజనాత్మకత

(అ) **పాఠం కథ చదివారు కదా! కథలో రైతుకు, ఎలుగుబంటికి మధ్య జరిగిన సంభాషణను రాయండి.**



ఎలుగు బంటి : ఈ చేను నాది. ఇక్కడ పంటలు వేయడానికి వీల్లేదు.


రైతు :

ఎలుగుబంటి :

రైతు :

(ఆ) **మీకు తెలిసిన జాతీయాలు, సామెతలు రాయండి. వీటిని ఉపయోగించి 'సింహం-కుందేలు' కథను రాసి ప్రదర్శించండి.**

## VI ప్రశంస




(అ) కథను బాగా చెప్పిన నీ స్నేహితుడిని నీవెలా అభినందిస్తావు?

(ఆ) అపాయంలో చక్కని ఉపాయాన్ని సూచించిన నీ మిత్రుణ్ణి నీవెలా ప్రశంసిస్తావు?

## VII భాషను గురించి తెలుసుకుందాం

(అ) **కింది పట్టిక ఆధారంగా వాక్యాలు రాయండి. అవి ఏకాలానికి చెందినవో రాయండి.**



| | | |
|---|---|---|
| శ్రీధర్ | బజారుకి | వెళ్ళింది |
| స్వాతి | సర్కస్‌కి | వెళ్ళాడు |
| అతడు | ఊరికి | వెళ్తాడు |
| ఆమె | సినిమాకి | వెళ్తుంది |
| అభిరాం | హైదరాబాద్ | వెళ్తున్నారు |
| సలీమా | బడికి | వెళ్తున్నది |

© SCERT not to be republished

(ఆ) ఇంతవరకు మీరు నేర్చుకున్న పాఠాలను చదవండి. ఆ పాఠాల్లో భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు సంబంధించిన వాక్యాలు ఉన్నాయా? వాటిని కింది పట్టికలో రాయండి.

| భూతకాలం | వర్తమాన కాలం | భవిష్యత్ కాలం |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |

© SCERT not to be republished

**ప్రాజెక్టు పని**



జంతువులు, పక్షులు, శరీర అవయవాలు, వస్తువులు, ఆహారం, సంప్రదాయాలనుంచి ఎన్నో జాతీయాలు/పదబంధాలు పుట్టుకు వచ్చాయి కదా! మీ ఇళ్ళల్లో నిత్యవ్యవహారంలో వాడే మాటలనుంచి లేదా బాలసాహిత్యంనుంచి సేకరించిన జాతీయలను, సామెతలను పట్టిక రూపంలో రాసి ప్రదర్శించండి.

**నేనివి చేయగలనా?**


1. రైతు తెలివి కథను కథను సొంతమాటల్లో చెప్పగలను. ఔను/కాదు
2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. పాత్రల స్వభావాలను గురించి రాయగలను ఔను/కాదు
3. రైతు తెలివి కథను సొంతమాటల్లో రాయగలను. ఔను/కాదు
4. జాతీయాలు, సామెతలతో కథను రాయగలను. ఔను/కాదు

రైతులు విద్యావంతులు కావాలి - ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలి.
- జ్యోతిరావుపులే

మూడో యూనిట్

# 11. మారిన అలవాటు


కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished


**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రాలు పరిశీలించండి. ఏ చిత్రం ఏ భావాన్ని తెలియజేస్తున్నది??
- చిత్రాల్లో రకరకాల భావాలున్నాయి కదా? ఎలా ఉంటే బాగుంటుంది? ఎందుకు?
- మీరు ఎలా ఉండాలని అనుకుంటున్నారు? ఎందుకు?




**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.




మనందరికీ కొన్ని మంచి అలవాట్లు ఉంటాయి. కొన్ని మంచి అలవాట్లు ఉండవు. మంచి అలవాట్లను అందరూ మెచ్చుకుంటారు. ఏదైనా చెడు అలవాటు ఉంటే అందరూ దాన్ని గురించే మాట్లాడతారు. ఈ చెడు అలవాట్లను మార్చుకోవడం కష్టమేమీ కాదు. ఈ కథను చదివి తెలుసుకోండి.



"అందరూ రండీ... ఆనందించండి."

"గోపిగారి ముఖంలో సీమటపాకాయ చిటపటలు. భూచక్రాల చరచరలు. చిచ్చుబుడ్ల తుస్... బుస్..లు" సమయం : ఎప్పుడైనా, స్థలం : 4వ తరగతి గది."

ఇలా నల్లబల్లపై ఎవరో రాశారు. తరగతిలోకి వెళుతున్న గోపి దాన్ని చూడలేదు. అతడెప్పుడూ అటూ ఇటూ చూడడు. తాను చేస్తున్న పనిపైననే ఏకాగ్రతగా ఉంటాడు.

"ఒరేయ్! గోపి ఆగరా ఆగు. ఇది చూశావా?" వెనుక నుండి వస్తున్న 'సత్తి' అన్నాడు. గోపీని పిలిచాడు. బోర్డుమీద రాసిన ప్రకటన చూపించాడు.

గోపి చూశాడు. విస్తుబోయాడు. ఉడికిపోయాడు. ఉన్నట్లుండి ఊగిపోయాడు. పళ్ళుకొరుక్కున్నాడు.

అసలు ఇంతకూ ఆ ప్రకటన ఎవరు రాశారు? గోపి అంటే గిట్టనివాళ్ళు రాశారు. గోపి అంటే అసలు ఎందుకు గిట్టదబ్బా?

© SCERT not to be republished

గోపి – అదే గోపాలరావు – మంచి అబ్బాయి. తరగతిలో అందరికంటే మిన్నగా ఉంటాడు.తరగతిలో ఏమిటిలెండి! అసలు ఆ బళ్ళోనే అతడు మిన్న అనుకోవచ్చు.

కథలు చెబుతాడు. కథలు రాస్తాడు. నాటకాలు వేస్తాడు,.. పాటలు పాడతాడు. ఆటలు కూడా బాగా ఆడతాడు.



అతని రచనలు పాఠశాల పత్రికలో వస్తాయి. ఒకటి రెండు కథలు ఓ పిల్లల పత్రికలో కూడా అచ్చయ్యాయిలెండి. అందుకని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దగ్గరినుంచి, అందరు ఉపాధ్యాయులూ... అతడంటే మక్కువ చూపుతారు.

అందుకనే మరి! గోపి అంటే కొందరికి గిట్టదు. ఆ గిట్టని వాళ్ళే అతన్ని ఉడికించాలని ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూ ఉంటారు.

అటువంటివాటిలో ఈ ప్రకటన ఒకటి.

గోపి ఎలా ఉడుక్కుంటాడు? అని మీక్కూడా తెలుసుకోవాలని ఉందికదా!

గోపి నాలుగవ తరగతి చదువుతున్నాడు. అతని మంచితనం గురించి పైన చెప్పుకున్నాం కదా! కాని అతనిలో కొన్ని దురలవాట్లు కూడ ఉన్నాయి.

ఇంతకీ ఆ 'దురలవాట్లు' ఏమిటనుకుంటున్నారు?

అదే ముఖం చిటపటలాడించడం, కళ్లు చికిలించటం, చెవులు రిక్కబొడవటం, అప్పుడప్పుడూ చిరచిరలాడటం ఇవండీ! అసలు ముఖ్యమైన దురలవాట్లు.

అప్పుడు చూడాలి అతని ముఖాన్ని! దానిలోని అందవికారాన్ని!

'ఈ పద్ధతి మంచిది కాదని' వాళ్ల నాన్న ఎన్నోసార్లు చెప్పాడు. వాళ్లమ్మకూడా గోపి ముఖాన్ని చిటపటలాడించినప్పుడల్లా... కేకలు వేస్తూనే ఉంటుంది.

"ఒరేయ్! ముఖం అలా పెట్టడం మంచిది కాదురా! కాస్త మంచిగా ఉంచుకోరా!" అని.


"ఆయ్" అంటాడు గోపి.

తన పద్ధతిమాత్రం మార్చుకోడు.

ఆ ప్రకటన చదివిన గోపి... గబగబా తరగతిలోకి వెళ్లాడు. ప్రకటన అక్షరాలు గుర్తుపట్టి అది ఎవరు రాశారో ఊహించుకున్నాడు.

"తప్పకుండా అది 'యాదిగాడు' – అంటే యాదగిరి పనే"! అని అనుకున్నాడు.

యాదగిరి తరగతిలో తన మిత్రబృందంతో మధ్యన కూర్చొని ఉన్నాడు. కూర్చున్నవాడల్లా గోపిని చూసి వెకిలిగా నవ్వాడు. చాటుగా వెక్కిరించాడు. అతనితోపాటు మిత్రబృందం కూడా వంతపాడింది.



అప్పటికి ఇంకా ఉపాధ్యాయుడు రాలేదు.

అందుకనే వాళ్లకు అప్పుడు 'ఆటవిడుపు' లాగ ఉంది. ఉన్నట్లుండి మిత్రబృందం గొల్లుమన్నది.

గోపి తమాయించుకున్నాడు. పుస్తకం ఒకటి తీసుకొని చదువుకోవడం మొదలుపెట్టాడు.

ఇంతలో ఉపాధ్యాయుడు వచ్చారు. గోపీని గమనించారు. ఏమైందని అడిగారు. గోపీ ఏమీ మాట్లాడలేదు. "గోపీ ఎవరో ఏదో అన్నారని అలా ఉడుక్కోవద్దు. నీలోని బలహీనతను ఆసరాగా చేసుకొని వాళ్ళు నిన్ను ఉడికించాలని చూస్తున్నారు కదా! నీవు నీ అలవాటును మార్చుకో. ఎవరైనా కావాలని మనని రెచ్చగొట్టినా మనం కోపం తెచ్చుకోగూడదు, ఉడుక్కోగూడదు" అని ఉపాధ్యాయుడు గోపీతో అనునయంగా చెప్పారు.

గోపీకి మాత్రం మనసంతా అదోలా ఉంది. బడి అయిపోయింది.

గోపీ నేరుగా ఇంటికి వెళ్లాడు.

ఆ రోజు అతని మనస్సంతా అదోలా ఉన్నది.

వాళ్ల అమ్మ "అరే గోపీ! దుకాణానికి పోయి..." అని అన్నదో లేదో... గోపి ఎగిరిపడ్డాడు. 'పెద్ద' కోపం వచ్చేసింది.

"ఎప్పుడూ నేనే తేవాలా? ఇప్పుడు నేను చదువుకోవాలి" అని అన్నాడు.

వాళ్ల అమ్మ ఊరుకోలేదు. కోపగించుకుంది.

గోపి అంతకంటే గొప్పగా కోపగించుకున్నాడు. చిటపటలాడాడు. చిరచిరలాడాడు. చెవులు రిక్కించాడు. కళ్ళు చికిలించాడు. ముఖం చిట్లించాడు.

అలా శివమెత్తిన గోపీకి బడి గోడమీది ప్రకటన జ్ఞాపకమొచ్చింది.

ఎదురుగా గోడమీద అద్దం ఉంటే దాని వైపు తన దృష్టి మళ్లించాడు. అద్దంలో అందంగా కనిపించాల్సిన తన ముఖం అందవికారంగా కనిపించింది.

కళ్ళు చికిలించుకుపోయి 'గుడ్లగూబ' కళ్ళలా తయారయ్యాయి. ముక్కు నిక్కబొడుచుకొని 'గద్దముక్కులా' తయారయ్యింది. తన ముఖం తనకే అసహ్యంగా కనిపించింది.

"అయ్యో!" తన ముఖం ఇలా ఉందేమిటి? అనుకున్నాడు. ముఖంలో నవ్వు తెప్పించుకుని అద్దంలో చూశాడు.

ఇప్పుడు అందంగా కనిపించింది.

'ఇందాకటి తన ముఖానికీ... ఇప్పటి తన ముఖానికీ ఎంత తేడా!' అనుకున్నాడు.

'ఇందుకేనన్న మాట! ముఖాన్ని చిటపటలాడించినప్పుడు అందరూ అనుకునేది' అని అనుకున్నాడు.

©SCERT not to be republished



'అందుకే గదా! యాదిగాడి ముఠా నన్ను అవహేళన చేసింది. బడి గోడమీద ప్రకటన రాసింది' అనుకున్నాడు గోపి. ఉపాధ్యాయుడి మాటలు కూడా జ్ఞాపకమొచ్చాయి. బాగా ఆలోచించాడు. ఇక నుండి ముఖాన్ని చిటపటలాడించగూడదు. ప్రశాంతంగా ఉండాలి. తనకున్న దురలవాటును మార్చుకోవాలని. నిర్ధారించుకున్నాడు.

అమ్మ చెప్పిన పని వెంటనే చేశాడు.

అతనిలోని మార్పుకి ఆమె ఆశ్చర్యపోయింది. మరుసటిరోజు గోపి బడికి వెళ్లాడు. చాలామంది తనవంక వింతగా చూడడం గమనించాడు. అతనికి ఉడుకుమోత్తనం వచ్చింది. తన అలవాటు అస్త్రం ప్రయోగించబోయాడు. దాంట్లోని వికృతాకారం, ఎగతాళి చేస్తున్నట్లు కనిపించింది. ఊరుకున్నాడు.

ప్రశాంతంగా చిరునవ్వులు కురిపిస్తూ ఉండిపోయాడు. ఆ రోజంతా అదే మాదిరిగా ప్రవర్తించాడు.

చాలామంది పిల్లలు 'గోపి' ముఖంలో సీమటపాకాయలకోసం ఆశగా చూశారు. వారికి నిరాశ ఎదురైంది.

గోపి మాత్రం ఆ 'దురలవాటు'ను మళ్లీ ప్రదర్శించలేదు. యాదగిరి బృందం ఎంత ప్రయత్నించినా వారి పప్పులు ఉడకలేదు. దాంతోవాళ్ళు తోకముడిచారు.

ఇప్పుడు గోపి హాయిగా ఉన్నాడు. ఆనాటి నుంచి గోపి తన దురలవాటును పూర్తిగా మార్చుకున్నాడు. ఇలా తన దురలవాటును మానుకోవడానికి కారణమైన యాదగిరి బృందానికి, ఉపాధ్యాయుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

– **"పూల పొట్లాలు"**, ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ సేకరణ



© SCERT not to be republished

## ఇవి చేయండి

### I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) 'ప్రకటన' అంటే ఏమిటి? మీరు ఎప్పుడైనా ప్రకటనలు విన్నారా? ఎక్కడ విన్నారు? ఏ ఏ ప్రకటనలు విన్నారో చెప్పండి.

(ఆ) గోపి గురించి వాళ్ళ మిత్రులు బోర్డు మీద రాశారు కదా! ఇలా రాయడం సరైనదేనా? మీ గురించి ఇలా ఎవరైనా రాస్తే మీకు ఎలా ఉంటుంది? ఇలాంటి వారు మీ తరగతిలో ఉంటే మీరు ఏం చేస్తారు?

(ఇ) ప్రకటన చూసిన గోపీకి కోపం వచ్చింది కదా! మీకు ఏ ఏ సందర్భాలలో కోపం వస్తుంది? అప్పుడు మీరేం చేస్తారు?

ఈ) మీ తరగతిలో ఎప్పుడూ నవ్వుతూ ఆనందంగా ఉండేవాళ్ళు ఎవరు? చిరచిరలాడుతూ కోపంతో ఉండేవాళ్ళు ఎవరు?

### II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



(అ) పాఠం చదవండి. గోపీకి సంబంధించిన పదాల కింద గీత గీయండి. ఆ పదాలతో వాక్యాలను రాయండి.

**ఉదా :** ఏకాగ్రత: గోపీకి తాను చేస్తున్న పనిపైనే ఏకాగ్రత ఉంటుంది.

(ఆ) గోపీతో ఉపాధ్యాయుడు ఏం చెప్పాడు? అది ఏ పేరాలో ఉంది. ఆ వాక్యాల కింద గీత గీయండి.

(ఇ) కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

1. గోపీకున్న మంచి అలవాట్లు ఏవి? దురలవాట్లు ఏవి?
2. గోపి అద్దంలో తన ముఖం చూసుకున్నప్పుడు ఎలా కనిపించింది?
3. గోపి తన దురలవాటు మానుకోవడానికి కారణం ఏమై ఉంటుంది?

(ఈ) ఊర్మిళ అనే అమ్మాయి, "మంచి అలవాట్లు" ఒక పట్టికలో రాసుకొని వచ్చింది. వాటిలో మీరేవేవి పాటిస్తున్నారో (✓) తో సూచించండి.

**మంచి అలవాట్లు :**



1. తరగతిలో అందరితో స్నేహంగా ఉండాలి. ( )
2. తెలిసిన విషయాలను ధైర్యంగా లేచి చెప్పాలి. ( )
3. తెలియని వాటి గురించి ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకోవాలి. ( )
4. ఇతరులపై చాడీలు చెప్పరాదు. నిజం చెప్పాలి. ( )
5. తరగతిని శుభ్రంగా ఉంచడంలో అలంకరించడంలో మనం కూడా పాల్గొనాలి. ( )
6. స్నేహితులకు అవసరమైన వస్తువులిచ్చి, తెలియనిది చెప్పి సహకరించాలి. ( )
7. ఇంటికి తిరిగివచ్చి తల్లిదండ్రులకు ఇంటి పనుల్లో సాయం చేయాలి. ( )
8. వ్యక్తిగత శుభ్రత పాటించాలి. ( )

© SCERT not to be republished

### III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) గోపి గురించి ఐదు వాక్యాలు రాయండి.

(ఆ) గోపీకున్నట్లు మనలో కూడ కొన్ని మంచి అలవాట్లు, చెడు అలవాట్లు ఉంటాయి. మీలో ఉన్న మంచి, చెడు అలవాట్లను రాయండి. చెడు అలవాట్లను మానేయడానికి మీరేం చేస్తారో రాయండి.

(ఇ) మీ ఇంట్లో వాళ్ళు, మీ తరగతిలోని వాళ్లు మీతో ఎలా ఉండాలని మీరు కోరుకుంటారు? వాళ్ళ పట్ల మీరు ఎలా ఉంటారు?

(ఈ) గోపి కథ చదివాక మీలో కలిగిన భావాలను రాయండి.

(ఉ) గోపి తరగతిలో కథలు చెబుతాడు, కథలు రాస్తాడు, నాటకాలు వేస్తాడు కదా! మరి మీరు ఇలాంటివి ఎప్పుడెప్పుడు ప్రదర్శించారు. ఏమేమి ప్రదర్శించారో రాయండి.

### IV పదజాలం



(అ) కింది పదాలను జతపరచండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.

| | | |
|---|---|---|
| కళ్లు | కొరుకు | ________________ |
| ముఖం | రిక్కించు | ________________ |
| చెవులు | చిట్లించు | ________________ |
| పళ్ళు | చికిలించు | ________________ |

(ఆ) మనుషుల ముఖంలో కనిపించే రకరకాల హావభావాలు కింది గళ్ళలో ఉన్నాయి. ఆ పదాలు వాటితో వాక్యాలు కూడా రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| కో | పం | చి | రా | కు |
| వి | శాం | తం | భ | యం |
| సు | ధ్యా | సి | గ్గు | ఏ |
| గు | నం | మౌ | నం | డు |
| న | వ్వు | బా | ధ | పు |

ఉదా : సిగ్గు

________________

________________

________________

________________

________________


### V సృజనాత్మకత



(అ) కోపంగా ఉండడం, సంతోషంగా ఉండడం, ఆలోచించడం, విసుగ్గా ఉండడం... వంటి భావాలు కనిపించేలా ముఖాల బొమ్మలు గీయండి. రంగులు వేయండి. ఒక్కొక్క చిత్రానికి నవ్వువచ్చేలా ఒక్కొక్క వాక్యం రాయండి.

(ఆ) గోపి తన దురలవాటును మార్చుకున్నాక బడిలో ఎలా ఉన్నాడో ఊహించి కథను పొడిగించి రాయండి.

### VI ప్రశంస




మీ స్నేహితునికి కోపం బాగా ఎక్కువ. దాన్ని తగ్గించుకోమని, కోపం వల్ల కలిగే నష్టాలు వివరిస్తూ మీరు మీ స్నేహితునికి ఏమి చెబుతారో తెల్పండి.

© SCERT not to be republished

## VII భాషను గురించి తెలుసుకుందాం

**(అ) కింది వాక్యాలను చదవండి. అవి ఏ కాలంలో ఉన్నాయో రాయండి.**



1. కీర్తన అన్నం తిన్నది. (                    )
2. భాస్కర్ బస్సులో ప్రయాణం చేస్తున్నాడు. (                    )
3. ఫాతీమా సాయంత్రం రైతు బజారుకు వెళ్తుంది. (                    )
4. పవిత్ర మొక్కలను నాటింది. (                    )
5. డేవిడ్ మన ఊరికి వస్తాడు. (                    )

**(ఆ) పై వాక్యాలలోని క్రియలను మిగతా కాలాలకు మార్చి రాయండి.**


**(ఇ) కింది క్రియా పదాలను చదవండి. వాటిని బట్టి కింది పట్టికలో వాక్యాలు రాయండి.**

(ఎగరడం, ఆడడం, పాడడం, వినడం, రాయడం, చదవడం)

| | భూతకాలం | వర్తమాన కాలం | భవిష్యత్ కాలం |
|---|---|---|---|
| 1. | ________ | ________ | ________ |
| 2. | ________ | ________ | ________ |
| 3. | ________ | ________ | ________ |
| 4. | ________ | ________ | ________ |
| 5. | ________ | ________ | ________ |
| 6. | ________ | ________ | ________ |

© SCERT not to be republished

### ప్రాజెక్టు పని



పాఠశాల గ్రంథాలయంలోని కథల పుస్తకాలు తీసుకోండి. గోపి లాంటి పిల్లలను గురించి ఒక కథ/గేయం/పాట చదవండి. దాన్ని గురించి మీ డైరీలో రాయండి. చదివి వినిపించండి.

### నేనివి చేయగలనా?

1. నాగురించి నేను సొంతమాటల్లో చెప్పగలను. ఔను/కాదు
2. పాఠాన్ని ధారాళంగా చదవగలను.
   నేను పాటించే మంచి అలవాట్లను గుర్తించగలను. ఔను/కాదు
3. గోపి గురించి, నాలోని మంచి గురించి, చెడు అలవాట్లను గురించి సొంతంగా రాయగలను. ఔను/కాదు
4. సూచించిన హావభావాలను గేయగలను. చిత్రాలను గురించి నవ్వు కలిగించేలా వాక్యాలు రాయగలను. ఔను/కాదు

వినయం, శీలం లేని విద్యావంతుడు మృగంకంటే ప్రమాదకరం, సమాజానికి శాపం.
**- డా॥ బి. ఆర్. అంబేద్కర్**

మూడో యూనిట్


# 12. ఎవరు బాధ్యులు?

కింది చిత్రం చూడండి.


© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రం చూడండి. ఏమేమి ఉన్నాయో చెప్పండి.
- వీటిని ఎక్కడ, ఎలా ఉపయోగించుకుంటారో చెప్పండి.
- ప్రస్తుతం వీటి స్థానంలో ఏ వస్తువులు ఉపయోగిస్తున్నారు?
- ఇవి ఏమని మాట్లాడుకుంటున్నాయో ఊహించి చెప్పండి.



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**రాత్రి వేళయింది. సముద్రంనుంచి చల్లగాలులు వీస్తున్నాయి. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. రోడ్డు పక్కన కరెంటు స్తంభం, పక్కనే పెద్ద చెట్టు. ఎక్కడో దూరంగా కుక్కల అరుపులు వినబడుతున్నాయి. నల్లని తారురోడ్డు విద్యుత్ దీపాల వెలుగులో మిలమిల మెరుస్తోంది. ఆ సమయంలో అవి ఏం మాట్లాడుకుంటున్నాయో పాఠం చదివి తెలుసుకోండి.**

విద్యుత్తు స్తంభం : హమ్మయ్యా! రాత్రయింది. మనం ఇంక తీరిగ్గా కబుర్లు చెప్పుకోవచ్చు.

చెట్టు : నిజమే! ఈమధ్య రాత్రుళ్ళు తగ్గిపోతున్నాయి. ఈ జనం ఎంతసేపటికీ ఇళ్లకు వెళ్లరు. రోడ్లు పట్టుకు తిరగడమే! చూడు... ఇప్పుడు రోడ్డు ఎంత స్పష్టంగా కనిపిస్తోందో.

రోడ్డు : ఔను, నా మొహాన్ని మీరు స్పష్టంగా చూడాలంటే అర్ధరాత్రి దాకా ఆగాలి మరి.

విద్యుత్తు స్తంభం : సముద్రపుగాలి తీవ్రత పెరుగుతూ ఉంది. వేగంగా గాలి వీస్తే నా బల్బు మాటి మాటికి ఆరిపోతూ, వెలుగుతూ ఉంటుంది. నాకేమో చాలా భయంగా అనిపిస్తుంది.


చెట్టు : నిజమే! ఆ రోజు గుర్తుందా నామీద పిడుగుపడింది. అబ్బా! అవి మెరుపులా ఇంకేమన్నానా! గుర్తొస్తే ఇప్పటికీ నా గుండె దడ ఆగదు. ఆ పిడుగు పడ్డ వైపు కొమ్మ అంతా కాలిపోయింది కదా! అప్పటి నుండి ఎప్పుడు వర్షమొచ్చినా నాకు ఆ రాత్రే జ్ఞాపకం వస్తుంది. ఒళ్లంతా భయంతో కంపించిపోతాను.

రోడ్డు : అన్ని వేళలా అలా జరగదు కదా! భయపడకు. నాకైతే వర్షం పడితే మహా ఆనందం. వర్షానికి నామీద ఉన్న చెత్తాచెదారం, దుమ్ముధూళి అంతా కొట్టుకుపోయి శుభ్రంగా తయారవుతాను.

చెట్టు : నాకూ వర్షం పడితే సంతోషమే. కానీ తుఫాను అంటేనే భయం. ఆ తుఫాను గాలికి ఎక్కడ నా కొమ్మలు విరిగిపోతాయో అనిపిస్తుంది.

విద్యుత్తు స్తంభం : నాకా భయంలేదు. నన్ను లోహంతో తయారుచేశారు కదా! అన్నిటికీ తట్టుకుని నిలబడగలను. వర్షానికి తడిసినా జబ్బుచేయడం వంటివి ఉండవు. కానీ అప్పుడప్పుడు అనిపిస్తుంది నాదీ ఒక జీవితమేనా అని!

చెట్టు : అదేమిటి అలా అంటావు? నువ్వు లేకపోతే ఈ వీధికి వెలుతురేది? నీకన్నా ముందు నేను ఇక్కడ పుట్టాను. అప్పట్లో ఈ రోడ్డు కూడా ఉండేది కాదు.



© SCERT not to be republished



ఆ పెద్ద పెద్ద భవనాలు, పోస్టర్లు అసలేలేవు. అదిగో ఆ సముద్రం, నేను... నాకు చాలా ఒంటరిగా అనిపించేది. ఎప్పుడైతే నిన్ను ఇక్కడ పాతారో నాకు తోడు దొరికిందనిపించింది. మెల్లగా ఈ రోడ్డు వచ్చింది. చాలారోజులు నువ్వు అసలు నాతో మాట్లాడేవాడివి కావు. నీవు అలా ఉంటే నీకు చాలా గర్వమేమో అనుకునేదాన్ని.

విద్యుత్తు స్తంభం : అవును. నాకు ఇది కొత్త వాతావరణం. కానీ అప్పుడు జరిగిన సంఘటన నాకు బాగా గుర్తుంది. ఆ రోజు తుఫాను వచ్చింది. నేను తుఫానుగాలికి నీమీద పడిపోయాను. నువ్వే లేకపోతే కింద పడిపోయేవాడిని. అప్పటికే నువ్వు బాగా దెబ్బతిన్నావు. అయినా నన్ను కాపాడావు. ఆ రోజునుంచే మన మధ్య స్నేహం కుదిరింది.

చెట్టు : ఔను! ఈ రోజు గాలి చూస్తే నాకు మళ్ళీ ఆనాటి రోజులే జ్ఞాపకం వస్తున్నాయి.

రోడ్డు : మీరు మరీ భయపడుతున్నారు. చెట్టు నేస్తమా! ఆ రోజు నువ్వు చాలా చిన్నగా ఉన్నావు. నీ కొమ్మలు సన్నగా ఉన్నాయి. అందుకే గాలికి విరిగిపోయాయి. కానీ నువ్వు ఇప్పుడు బాగా ఎదిగావు. నీ కొమ్మలన్నీ చాలా దృఢంగా ఉన్నాయి. భయపడాల్సిన పనిలేదు. స్తంభమా! నిన్ను కూడా ఇప్పుడు బలంగా పాతిపెట్టారు. ఊరికే అధైర్యపడకండి. అదిగో మన పిచ్చుకనేస్తం వచ్చింది. ఏం విశేషాలు చెబుతుందో చూద్దాం!


పిచ్చుక : ఏమిటి! వీళ్లకేదో ధైర్యం చెబుతున్నావు?


రోడ్డు : తుఫాను వస్తుందేమోనని వీళ్ల భయం.

పిచ్చుక : తుఫానుకన్నా మీరు భయపడాల్సిన విషయం వేరొకటి ఉంది. తెలుసా?

చెట్టు : ఏమిటిది? ఎలాగా?

పిచ్చుక : ఎలాగేమిటి? ఈ మనుషులవల్లే! మన స్తంభాన్ని చూడు ముందు లైటుతో ఠీవిగా నిలబడి ఉండేది. ఇప్పుడు చూడు కేబుల్ వైర్లు, డబ్బాలు, బ్యానర్లు, జెండాలు అన్నీ కట్టి ఎలా అందవిహీనంగా తయారుచేశారో!





© SCERT not to be republished

కరెంటు స్తంభం : ఔను నువ్వు చెప్పింది నిజమే!

నేను లేకపోతే ఒక నిమిషం గడవని ఈ మనుషులు నన్ను ఎంత నిర్లక్ష్యంగా వాడుతున్నారో చూడు. రాత్రి చీకటిగా ఉంటుంది, కాబట్టి నన్ను వాడుకున్నా అర్థం ఉంది. పగలు కూడా కరెంటు ఆపరు. నా దీపాలు వెలుగుతూనే ఉంటాయి. ఎంతో వృథా కదా! ఈ మధ్య విపరీతంగా కరెంటు కోతలతో నేను రాత్రి వెలగడమే కష్టమైపోతోంది.

చెట్టు : నిజమే! నేనూ వింటున్నాను. కదలలేని మనలను చూస్తే అందరికీ లోకువే! ఎవరికి ఇష్టం వచ్చినట్టు వాళ్లు మనతో ఆడుకుంటున్నారు. నన్నే చూడు నేను వీళ్లకు ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నాను. అయినా నా కొమ్మలు నరికేస్తారు. నన్ను పట్టించుకోరు. ఏ క్షణం నన్ను ఇక్కడినుండి లేపేస్తారో అని భయంగానే ఉంటుంది.

రోడ్డు : నువ్వు చెప్పింది నిజమే! ఈ మధ్య నన్ను వెడల్పు చేయడానికి మీ చెట్లను పూర్తిగా నరికేస్తున్నారు. మీకే కాదు, ఈ మనుషుల వల్ల నా కష్టాలు ఏమని చెప్పను. రోజూ వందలకొద్ది లారీలు, బస్సులు, కార్లు, స్కూటర్‌లు, బైకులు నామీద పోతున్నాయి నామీద అక్కడక్కడ గోతులు కూడా పడ్డాయి. వర్షం పడిందా ఆ గోతులు కనిపించవు. ఎవరు పడతారో తెలీదు.

ఈమధ్య ఇలాంటి ప్రమాదాలు ఎక్కువయ్యాయి. అదీగాక నామీదే ఉమ్మేయడాలు, చెత్తా చెదారం వేసి నన్ను ఎంతలా పాడుచేయాలో అంతలా పాడుచేస్తున్నారు. వీళ్లు వేసే చెత్తతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను. వీళ్లకి ఎప్పుడు బుద్ధి వస్తుందో.


పిచ్చుక : చూశారా! నేను ఇలా మొదలెట్టానో లేదో! ఈ మనుషులవల్ల మీరు ఎదుర్కొంటున్న కష్టాలన్నీ బయటపెట్టారు.

చెట్టు : మా కష్టాలు సరే! నువ్వు హాయిగానే ఉన్నావు కదా!

పిచ్చుక : నేను బాగానే ఉన్నట్టు కనబడుతున్నా. కానీ మా జాతి పూర్తిగా అంతమయ్యే పరిస్థితి వచ్చేసింది.

© SCERT not to be republished





కరెంటు స్తంభం : అదేమిటి? అలా అంటున్నావు?

పిచ్చుక : అవును. ఈ మధ్య చూశావా! నీకంటే కూడా ఎత్తుగా పెద్ద పెద్ద టవర్లు వచ్చాయి. అవి సెల్‌ఫోన్ టవర్లు, వాటి నుండి వచ్చే రేడియో తరంగాల వల్ల మా పక్షి జాతి ప్రాణాలకే ఆపద కల్గుతోంది. మనుషుల తెలివి తేటలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీనివల్ల వాళ్లకీ నష్టాలే! అయినా పట్టించుకోవడంలేదు. నాలాగే తేనెటీగల చిరునామా కూడా గల్లంతైపోతోంది. భవిష్యత్తులో తేనె రుచి ఎలా ఉంటుందో కూడా గ్రహించలేని పరిస్థితిలోకి మనిషి వెళ్లిపోతాడు. తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కోవడమంటే ఇదే! తేనెటీగలు అంతరిస్తే క్రమేపి సమస్త మానవ జాతి కూడా అంతరిస్తుందట.

కరెంటు స్తంభం : నిజమే! నేనూ వింటున్నాను. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉంటున్నది. ఇది ఇలాగే కొనసాగితే నిజంగానే అందరూ కష్టాలు ఎదుర్కోవలసిందే! నిజంగా మనిషి ఎంత తెలివైనవాడో, అంత మూర్ఖుడు కూడా కదా!

పిచ్చుక : సరిగా చెప్పావు.

చెట్టు : కానీ మనల్ని కాపాడేది కూడా వాళ్ళే!

కరెంటు స్తంభం : ఎలా?

చెట్టు! : రోజూ నా దగ్గరికొచ్చే పిల్లల్ని చూడండి. వాళ్ళే మన నేస్తాలు. వాళ్ళకు మన కష్టాలు చెప్పుకుందాం. నేటి పిల్లలే రేపటి పౌరులు కదా! మనల్ని కాపాడుకునే బాధ్యతను వాళ్ళు తప్పకుండా తీసుకుంటారు. నాకు ఆ నమ్మకం ఉంది. వాళ్ళు ప్రతి ఏటా వనమహోత్సవం నాడు మొక్కల్ని నాటుతారు తెలుసా!

పిచ్చుక : అవును నువ్వు చెప్పింది నిజమే! మన దగ్గరికి వచ్చే పిల్లలకు మన కష్టాలన్నీ చెప్పుకుందాం. దీనివల్ల వాళ్లకు కలిగే నష్టాలను కూడా చెబుదాం. పక్షులు జంతువులు, ప్రకృతి మీద ప్రేమ, దయ, జాలి కలిగి ఉండాలని చెబుదాం.

తెల్లారింది. ఆ రోజు సాయంత్రం పిల్లలందరూ చెట్టుకింద ఆడుకోవడానికి వచ్చారు. చెట్టు, రోడ్డు, స్తంభం, పిచ్చుక పిల్లలను చూడగానే సంబరపడిపోయాయి. ముందు పిచ్చుక గబగబా పిల్లల దగ్గరకు వెళ్లింది. మాట్లాడింది. పిల్లలతో చెట్టు, స్తంభం, రోడ్డు కూడా మాట్లాడాయి. అవన్నీ పిల్లలతో ఏమి మాట్లాడి ఉంటాయో ఊహించండి.



© SCERT not to be republished

# ఇవి చేయండి

**I వినడం, ఆలోచించి చెప్పడం**



(అ) తుఫాను వస్తుందేమో అని చెట్టు, స్తంభం భయపడ్డాయి కదా! ఎందుకు? తుఫాను వస్తే ఏం జరుగుతుంది?

(ఆ) మనుషులవల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని పాఠంలోని పాత్రలు చెప్పుకున్నాయి కదా! మనుషులవల్ల ఇంకా ఏవేవి ఇలాంటి బాధలు పడుతూ ఉంటాయో ఊహించి చెప్పండి.
ఉదా : చెరువు, పక్షులు.. జంతువులు, నది, వాగు.

(ఇ) తుఫాను వచ్చేముందు ప్రభుత్వం రేడియోలు, దూరదర్శన్, వార్తాపత్రికల ద్వారా సమాచారాన్ని అందిస్తుంది. తీసుకోవలసిన జాగ్రత్తలనూ తెలుపుతారు కదా! అవి ఏమైఉంటాయి?

(ఈ) వర్షం వస్తుందంటే చెట్టు, స్తంభం భయపడగా, రోడ్డు మాత్రం సంతోషపడింది. వర్షం వల్ల కొందరికి సంతోషం, కొందరికి భయం కలుగుతుంది. వర్షానికి ఎవరు సంతోషిస్తారో, ఎవరు భయపడతారో చెప్పండి.

(ఉ) పక్షులు, జంతువులు, చెట్లపైన ప్రేమ, దయ, జాలి కలిగి ఉండడం అంటే ఏమిటి? అవి కలిగి ఉన్నాయని ఎలా చెబుతారు? మీరు చూసిన కొన్ని సంఘటనలు చెప్పండి.

**II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం**



**(అ) పాఠం చదవండి, కథలోని పాత్రలు, అవి మనుషులతో పడుతున్న బాధలను కింది పట్టికలో రాయండి.**

| పాత్రపేరు | మనుషులతో పడే బాధలు |
|---|---|
| | |

**(ఆ) పాఠం చదవండి. కింది పట్టికలో సంఘటన, ఫలితాలను రాయండి.**

| సంఘటన | పర్యవసానం / ఫలితం |
|---|---|
| 1. తుఫాను | 1. |
| 2. | 2. కరెంటు వృథా అవుతుంది. |
| 3. రోడ్లను వెడల్పు చేయడం | 3. |
| 4. | 4. తేనెటీగలు, పిచ్చుకలు కనుమరుగైపోతాయి. |
| 5. రోడ్లపై గుంతలు పడ్డాయి | 5. |

**(ఇ) పాఠం చదవండి, కింది వాటికి జవాబులు రాయండి.**

1. వర్షం వస్తే చెట్టు భయపడటానికి కారణం ఏమిటి?
2. కరెంటు స్తంభం ఎందుకు అందవిహీనంగా తయారయ్యింది?
3. పిచ్చుకల జాతి పూర్తిగా అంతరించే పరిస్థితి ఎందుకు వచ్చింది?

© SCERT not to be republished

4. చెట్టు, కరెంటు స్తంభం, రోడ్డు, పిచ్చుక తమ కష్టాల గురించి పిల్లలతో ఎందుకు చెప్పాలనుకున్నాయి?

5. రోడ్డు తన బాధని ఏమని చెప్పుకుంది?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) మనం సాధారణంగా వీధి స్తంభాలకు పగటిపూట కూడా విద్యుత్తు దీపాలు వెలుగుతుండటం గమనిస్తాం కదా! దాంతో విద్యుత్తు వృథా అవుతుంది. ఇలా ఇంకా ఏ ఏ సందర్భాలలో విద్యుత్తు వృథా అవుతుందో రాయండి.

(ఆ) పిల్లలతో చెట్టు, రోడ్డు, స్తంభం, పిచ్చుక ఏమి మాట్లాడి ఉంటాయో ఊహించి కథను పొడిగించి రాయండి.

(ఇ) 'నేటి బాలలే రేపటి పౌరులు' అన్నారు కదా! మీకు ఏమి అర్థమయిందో రాయండి.

(ఈ) 'తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్నాడు' అనే వాక్యం ఉంది కదా! దీని అర్థం వివరించండి.

(ఉ) మీరు వనమహోత్సవాన్ని ఎలా నిర్వహిస్తారో రాయండి.

## IV పదజాలం




(అ) కింద పట్టికలో పాఠంలో వచ్చిన పాత్రల పేర్లు ఉన్నాయి. వాటితో సంబంధం ఉన్న పదాలను రాయండి. వాటిని ఉపయోగించి వాక్యాలు రాయండి.

| పాత్రపేరు | సంబంధం ఉన్న పదాలు |
|---|---|
| చెట్టు | |
| విద్యుత్తు స్తంభం | |
| రోడ్డు | |
| పిచ్చుక | |

(ఆ) విద్యుత్తు సహాయంతో పనిచేసే సాధనాల పేర్లు రాయండి.


## V సృజనాత్మకత కింది వాటిలో ఏదైనా ఒకటి చేయండి.



(అ) పాఠం ఆధారంగా చెట్లను పెంచడం, విద్యుత్తు పొదుపు, రోడ్డు, పక్షుల గురించి నినాదాలు రాయండి.

(ఆ) చెట్టు, రోడ్డు, స్తంభం తాము కదలలేమని బాధపడ్డాయి కదా! ఒకవేళ వాటికి కదలగలిగే శక్తి వస్తే అవి ఏమి చేస్తాయో నాటకీకరణ చేయండి.


## VI ప్రశంస :



మీరు పాఠశాలకు వెళ్తుండగా రోడ్డుపైనే కొందరు చెత్తపారబోయడం కనిపించింది. అది తప్పని అలా చేయడం సరికాదని మీరు వారికి చెప్పాలని అనుకున్నారు. వారికి వారు చేసేది తప్పని, తెలిపేలా పోస్టరు తయారు చేయండి. ప్రదర్శించండి.

© SCERT not to be republished

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) ఈ పాఠంలో (.) కు ముందున్న క్రియాపదాలు కొన్నింటిని రాయండి.**

ఉదా : కనిపిస్తోంది, కాలిపోయింది, పడిపోయాను ________ ________

ఈ పదాలు వాక్య భావాన్ని పూర్తయినట్లుగా తెలుపుతున్నాయి కదా!

ఇలా వాక్యభావాన్ని పూర్తిగా తెలిపే క్రియా పదాలను 'సమాపక క్రియలు' అంటారు.

**(ఆ) పై క్రియా పదాలను పూర్తికాని పనిని తెలిపే పదాలుగా రాయండి.**


పదాలు రాశారు కదా! వాక్యభావాన్ని అసంపూర్తిగా తెలిపే క్రియా పదాలను 'అసమాపకక్రియలు' అంటారు.

**(ఇ) 11వ పాఠంలోని క్రియాపదాలను రాయండి. వాటిని అసమాపక క్రియలుగా మార్చి రాయండి.**

| | పూర్తి అయిన పనిని తెలిపే పదాలు | పూర్తికాని పనిని తెలిపే పదాలు |
|---|---|---|
| ఉదా : | చూపించాడు | చూపించి |
| | చూడడు | చూసి |
| | రాశారు | రాసి |
| | ________ | ________ |
| | ________ | ________ |
| | ________ | ________ |

© SCERT not to be republished

### ప్రాజెక్టు పని



ప్రకృతికి సంబంధించిన అనగా చెట్లు, వర్షాలు, పక్షులు... ఇలాంటి వాటికి సంబంధించిన గేయాలు, పాటలు, పద్యాలు లేదా కథ... ఏదైనా ఒకదాన్ని గ్రంథాలయ పుస్తకాల నుండి సేకరించి చదవండి. దాన్ని చార్టుపై ప్రదర్శించండి. చదివించండి.

### నేనివి చేయగలనా?

1. ఈ పాఠంలోని పాత్రల గురించి సొంతమాటల్లో చెప్పగలను. అవును/కాదు
2. పాఠంలోని సంభాషణలను ధారాళంగా చదవగలను.సంఘటనలు, ఫలితాలను రాయగలను. అవును/కాదు
3. సామెతలను వివరించి సొంత మాటల్లో రాయగలను. అవును/కాదు
4. చెట్లను పెంచడం, విద్యుత్తు పొదుపు, రోడ్డు, పక్షులపై నినాదాలు రాయగలను. అవును/కాదు

ధనంవలనే నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడాలి.

మూడో యూనిట్

# 13. చక్రాలకుర్చీ

కింది చిత్రం చూడండి.



## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలో ఎలాంటివారు ఉన్నారు? వారు ఏం చేస్తున్నారు?
- వారు ఏ పోటీలో పాల్గొన్నారు?
- ఇలాంటి వ్యక్తులు పోటీల్లో పాల్గొనడం చూస్తుంటే మీకేమనిపిస్తుంది?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

నాలుగో యూనిట్

# 14. బొమ్మగుర్రం

కింది చిత్రం చూడండి.



### ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రం చూడండి. చిత్రంలో పిల్లలు ఏం చేస్తున్నారు?
- మీ దగ్గర ఏయే బొమ్మలు ఉన్నాయి? అవి ఎక్కడెక్కడ నుండి తెచ్చుకున్నారు?
- మీకు బొమ్మలంటే ఇష్టమేనా? ఎందుకు?
- మీరు తయారు చేసుకొన్న బొమ్మలను చూస్తే మీకు ఏమనిపిస్తుంది? వాటితో మీరు ఏమి చేస్తారు?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**మీరు రకరకాల బొమ్మలతో ఆడుకుంటారు కదా! కొన్ని బొమ్మలను కొంటారు. కొన్ని మీరే తయారు చేసుకుంటారు. అలాగే రామికి కూడా బొమ్మలంటే చాలా ఇష్టం. తానే ఒక బొమ్మను తయారుచేసుకున్నది. రామికి ఇష్టమైన ఆ బొమ్మే కావాలని ఇంకొక పాప అడిగింది. తర్వాత ఏమైందో పాఠం చదవండి.**

అనగనగా రామి అనే ఒక చిన్న బంజారా బాలిక ఉండేది. రామివాళ్ల అమ్మా, నాన్న రోడ్డు పక్కనే జీవించేవారు. వాళ్లకు ఒక లోహపు బండి ఉండేది. ఆ బండిమీద అందమైన బొమ్మలు పెట్టి అమ్మేవారు.

రామివాళ్ల నాన్న పొడుగ్గా ఉండేవాడు. ఆయనకి పెద్ద పెద్ద మీసాలుండేవి, తలపాగా చుట్టుకొనేవాడు. రామివాళ్ల అమ్మేమో ఎన్నో కుచ్చెళ్ళున్న పరికిణీ వేసుకునేది. గలగలలాడే ఎన్నో వెండి నగలు పెట్టుకునేది. ఆమె నడుస్తూంటే ఇవన్నీ సన్నగా శబ్దం చేసేవి, రామి కూడా, అమ్మలాగానే ఒక చిన్న పరికిణీ వేసుకునేది.

రామితండ్రి సుత్తులు, పట్టుకార్లలాంటి సామాన్లు తయారుచేసి అమ్మేవాడు. రామితల్లి బొమ్మ గుర్రాలు తయారుచేసేది. ఆమె వాటిని రంగురంగుల గుడ్డ ముక్కలతో కుట్టేది. చిన్న చిన్న అద్దాలు, రిబ్బన్లతో వాటిని అలంకరించేది. ఇలా తయారుచేసిన గుర్రాలను ఆమె రోడ్డు పక్కగా వరసగా ఉంచేది. ఆ దారి వెంట వెళ్లేవారంతా ఆ గుర్రాల్ని చూసేవారు. కొంతమంది తమ ఇళ్లలో అందంగా పెట్టుకోడానికీ, కొంతమంది తమ పిల్లలు ఆడుకోడానికీ వాటిని కొనేవారు.

రామికి ఆ బొమ్మగుర్రాలంటే ఎంతో ఇష్టం. మెరిసే పూసల కళ్ళూ, మొనతేలిన చెవులూ, వీపు మీద అందమైన జీన్లు ఉన్న ఆ గుర్రాలతో ఆడుకోవాలనిపించేది. కాని వాళ్లమ్మ ఆ గుర్రాల్ని ముట్టుకోనిచ్చేది కాదు. "అవి నువ్వు ఆడుకునేందుకు కాదు" అనేది. "నువ్వు వాటితో ఆడితే అవి మాసిపోతాయి. అవి మాస్తే నేను వాటిని అమ్మలేను. అమ్మకపోతే మనకి డబ్బులు రావు. మరి మనం తినడానికి బియ్యం, పప్పు,



© SCERT not to be republished

కూరలు ఎలా కొనుక్కుంటాం చెప్పు" అనేది. ఒక బొంగరం, ఒక గుడ్డబొమ్మ తప్ప రామిదగ్గర బొమ్మలేం ఉండేవి కావు. ఈ గుర్రాలతో ఆడుకోవాలని ఆమెకుండేది.

కూతురు మనసెరిగిన తల్లి "కావాలంటే నువ్వే ఒక చిన్న బొమ్మగుర్రం చేసుకోవచ్చు" అంది. అమ్మ అనడమే తడవుగా రామి ఎగిరి గంతేసి పని మొదలు పెట్టింది. రామి తయారుచేసిన గుర్రం కాళ్ళు వంకరగానూ, తల ఒక పక్కకి వంగిపోయి మొహంకూడా అదో రకంగానూ వచ్చాయి.

అయితేనేం? రామికి ఆ గుర్రమంటే ప్రాణం. తనే చేసుకున్న ఈ బొమ్మగుర్రం పూర్తిగా తన సొంతం! రామికి ఆ గుర్రంతోనే ప్రపంచం. రామి ఆ బొమ్మ గుర్రాన్ని దౌడు తీయించేది. తను గుర్రం మీద స్వారీ చేస్తున్నట్లు ఊహించుకొనేది. దొంగల్ని తరుముతున్నట్లూ... పందేల్లో పాల్గొన్నట్లూ... ఊహించుకునేది.

వాళ్ళమ్మ చేసిన గుర్రాలన్నీ రోడ్డు పక్కగా ఒక వరసలో పెట్టి ఉంచి రామి తన గుర్రాన్ని కూడా వాటి పక్కన నుంచో పెట్టేది "వీళ్ళంతా నీకు అన్నయ్యలు, వాళ్ళతో కబుర్లు చెప్పు" అని ఆడుకొనేది.

ఒకరోజు రోజులాగే రామి బొమ్మ గుర్రంతో ఆడుకొంటూన్నది. ఇంతలో అటుగా ఒకామె వచ్చింది. ఆమెతో ఒక చిన్న పిల్ల కూడా ఉంది. రామి అంతే ఉన్న ఆ పాపచేతిలో ఒక బొమ్మ ఉంది.

రామి ఆ బొమ్మ వంక ఆశగా చూసింది. అది ఎంత బాగుందో! దానికి మెరిసే జుట్టుంది. మూసి తెరిచే కళ్ళున్నాయి. ముద్దొచ్చే బూట్లూ, అందమైన గౌనూ వేసుకొంది.

"అమ్మా! నాకు గుర్రం కావాలి." రామికి ఆ పాప అనడం వినిపించింది.

"అలాగే, కొందాం," అంది వాళ్ళమ్మ. "ఈ గుర్రాల వెల ఎంత?" అడిగింది.

"ఒక్కోటీ వందేసి రూపాయలండి" రామి తల్లి చెప్పింది.

"అయితే ఒకటి ఇవ్వు", ఆమె అంది. రామితల్లి ఒక మంచి గుర్రాన్ని పైకి తీసింది.

"అదికాదు," ఆ పాప తల అడ్డంగా తిప్పింది. "నాకు ఆ చిన్న గుర్రం కావాలి" అని రామి గుర్రాన్ని చూపించింది.

"అది అమ్మకానికి కాదమ్మా", రామితల్లి చెప్పింది.

"అది సరిగ్గా రాలేదు. మిగతా వాటిల్లోంచి నీకేది కావాలంటే అది తీసుకో ఇది బాగుంది కదూ!" ఒకదాన్ని చూపింది.

"ఊహు", పాప ఒప్పుకోలేదు. "ఇదేం బాగాలేదు. నాకదే కావాలి!"

ఆ చిన్న గుర్రమే ఎందుకు నచ్చిందో వాళ్ళమ్మకి అర్థం కాలేదు.

"నాకదే కావాలి. దాని మొహం బాగుంది", పాప పేచీ పెట్టింది.



© SCERT not to be republished


"దాని తల వంకరగా ఉందమ్మా", రామితల్లి నచ్చచెప్పింది.

"వీటిలోంచి ఇంకేదన్న తీసుకో".

"నాకదే కావాలి, ఇంకేదీ వద్దూ!" పాప ఏడుపు మొదలుపెట్టింది.

"నీకు ఎక్కువ డబ్బు ఇస్తాను," ఆమె తల్లి అంది. "మా పాపకి ఆ బుల్లి గుర్రాన్నే ఇవ్వు".

"సరే అయితే" రామితల్లి ఒప్పేసుకుంది. "నీక్కావాలంటే ఇంకోటి చేసుకుందువులే. కాదంటే నేను చేసిన వాటిలోంచి ఒకటి తీసుకో" రామి చెవిలో నెమ్మదిగా చెప్పింది.



© SCERT not to be republished

ఇదిగో! అంటూ, రామి గుర్రాన్ని ఆ పాపకిచ్చేసింది. రామి కళ్లల్లో నీరు చిమ్మింది. అమ్మ చేసిన పెద్ద గుర్రం ఆమెకి అక్కర్లేదు. తను చేసుకున్న చిన్న గుర్రమే తనకు కావాలి. "నీ దగ్గరంత మంచి బొమ్మ ఉండగా నా గుర్రమే నీకు కావల్సి వచ్చిందా!" అని ఆ పాపని అడగాలనిపించింది. కానీ పైకి ఏమీ అనలేదు. తల అటు తిప్పేసుకుని కళ్ళు తుడుచుకుంది.

ఇంతలో వెనకనించి తన చేతిలో ఏదో పెట్టినట్టు అన్పించి కిందికి చూసింది. అది బొమ్మ – అందమైన బొమ్మ! "ఏడవకు", అందా పాప! "నువ్వు నా బొమ్మ తీసుకో", రామి వైపు చిరునవ్వుతో చూస్తూ, నెమ్మదిగా చెప్పింది. "నిజంగా నీ గుర్రం బాగుంది" అని చెప్పింది.

రామి తన చేతిలో ఉన్న బొమ్మవైపు తదేకంగా చూసింది, బొమ్మ బాగుంది. "గుర్రం బొమ్మ ఎప్పుడైనా చేసుకోవచ్చు". కన్నీళ్ళు శుభ్రంగా తుడిచేసుకుని పాపవైపు చూసి రామి కూడా నవ్వింది. టాటా చెప్పింది. ఇద్దరూ సంతోషంగా ఉన్నారు.

**మూలం– చిల్డ్రన్ బుక్ ట్రస్ట్**

**దీపా అగర్వాల్**

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) ఈ కథను మీ సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) రామి బొమ్మగుర్రాన్ని తయారుచేసింది కదా! మీరు ఏ ఏ బొమ్మలను తయారు చేయగలరో చెప్పండి.

(ఇ) ఈ కథలో మీకు నచ్చిన పాత్ర ఏది? ఎందుకు?

(ఈ) రామి వాళ్ళమ్మ చేసిన గుర్రాలతో రామి తన చిన్న గుర్రాన్ని ఉంచి "వీళ్ళంతా నీకు అన్నయ్యలు వాళ్లతో కబుర్లు చెప్పు" అంది కదా! ఆ గుర్రం ఏమి కబుర్లు చెప్పిందో ఊహించి చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



(అ) పాఠం చదవండి, కింది వాక్యాలకు కారణాలు చెప్పండి.



1. రామికి దిగులు కలిగింది.
2. రామివాళ్ళు రోడ్డుపక్కనే జీవించేవారు.
3. రామితల్లి బొమ్మగుర్రాలు తయారుచేసేది.
4. రామికి ఆమె గుర్రమంటే ప్రాణం.
5. రామి ఆ బొమ్మ వంక ఆశగా చూసింది.

(ఆ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. రామి తన గుర్రాన్ని పట్టుకొని ఏమేం ఊహించేది?
2. రామివాళ్ళ అమ్మ గుర్రంబొమ్మల్ని ఎందుకు ముట్టుకోనిచ్చేది కాదు?
3. పాపచేతిలో బొమ్మ ఎలా ఉంది?
4. బొమ్మగుర్రాల్ని రోడ్డుపక్కనే ఎందుకు అమ్ముతున్నారు?
5. గుర్రంబొమ్మ ఎప్పుడైనా చేసుకోవచ్చని రామి ఎందుకు అనుకుంది?

(ఇ) పాఠం చదవండి. ఈ కింది వాక్యాలు వరసక్రమంలో రాయండి.

1. పాప తన బొమ్మను రామి చేతిలో ఉంచింది.
2. గుర్రం బొమ్మ తానే తయారుచేసుకుంది.
3. పాప, రామి చేసిన బొమ్మ కావాలని పట్టుపట్టింది.
4. రామి గుర్రంబొమ్మ పాపకు ఇచ్చేసింది.

©SCERT not to be republished

5. తల్లి, చిన్నపాప గుర్రంబొమ్మలు కొనడానికి వచ్చారు.

6. రామి గుర్రంబొమ్మలతో ఆడుకోవాలనుకుంది.

7. రామివాళ్ళ అమ్మా నాన్నా రోడ్డు పక్కన బొమ్మలు అమ్మేవారు.

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) రామికి బొమ్మగుర్రాలంటే ఇష్టం కదా! బొమ్మల్లో మీకు ఇష్టమైన బొమ్మ ఏది? దాన్ని గురించి రాయండి.

(ఆ) రామి తన గుర్రం బొమ్మ మీద కూర్చుని స్వారీ చేస్తున్నట్లు, దొంగల్ని తరిమినట్లు ఊహించేది. ఇంకా ఏమేమి ఊహించి ఉంటుందో మీ సొంతమాటల్లో రాయండి.

(ఇ) రామి తన గుర్రం బొమ్మకు అలంకరణ చేసింది కదా! నీకిష్టమైన బొమ్మకు నీవు ఏ విధంగా అలంకరిస్తావు?

(ఈ) రామివాళ్ళ అమ్మ, నాన్న ఎలా ఉంటారో తెలుసుకొన్నారు కదా! మీరు మీ అమ్మా నాన్న ఎలా ఉంటారో వర్ణించి రాయండి.

(ఉ) రామి గురించి సొంత మాటల్లో రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం



(అ) పాఠంలో మీరు నేర్చుకున్న కొత్త పదాలు రాయండి. ఈ పదాలను ఏ ఏ సందర్భాల్లో ఉపయోగిస్తారో వాక్యాలుగా రాయండి.

(ఆ) బొమ్మలు తయారు చేయడానికి ఉపయోగించే పదార్థాలు గళ్ళల్లో ఉన్నాయి. వాటిని వెతికి పట్టుకొని రాయండి.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | సి | బు | ర | ద | కొ | య్య |
| ట్టి | రా | గి | తో | లు | ల | త |
| పిం | గా | ణి | కం | చు | క్క | గ |
| డీ | మై | దా | చె | క్క | ద్వా | రం |
| గొ | నం | కా | బం | లు | లెం | ప్లా |
| డు | ది | గి | గా | జు | డి | స్టి |
| గు | డ్డ | తు | రం | నా | వ | క్ |

_______________ _______________

_______________ _______________

_______________ _______________

_______________ _______________

_______________ _______________

_______________ _______________

(ఇ) రామివాళ్ళ నాన్న సుత్తి, పట్టుకార్లను; వాళ్ళ అమ్మ బొమ్మలను తయారుచేసి అమ్మేవారు కదా! మీ స్నేహితుల అమ్మానాన్నలు జీవనాధారంకోసం ఏమేమి పనులు చేస్తారో రాయండి.


| మీ స్నేహితుల తల్లిదండ్రుల పేర్లు | జీవనాధారంకోసం చేసే పనులు |
|---|---|
| | |

(ఈ) కింది పదాలు ఆధారంగా అర్థవంతమైన వాక్యాలు తయారు చేయండి.

| | | | | |
|---|---|---|---|---|
| తనకు | చిన్న | దొడ్డు | వాళ్ళ | రామి |
| పొడుగ్గా | నాన్న | రామి | గుర్రాన్ని | ఉన్నారు |
| కావాలి | సంతోషంగా | గుర్రమే | ఇద్దరు | తీయించేది |
| ఉండేవాడు | గుర్రం | ప్రాణం | అంటే | రామికి |

© SCERT not to be republished

V




**సృజనాత్మకత : కింది వాటిలో ఏదైనా ఒకటి చేయండి.**

(అ) బంకమట్టితో మీకు నచ్చిన బొమ్మను అందంగా తయారుచేయండి. ఎలా తయారు చేశారో చెప్పండి.

(ఆ) పాఠం ఆధారంగా రామి వాళ్ళ అమ్మ, నాన్న బొమ్మలు గీయండి. రంగులు వేయండి. వారి గురించి రాయండి.

(ఇ) మీరు తయారుచేసిన బొమ్మ మీతో మాట్లాడితే మీరిద్దరూ ఏం కబుర్లు చెప్పుకుంటారో ఊహించి రాయండి.

VI




**ప్రశంస**

(అ) నీకు బార్బీ బొమ్మంటే చాలా ఇష్టం. ఆ బొమ్మతో ఆడుకోవాలని ఉంది. మీ ఎదురింట్లో ఉన్న సీత దగ్గర ఆ బొమ్మ ఉంది. నిన్ను ఆ బొమ్మతో ఆడడానికి రమ్మంది. నీకు చాలా సంతోషం కలిగింది. సీతకు నీవు ఏమని కృతజ్ఞతలు చెబుతావు.

(ఆ) మీరు వేటితో ఆడుకుంటారు? వాటితో ఆడుకోవడానికి ఇంకా ఎవరిని పిలుస్తారు? ఇలా ఇతరులతో కలిసి ఆడుకుంటే ఎలా ఉంటుందో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం

**(అ) కింది పదాలలో రెండింటిని ఉపయోగించి వాక్యాలు రాయండి.**



| అసమాపక క్రియలు | సమాపక క్రియలు |
|---|---|
| తిని | నవ్వాడు |
| వెళ్ళి | చదువుతున్నాడు |
| వచ్చి | వెళ్ళాడు |
| చూసి | పట్టుకొన్నాడు |
| ఎగిరి | చూస్తున్నాడు |
| పరుగెత్తి | ఆడుతున్నాడు |
| రాసి | గీశాడు |

**ఉదా :** శ్రీరాం కవిత రాసి, చదివాడు.


**(ఆ) మీరు రోజూ రకరకాల పనులు చేస్తుంటారు కదా! పనులను తెలియజేసే క్రియాపదాలు రాయండి వాటికి అసమాపక క్రియాపదాలు రాసి వాటితో వాక్యాలు రాయండి.**

**ఉదా :** నిద్రలేచాను – నిద్రలేచి

నేను ఉదయాన్నే నిద్రలేచి, ముఖం కడిగాను.

©SCERT not to be republished

### ప్రాజెక్టు పని



రామివాళ్ల అమ్మ బొమ్మలు చేసి అమ్ముతుంది కదా! అట్లాగే మీ ఊరిలో బొమ్మలు/వస్తువులు తయారుచేసేవారు ఉంటారు కదా! వారు ఏమేం తయారుచేస్తారో తెలుసుకొని రాయండి. ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | రామికథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | బొమ్మగుర్రం కథను ధారాళంగా చదవగలను. | |
| | ఇచ్చిన వాక్యాలకు కారణాలు చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | రామి గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | మట్టితో బొమ్మలు చేసి, ఎలా తయారుచేశానో చెప్పగలను. | ఔను/కాదు |
| | సూచనల ఆధారంగా బొమ్మలు గీయగలను. వాటి గురించి చెప్పగలను. | |

సొంత లాభం కొంతమానుకు పొరుగువారికి తోడ్పడవోయ్.

**- గురజాడ**

నాలుగో యూనిట్

# 15. పల్లెచిత్రం

కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలో ఏం జరుగుతోంది? చిత్రాన్ని ఎక్కడ గీస్తున్నారు? ఎందుకు?
- చిత్రం గీస్తున్న వ్యక్తి ఏ ఏ వస్తువులను ఉపయోగించి చిత్రాలు గీస్తున్నాడు?
- రకరకాల, రంగు రంగుల చిత్రాలను చూసినపుడు మీకు ఎలా అనిపిస్తుంది? ఎందుకు?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**ఆసక్తి, కుతూహలం ఉంటే ఏదైనా నేర్చుకోవచ్చు. గిరిజన బాలుడైన సక్రూకు దేనిపట్ల ఆసక్తి కలిగిందో, దాని వల్ల ఎలా గుర్తింపు పొందాడో పాఠం చదివి తెలుసుకోండి.**

సక్రూకు ఎనిమిదేండ్లు ఉంటాయి. వాళ్ళు ఉండేది కొండప్రాంతంలోని ఒక గిరిజన ప్రాంతం. సక్రూ వాళ్ళ అమ్మానాన్నా అడవిలో దొరికే పండ్లు, కాయలు, చింతపండు, విస్తరాకులు, కుంకుడు కాయలు ఏరుకొచ్చేవారు. వాటిని ఊరి సంతలో అమ్ముకునేవారు. సక్రూ కూడా అప్పుడప్పుడూ సరదాగా వాళ్ళ అమ్మానాన్నలతో బాటు అడవిలోకి వెళ్ళేవాడు.

అడవిలోకి వెళుతున్నప్పుడు దారిపొడవునా పెద్ద పెద్ద చెట్లు, తీగలు, పొదలు, రాళ్ళు కనిపించేవి. వాటిని ఆశ్చర్యంగా, ఆనందంగా చూసేవాడు సక్రూ. అలా నడిచి వెళుతుంటే అడవంతా తనను పలకరిస్తున్నట్లు అనిపించేది. పక్షుల అరుపులు, పిట్టల కూతలు, కప్పల బెకబెకలు, కీచురాళ్ళ శబ్దాలు వింతగొల్పేవి. కోయిల కూ... అని కూస్తుంటే సక్రూ కూడా కూ... కూ... అని బదులు పలికేవాడు. కోకిల మళ్ళీ కూస్తే అందుకు రెట్టింపు గొంతుతో సక్రూ బదులిచ్చేవాడు. ఇలా అడవంతా తిరుగుతూ సక్రూ ఆనందించేవాడు.

ఒకరోజు సక్రూ, వాళ్ల అమ్మానాన్న అడవిలో వెళుతున్నారు. పెద్ద వర్షం మొదలైంది. సక్రూ, వాళ్ళమ్మ, నాన్న అందరూ ఒక కొండ దగ్గరకు పరుగెత్తారు. కొండ దగ్గర ఒక గుహ ఉంది. అందరూ ఆ గుహలోకి వెళ్ళారు. సక్రూ ఆ గుహను ఎప్పుడూ చూడలేదు. గుహలో గోడలమీద రకరకాల బొమ్మలు గీసి ఉన్నాయి. అందులో నాట్యం చేస్తున్న స్త్రీల బొమ్మలు, జంతువులను వేటాడుతున్న మనుషుల బొమ్మలు, పిల్లలు, పెద్దలు కలిసి కూర్చున్న బొమ్మలు ఇలా చాలా చిత్రాలు గోడలమీద వేసి ఉన్నాయి. సక్రూ, ఆ చిత్రాలవైపు అలా కళ్ళప్పగించి చూస్తుండి పోయాడు. సక్రూకు ఆ చిత్రాలు ఆశ్చర్యం కలిగించాయి. ఆసక్తిగా కూడా



అనిపించాయి. ప్రతి చిత్రాన్ని పరిశీలనగా చూశాడు. ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్లు వింతగా చూస్తున్నాడు.

“ఏమిరా అట్టా సూత్తున్నావు” అని సక్రూను అడిగింది వాళ్ళమ్మ. “అమ్మా! ఈ బొమ్మలు ఎవరు గీశారు? భలేగా ఉన్నాయే” అన్నాడు. “ఏమోరా! చాలాకాలం కిందటి నుండే ఉన్నాయి.” అంది అమ్మ.

“వీటిని ఎలా గీసుంటారే!” అని అడిగాడు సక్రు. “బొగ్గుతోనో, సుద్దతోనో గీసుంటారు” అంది అమ్మ. ఇంతలో వర్షం తగ్గింది. సక్రూ వాళ్లు ఇంటికి తిరిగి వచ్చారు.

సక్రూ ఆ రాత్రి వేడి వేడి బువ్వ తిని పడుకున్నాడు. పడుకున్నాడన్న మాటేగాని సక్రూకు ఉదయం తాను చూసిన బొమ్మలే కళ్ళముందు కదలాడుతున్నాయి. నిద్రపట్టడం లేదు. వెంటనే లేచి కూర్చున్నాడు. పొయ్యి పక్కన ఉన్న బొగ్గు ముక్కను తీసుకున్నాడు. గుహలో తాను చూసిన బొమ్మలను గుర్తు చేసుకొన్నాడు. నేలమీద బొమ్మలు గీయసాగాడు. కన్ను, ముక్కు సరిగా గీయలేదనిపించింది. చెరిపేశాడు. మళ్ళీ గీశాడు. తాను గుహలో చూసిన బొమ్మలన్నీ గీశాడు. అవి చూసుకున్న సక్రూకు చాలా ఆనందం కలిగింది. పడుకొని హాయిగా నిద్రపోయాడు. పొద్దున్నే లేచిన సక్రూ వాళ్ల అమ్మ నేలమీద ఉన్న బొమ్మలను చూసి ఆశ్చర్యపోయింది. సక్రూను లేపింది. వాళ్ళ నాన్నను పిలిచింది. “చూడయ్యా! మనోడు గుహలో ఉన్న బొమ్మలన్నీ ఎట్టా గీశాడో చూడు” అంది. “అవునే సిత్రంగా ఉంది. ఎంత బాగా గీశాడో! ఇట్టా సూశాడో లేదో అట్టా పట్టేశాడు.” నిజంగా బాగా వేశావురా! అని పొగిడాడు సక్రూ వాళ్ల నాన్న. ‘నా బాబే! నా బంగారు కొండా! నా దిష్టే తగిలేలా ఉందిరా’ అంటూ సంబరపడిపోయింది తల్లి. సక్రూకు చాలా గర్వంగా, సంతోషంగా అనిపించింది.

“ఇక ఆరోజు మొదలు సక్రూ అడవిలో తాను చూసిన చెట్లు, లతలు, కొండలు, వాగులు, జలపాతాలు గీయసాగాడు. పక్షులు, జంతువులు, ఇంట్లో వస్తువులు ఇలా వేటిని చూస్తేవాటిని చిత్రాలుగా గీసేవాడు. ఇవన్నీ కూడా సుద్దముక్కతోనో, బొగ్గు ముక్కతోనో లేకపోతే మట్టిలో పుల్లతోనో గీసేవాడు. సక్రూ నేలమీదే కాదు, ఇంటి గోడలపైనా గీసేవాడు.




“కొన్ని రోజుల తర్వాత ఈ చిత్రాలకు రంగులు వేస్తే ఎలా ఉంటుందా?” అని ఆలోచించాడు. ఆలోచన వచ్చిందే తడవు ఎర్రమట్టి, పసుపు, ముగ్గు, కుంకుమ వీటితో రంగులు అద్దాడు. ఆ చిత్రాలు ఇంకా కళకళలాడి పోయాయి. రంగులకు కూడా రకరకాల ఆకులు, కాయలు, దుంపలు వాడేవాడు. స్నేహితులంతా చుట్టూచేరి సక్రూ గీసిన బొమ్మలను ఆసక్తిగా చూసేవారు.

ఆ ఊరికి వనజ టీచరు కొత్తగా వచ్చింది. ఆమె ఒకరోజు సక్రూ ఇంటికి వచ్చింది. సక్రూ గీసిన బొమ్మలను చూసి ఆశ్చర్యపోయింది. ‘అరే! నువ్వు ఇంత బాగా బొమ్మలు గీశావు! ఎక్కడ

© SCERT not to be republished

నేర్చుకున్నావు?" అని అడిగింది. సక్రూ నవ్వుతూ "ఎక్కడా నేర్చుకోలేదు. నేనే చూసి వేస్తున్నాను. అదిగో అక్కడ దూరంగా కొండ దగ్గర పెద్ద గుహ ఉంది. ఆ గుహలో గోడలమీద బొమ్మలు చూశాను. నాకూ బొమ్మలు గీయాలనిపించింది. ఇదిగో! ఇలా చూసినవన్నీ గీస్తున్నా టీచర్!" అన్నాడు.




"నువ్వు చాలా బాగా గీస్తున్నావ్. నాతో కూడా రా! నా దగ్గర తెల్లకాగితాలు, చార్టులు, పెన్సిల్, రబ్బరు, రంగుపెన్సిళ్ళు ఉన్నాయి. ఇస్తాను. వాటితో బొమ్మలు వేయడం సాధన చెయ్యి. నువ్వు గొప్ప చిత్రకారుడివి అవుతావు" అంది టీచరు.

"అలాగే టీచర్!" సక్రూ కళ్లు ఆనందంతో మిలమిల మెరిశాయి. టీచరుతో వెళ్లి సక్రూ చిత్రాలు వేయడానికి కావలసినవన్నీ తెచ్చుకున్నాడు.

ఆ రోజు నుండి సక్రూ జీవితమే మారిపోయింది. సక్రూ దృష్టి మనుషుల మీదకు మళ్లింది. మనిషి ముఖకవళికలు గమనించేవాడు, గీసేవాడు. క్రమంగా అతనికి మనుషుల రూపురేఖలు అందరివీ ఒకేలా ఉండవనే విషయం అర్థమయింది. మెల్లగా మనిషి ముఖాలు వివిధ హావభావాలు అంటే కోపంతో ఉన్న ముఖాలు, నవ్వుతో ఉన్న ముఖాలు, ఆనందంగా ఉండే ముఖాలు, ఏడుపు ముఖాలు, ఇలా రకరకాల ముఖాలు గీశాడు. ఇంకా మనుషుల ఆకారాలను పొట్టిగా, పొడవుగా, లావుగా, సన్నగా, అందంగా, భయంకరమైన రాక్షసుడుగా ఇలా ఊహించి గీయడం ప్రారంభించాడు. అన్నీ వనజ టీచరుకు చూపించేవాడు.

ఒకరోజు వనజ టీచరు, "సక్రూ! పట్నంలో చిత్రకారులకు పోటీ పెడుతున్నారు. నువ్వు నీకు నచ్చిన చిత్రం వేసి ఇవ్వు. నేను పోటీకి పంపుతాను," అన్నది. సక్రూ ఇంటికి వచ్చి ఆలోచించాడు. అందరూ మెచ్చుకునేలా తను ఓ చిత్రం గీయాలి అనుకున్నాడు. వెంటనే తన పల్లె చిత్రం గీయడం మొదలుపెట్టాడు. కొండలు వేశాడు. వాగులు వేశాడు. తన వాళ్ళ వస్త్రధారణ, తనవాళ్ళు ఉపయోగించే పాత్రలు వస్తువులు, ఇళ్ళు ఆ చిత్రంలో గీశాడు. తన చుట్టూ ఉన్న ప్రపంచం అంతా కళ్ళకు కట్టినట్టుగా చిత్రం వచ్చింది. తీసుకెళ్ళి టీచరుకు చూపించాడు. సక్రూ గీసిన చిత్రం చూసి వనజ టీచరు ఆశ్చర్యపోయింది. "చాలా బాగా గీశావు. శభాష్ సక్రూ!" అంటూ ఆనందంగా పొగిడింది. "నువ్వు భవిష్యత్తులో గొప్ప చిత్రకారుడివి అవుతావు" అన్నది.



సక్రూ గీసిన చిత్రాన్ని పోటీకి పంపింది వనజా టీచరు. ఆ సంవత్సరం జరిగిన చిత్రాల పోటీలో సక్రూ గీసిన చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. సక్రూ గీసిన చిత్రం, అతని ఫోటో అన్ని వార్తాపత్రికల్లో ప్రచురించారు. అది చూసుకున్న సక్రూ ఆనందానికి అవధులు లేవు. సక్రూ తల్లిదండ్రులు సంబరపడిపోయారు.

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) సక్రూకు అడవిలో ఏమేమి కనిపించాయి? అడవిలో ఇంకా ఏమేమి ఉంటాయో చెప్పండి?

(ఆ) సక్రూ బొమ్మలు గీయడం ఎలా నేర్చుకున్నాడు? ఎవరైనా ఏదైనా పనిని ఎలా నేర్చుకుంటారు?

(ఇ) సక్రూ బొమ్మలను చూసి అందరూ మెచ్చుకున్నారు కదా! ఎవరినైనా ఎప్పుడు మెచ్చుకుంటారు?

(ఈ) సక్రూలో మీకు నచ్చిన గుణాలు ఏవి? ఎందుకో చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం

**(అ) కింది వాక్యాలు చదవండి. పాఠం ఆధారంగా దేని తర్వాత ఏం జరిగిందో అంకెలతో అంకెలతో సూచించండి.**



- చిత్రలేఖనం పోటీలో బహుమతి వచ్చింది. (        )
- సక్రూ ఇంటిగోడలమీద బొమ్మలు గీశాడు. (        )
- బొమ్మలకేసి కళ్ళప్పగించి చూశాడు. (        )
- సక్రూ ఒకరోజు అడవిలోని గుహలోకి వెళ్ళాడు. (    1    )
- పల్లెచిత్రం గీశాడు. (        )
- మనుషుల ముఖాలు గీయడం ప్రారంభించాడు. (        )
- బొమ్మలకు రంగులు అద్దడం కూడా చేశాడు. (        )

**(ఆ) పాఠం ఆధారంగా పట్టికలో సరైన పదాలు రాయండి.**

| | |
|---|---|
| సక్రూ అడవిలో చూసినవి. | |
| సక్రూ గీసిన చిత్రాలు | |

**(ఇ) పాఠం చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. సక్రూ వాళ్ళ అమ్మా నాన్నా ఏమి అమ్ముకొని బతికేవారు?
2. అడవిలో వెళుతున్న సక్రూను ఏవేవి పలకరించాయి?
3. సక్రూ గుహలో ఏం చూశాడు?
4. సక్రూకు ఎందుకు నిద్రపట్టలేదు? నిద్రపట్టని సక్రూ ఏమి చేశాడు?
5. సక్రూ బొమ్మలు గీయడం ఎలా నేర్చుకున్నాడు?
6. సక్రూను కలిసిన వనజ టీచర్ ఏం చేసింది?
7. సక్రూ పల్లెచిత్రంలో ఏమేమి గీశాడు?



© SCERT not to be republished

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)




(అ) సక్రూకు బొమ్మలు గీయడం చాలా ఇష్టమైన పనిగా మారిపోయింది కదా! మీకు ఇష్టమైన పనులు ఏవి? ఎందుకు ఇష్టమో రాయండి.

(ఆ) మిమ్మల్ని చిత్రాలు గీయమంటే ఏ ఏ చిత్రాలు గీస్తారు?

(ఇ) సక్రూ గురించి రాయండి.

## IV పదజాలం



### (అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన పదం ఉపయోగించి మరొక వాక్యం రాయండి.

1. సక్రూ గుహలోని చిత్రాలను <u>ఆశ్చర్యంగా</u>, ఆనందంగా చూసేవాడు.

   ______________________________

2. సక్రూ ఆ చిత్రాలవైపు <u>కళ్ళప్పగించి</u> చూస్తూండిపోయాడు.

   ______________________________

3. ఇక <u>సంతృప్తిగా</u> హాయిగా నిద్రపోయాడు.

   ______________________________

4. సక్రూ స్నేహితులు బొమ్మను <u>ఆసక్తిగా</u> చూసేవారు.

   ______________________________



© SCERT not to be republished

### (ఆ) ఎవరిని ఏమంటారో రాయండి.

ఉదా : 1. చిత్రాలు గీసేవారిని <u>చిత్రకారులు</u> అంటారు.

2. నాట్యం చేసేవారిని ____________________
3. పాటలు పాడేవారిని ____________________
4. పుస్తకాలు చదివేవారిని ____________________
5. ఆటలు ఆడేవారిని ____________________
6. కథలను చెప్పేవారిని ____________________
7. రచనలు చేసేవారిని ____________________




### (ఇ) అడవినుంచి లభించేవి పట్టికలో రాయండి.

| పండ్లు | కాయలు | కలప | ఔషధాలు | ఇతరాలు |
|---|---|---|---|---|
| | | | | |

### (ఈ) ఈ కింది ఆకారాలతో వీలైనన్ని బొమ్మలు గీయండి.

ఉదా :



(ఉ) **పిల్లలందరూ కూడ సక్రూలా ఒక్కొక్కరు ఒక్కొక్క దాంట్లో ముందుంటారు. మీ తరగతిలో ఎవరెవరు వేటిలో ముందుంటారు? వాళ్ళ పేర్లు రాయండి.**

1. బాగా కథలు చెప్పేవాళ్ళు ____________
2. రెండు నిమిషాలపాటు దేన్ని గురించైనా మాట్లాడేవాళ్ళు ____________
3. బాగా పాడేవాళ్ళు ____________
4. పొడుపు కథలను చటుక్కున విప్పేవాళ్ళు ____________
5. రకరకాల గొంతులతో మాట్లాడేవాళ్ళు ____________
6. బొమ్మలు గీసేవాళ్ళు ____________
7. బాగా నటించేవాళ్ళు ____________
8. ఎదుటివారిని నవ్విస్తుండేవారు ____________


మీరు పైవాటిల్లో ఏవేవి చేయగలరు?



## V. సృజనాత్మకత:

**కింది సూచనల ఆధారంగా చిత్రాన్ని గీయండి. రంగులు వేయండి. దాన్ని గురించి రాయండి.**

ఒక పెద్ద చెరువు. చెరువుకు దూరంగా ఎత్తుగా ఉన్న కొండలు. కొండల మధ్యలో ఉదయిస్తున్న సూర్యుడు, చెరువు పక్కన చెట్లు చెరువులో తామరలు, చేపలు, బాతులు, ఆకాశంలో ఎగురుతున్న పక్షులు.



## VI ప్రశంస:

బాగా బొమ్మలు గీసిన సక్రూను టీచర్ శభాష్! అని మెచ్చుకుంది కదా! సక్రూలాంటి వాళ్ళు మీకు ఎదురైతే వాళ్ళని మీరు ఎలా అభినందిస్తారు.

## VII భాషను గురించి తెలుసుకుందాం

(అ) **కింది పేరా చదవండి. పట్టికను పూరించండి.**



పద్మ, ముంతాజ్, చంద్రిక స్నేహితురాళ్ళు. వారు తోటకు వెళ్ళారు. పచ్చని చెట్లతో తోట కళకళలాడుతుంది. అక్కడ మామిడి, జామ, సపోటా చెట్లు ఉన్నాయి. వాటిపైన అల్లరి కోతులు, తుంటరి ఉడతలు గెంతుతూ ఉన్నాయి. చంద్రిక ఒక పెద్ద కోతిని చూసింది. కోతిబావా! నాకో మామిడిపండు ఇయ్యవా? అని అడిగింది. అది ఒక దోరకాయ కోసి కిందకు వేసింది. అందరూ కలసి కాయను తిన్నారు. అది తియ్యతియ్యగా, పుల్ల పుల్లగా చాలా బాగుంది.

| నామవాచకాలు | సర్వనామాలు | క్రియలు | విశేషణాలు |
|---|---|---|---|
| | | | |

© SCERT not to be republished

(ఆ) కింది పేరాలోని నామవాచకం, క్రియలతో వాక్యాలు రాయండి.

సిరిపురంలో పెద్ద చెరువు ఉంది. అందులో చేప, కప్ప, తాబేలు బాతు ఎంతో స్నేహంగా ఉన్నాయి. చెరువు గట్టున పెద్దమామిడి చెట్టు ఉంది. దానిమీద ఒక కాకి ఉంది. అది ఒకరోజు చెరువుదగ్గరకు వెళ్ళింది. మిత్రులను పిలిచింది. తనతో స్నేహం చేయమని అడిగింది. అవి సంతోషంగా ఒప్పుకున్నాయి. బాతు కాకిని తనమీద కూర్చోబెట్టుకొంది. చెరువంతా తిప్పింది. కాకి సంతోషించింది.

**ఉదా :** తాబేలు – వెళ్లింది.

తాబేలు చెరువులో ఈదుకొంటూ వెళ్లింది.



**ప్రాజెక్టు పని**

వార్తా పత్రికలు చూడండి. మీకు ఆసక్తి కలిగించే ప్రకృతికి సంబంధించిన చిత్రాలు సేకరించండి. వాటిని గురించి మాట్లాడండి.

**నేనివి చేయగలనా?**

| | | |
|---|---|---|
| 1. | పల్లెచిత్రం కథను సొంతమాటల్లో చెప్పగలను.<br>సక్రూలో నచ్చిన గుణాల గురించి చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | కథను ధారాళంగా చదవగలను.<br>దేని తరవాత ఏమి జరిగిందో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | సక్రూ గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | సూచనలకు తగిన చిత్రాన్ని గీసి,<br>రంగులు వేసి దాని గురించి రాయగలను. | ఔను/కాదు |



కర్మ, అదృష్టంవంటి మాటలు పక్కన పెట్టి మీ శక్తితో పైకిరండి.

– డా॥ బి.ఆర్. అంబేద్కర్

© SCERT not to be republished

చదువు
ఆనందించు


# చిత్రకళ


శ్రీ కొండపల్లి శేషగిరిరావు

మనం ప్రాచీన దేవాలయాలకు వెళ్లినప్పుడు అక్కడి స్తంభాల మీద గోడల మీద ఎన్నో బొమ్మలు చూస్తుంటాం. ఆ బొమ్మలు ఎంతో అందంగా ఉండి ఏదో ఒక భావాన్ని వ్యక్తపరచేవిగా ఉంటాయి. అవి ఎంత బాగున్నాయో అని క్షణకాలమైనా మెచ్చుకోకుండా ఉండలేం. చిత్రకారుడు అంత అందమైన చిత్రాలు గీయగలగడానికీ, అవి ఇంతకాలంగా చెక్కుచెదరకుండా అలా ఉండటానికి కారణం ఏమై ఉంటుందని ఎప్పుడయినా ఆలోచించారా!

ఇలా గోడలపై చిత్రించడాన్ని 'కుడ్యచిత్రణం' అంటారు (కుడ్యం అంటే గోడ). వీటిని 'భిత్తి చిత్రాలు' అని కూడా అంటారు. ఈ కళ మనకు ప్రాచీన మానవుడి నుండి వచ్చింది. పూర్వం చరిత్ర యుగపు రాతి గుహలలో మానవుడు తాను వెంటాడే జంతువులను అతనికి అందుబాటులో ఉండే రంగురాళ్ళతోనూ, నలుపురంగుతోనూ గీసేవాడు. ఇలాంటి చిత్రాలు ఇప్పటికీ ఫ్రాన్సులోనూ, స్పెయిన్‌లోని అల్తిమీరా గుహలలోనూ, దక్షిణ భారతదేశంలోని రాయచూరు జిల్లాలో ఉన్నాయి. మహారాష్ట్రలోని అజంతా గుహల్లో ప్రాచీనమైన చిత్రకళ కనిపిస్తుంది.

ఈ వివరాలను ప్రముఖ చిత్రకారులు శ్రీ కొండపల్లి శేషగిరిరావు గారు తన వ్యాసాలలో వెల్లడించారు. వీరు వివిధ చిత్రకళారీతులలో నిష్ణాతులైన చిత్రకళా పండితులు. తైలవర్ణ చిత్రాలు, నీటి రంగుల చిత్రాలు, పోట్రయిట్స్ వంటివి వేయడంలో సిద్ధహస్తులు. శ్రీ కొండపల్లి శేషగిరిరావు గారు 27.01.1924న వరంగల్ జిల్లాలోని పెనుగొండ గ్రామంలో జన్మించారు.


కొండపల్లి శేషగిరిరావు గారు గీసిన గ్రామీణుల చిత్రం

శేషగిరిరావుగారు చిత్రించిన అద్భుతమైన చిత్రాలలో బెస్తవారి చిత్రం, గుహుడు, రాములవారిని నది దాటిస్తున్న చిత్రం, 'కలువకొలనులచ్చి' అనే జానపద చిత్రం, గోదాదేవి చిత్రం, శకుంతల దృశ్యకావ్య చిత్రాలు, గ్రామీణుల చిత్రం, ప్రకృతి దృశ్యాలకు చెందిన చిత్రాలు, తెలుగుతల్లి చిత్రం ఎంతో పేరెన్నికగన్నవి. వీరు మన తెలుగువారు కావడం మనకెంతో గర్వకారణం. కొండపల్లి శేషగిరిరావు గారి చిత్రాలు భారతదేశ భవిష్యత్ నిధులై ప్రపంచానికి మనదేశ కీర్తిని చాటుతాయి. వీరు 26.7.12న పరమపదించారు.

ప్రతి కళాఖండం వెనుక చిత్రకారుడి అఖండ ప్రతిభ, నైపుణ్యం, కృషి దాగి ఉంటాయి. అలాంటి కళాకృతులే చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయి.

నాలుగో యూనిట్

# 16. మాటల ప్రయాణం

కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రం చూడండి. ఏం జరుగుతున్నదో చెప్పండి.
- చిత్రంలోని పక్షి కాళ్ళతో ఏం పట్టుకుంది? అందులో ఏముంటుందని మీరు ఊహిస్తున్నారు.
- పక్షి దాన్ని తీసుకొని ఏంచేస్తుంది? ఎక్కడికి వెళుతుందని మీరు అనుకుంటున్నారు?




**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**మనల్ని ఎవరైనా ఏదైనా విషయం పక్క వీథిలోవాళ్లకు చెప్పిరమ్మంటే వెంటనే వెళ్ళి చెప్పివస్తాం. ఇలా మన మాటలు ఎదుటివాళ్ళకు తెలుస్తాయి. అదే పని ఉంటే చాలా దూరంగా ఉన్న మనవాళ్ళకు మన మాటలు ఎలా చేరతాయో పాఠం ద్వారా తెలుసుకుంటారు.**

"ట్రింగ్...ట్రింగ్..." అని సైకిల్ గంట మోగింది. ఆ వెంటనే 'పోస్ట్' అని అరుపు వినిపించింది. డేవిడ్ తలుపుతీసి పోస్ట్‌మ్యాన్ ఇచ్చిన ఉత్తరాన్ని తీసుకున్నాడు. "నాన్నగారూ! మనకు ఉత్తరం వచ్చింది." అంటూ పిలిచాడు డేవిడ్. "అలాగా! ఇంతకూ ఆ ఉత్తరం మనదేనా చూడు." అన్నాడు వాళ్లనాన్న రాబర్ట్. డేవిడ్ఉత్తరం మీద గల చిరునామా చూసి "మనదే నాన్నగారు!" అన్నాడు. "ఎవరు రాసారు?" అడిగాడు నాన్న. వెంటనే ఉత్తరం వెనుక ఎడమవైపు కింది భాగంలో చిరునామా చూసి ఆనందంగా "మేరీ అక్కయ్య రాసింది నాన్నా!" అన్నాడు డేవిడ్. మేరీ పేరు విని అమ్మ హాల్లోకి వచ్చింది.

అమ్మ ఆసక్తిగా, "అక్కయ్య, ఏం రాసిందో చదువు. అక్కడ కాలేజీలో ఎలా ఉందో ఏమో!" ఆత్రంగా అడిగింది అమ్మ లీనా. డేవిడ్ చదివి వినిపించాడు. ఉత్తరాన్ని ధారాళంగా చదివిన తన కొడుకును చూసి తల్లి లీనా మురిసిపోయింది.



"నాన్నగారూ! అక్కయ్య ఉత్తరం రాసింది కదా! మనం కూడా బదులు రాయాలా?" అని డేవిడ్ అడిగాడు.


"తప్పకుండా రాయాలి. వెళ్లి నా టేబుల్ డెస్క్‌లో ఉన్న పోస్టుకార్డు, పెన్ను తీసుకురా" అన్నాడు. డేవిడ్ వెంటనే తెచ్చి ఇచ్చాడు.

"నా చేతికిచ్చావేంటి? నువ్వే రాయాలి." అన్నాడు నాన్న. "నేనా!... ఉత్తరం ఎలా రాయాలో నాకు తెలియదు." అన్నాడు డేవిడ్.

"తెలియదంటే ఎలా! అక్కయ్య రాసిన ఉత్తరం చూడు. ముందువైపు కుడిభాగంలో ఏమి రాసింది?"అన్నాడు నాన్న.

డేవిడ్‌చూసి, "ఆ! అర్థమయింది. ముందుగా తేదీ, దానికింద మన ఊరిపేరు రాయాలి" అన్నాడు.

"తరవాత చూడు! అక్కయ్య, పూజ్యులైన అమ్మానాన్నలకు అని రాసింది కదా! మేము పెద్దవాళ్ళం కాబట్టి అలా రాసింది. ఐతే పెద్దవాళ్ళం రాసేటప్పుడు ప్రియమైన మేరీకి, లేదా చిరంజీవి మేరీకి అని సంబోధిస్తూ రాయాలి. తరవాత మన క్షేమ సమాచారాలు తెలుపుతూ, అక్కయ్య క్షేమసమాచారాలు అడగాలి. రాయాలనుకున్న విషయం మధ్యలో రాయాలి. చివరిలో ఉత్తరం వెనుక భాగంలో ఎడమవైపు మన పేరు, చిరునామా రాయాలి. కుడివైపు అక్కయ్యపేరు, చిరునామా రాయాలి."


నాన్నగారూ! నేను బాగానే చదువుతున్నాను. వచ్చే సెలవులకు ఇంటికి వస్తాను. మన ఇంట్లో అందరూ బాగానే ఉన్నారని అనుకుంటున్నాను. మన గ్రామంలో జాతర ఎప్పుడు జరుగుతుంది? మా మిత్రులు కూడా జాతరకు వస్తామంటున్నారు. ఉంటా నాన్నగారు.

మీ ప్రియమైన
మేరీ
అనకాపల్లి
విశాఖపట్నం జిల్లా

POST CARD

కె. రాబర్ట్
గోనెగండ్ల గ్రామం
కర్నూలు జిల్లా
ఆంధ్రప్రదేశ్

PIN 5 1 8 4 6 3

Do not write or print below this line

"సరే నాన్నా! నాకు పూర్తిగా అర్థమయింది. మీరు రాసినట్లు నేను రాసి మీకు చూపిస్తాను. మీరు ఏమి రాయాలో చెప్పండి చాలు" అన్నాడు డేవిడ్. నాన్న డేవిడ్‌కు ఏమి రాయాలో చెప్పాడు.

డేవిడ్ ఉత్తరం రాసి నాన్నకు చూపించాడు. "వెరీగుడ్! బాగా రాశావు." అని మెచ్చుకున్నాడు నాన్న. "వెళ్లి ఉత్తరాన్ని మన పోస్టాఫీసు ముందున్న పోస్ట్‌బాక్స్‌లో వేసిరా!" అన్నాడు. "సరే నాన్నా!" అని పరుగున వెళ్లాడు డేవిడ్.

ఉత్తరం పోస్టుబాక్సులో వేసిన తర్వాత డేవిడ్‌కు పోస్టాఫీసులో ఏం జరుగుతుంది? ఉత్తరాలు ఎలా చేరుతాయి! అని తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. వెంటనే అక్కడే ఉన్న పోస్టుమ్యాన్‌ను కలిసి నమస్కరించాడు. ఆయన పేరు ఇక్బాల్. "పోస్టు బాక్సులో నేను వేసిన ఉత్తరం మా అక్కయ్యకు ఎలా చేరుతుంది"? అని ఆయన్ని అడిగాడు. డేవిడ్ అడిగిన విధానం చూసి పోస్టుమ్యాన్‌కు ముచ్చట కలిగింది.

"పోస్టుకార్డు మీద మీ అక్కయ్య చిరునామా, పిన్‌కోడ్ రాశారా?" అని పోస్టుమ్యాన్ అడిగాడు.

తేది : 12.9.2013
గోనెగండ్ల

ప్రియమైన మేరీకి,

అమ్మానాన్నా, ఆశీర్వదిస్తూ రాస్తున్నది, మేము క్షేమం. నువ్వు క్షేమమని తలుస్తాం.

నువ్వు బాగా చదువుతున్నట్లు తెలిసి సంతోషించాం. నీ ఆరోగ్యం జాగ్రత్త. సెలవుల్లో ఇక్కడ జరిగే జాతరకు నువ్వు మీ స్నేహితురాళ్లను తప్పకుండా తీసుకురా. జాతరతో పాటు మన ఊరి చుట్టు పక్కల ఉన్న తోటలను చూపిద్దాం. ఇక్కడి నుంచి అరకు లోయకు కూడా వెళ్ళి చూసి వద్దాం. అరకుతో పాటు బొర్రా గుహలకు కూడా వెళ్దాం. తమ్ముడు బాగా చదువుతున్నాడు. వ్యవసాయం పనులు బాగానే జరుగుతున్నాయి.

ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో బాగా చదవాలని అందరూ అంటున్నారు. తప్పని సరిగా అన్నీ అర్థమయ్యేలా చదువుకోవాలి. అవసరమైతే మీ అధ్యాపకులను అడిగి తెలుసుకో. మీ మిత్రులందరినీ అడిగినట్లు చెప్పు.

నీ ప్రియమైన
అమ్మా, నాన్న
గోనెగండ్ల గ్రామం
కర్నూలు జిల్లా



पोस्ट कार्ड POST CARD

కె. మేరీ, మొదటి సంవత్సరం
ప్రతిభ ఇంజనీరింగ్ కాలేజి
అనకాపల్లి
విశాఖపట్నం జిల్లా

पिन PIN | 5 | 3 | 1 | 0 | 0 | 1

Do not write or print below this line

© SCERT not to be republished

"ఆ! రాశామండి. అయినా పిన్‌కోడ్ ఎందుకు రాయాలి?" అని డేవిడ్ అడిగాడు.

"మంచి ప్రశ్న, పిన్ (PIN) అంటే "పోస్టల్ ఇండెక్స్ నంబరు". ఆ ఆరంకెల సంఖ్యలో ఎడమ నుండి కుడికి మొదటి అంకె రాష్ట్రాన్ని, రెండో-మూడో అంకెలు జిల్లాను, చివరి మూడంకెలు తపాలా కార్యాలయాన్ని సూచిస్తాయి. పిన్‌కోడ్ ఆధారంగా మా దగ్గరకు వచ్చిన ఉత్తరాలను ప్రాంతాలవారీగా విభజించి మూటలు కట్టి బస్సులు, రైళ్లు, ఓడలు, విమానాల ద్వారా ఆయా ప్రాంతాలకు పంపిస్తాం. అలా చేరిన ఉత్తరాలను




పోస్ట్‌మ్యాన్‌ల ద్వారా వారి వారి చిరునామాలకు చేరవేస్తాం. మీ అక్కయ్యకు రాసిన ఉత్తరం కూడా అలాగే చేరుతుంది." పిన్ కోడ్ వేయడం వల్ల ఉత్తరాలు ఖచ్చితంగా చేరవలసినవారికి చేరుతాయి.

"పూర్వం ఇన్ని ప్రయాణసాధనాలు లేవు కదా! ఉత్తరాలు ఎలా పంపేవారు?"

"పూర్వం ఉత్తరాలను పావురాల ద్వారా, దూతల ద్వారా, రౌతుల ద్వారా పంపేవారు."

"పోస్టాఫీసుల నుండి కేవలం ఉత్తరాలే పంపుతారా?" అని డేవిడ్ అడిగాడు.

"ఉత్తరాలే కాదు మని ఆర్డర్లు, రిజిష్టర్డ్ పోస్టులు, స్పీడ్ పోస్టులు, పార్శిళ్ళు, పెళ్లిపత్రికలు, గ్రీటింగ్ కార్డులు కూడా పంపవచ్చు. కానీ ఇప్పుడు ఉత్తరాలు రాసేవారి సంఖ్య బాగా తగ్గిపోయింది." అన్నాడు.

"ఎందుకు తగ్గింది?"


"ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంవల్ల ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ రావడం వల్లా, కంప్యూటర్ పరిజ్ఞానం పెరగడంవల్లా పంపించాల్సిన సమాచారాన్ని ఎస్సెమ్మెస్‌లు (SMS), ఈ-మెయిళ్ళ (E.mail) ద్వారా రెప్పపాటుకాలంలో ఎదుటివారికి చేరవేస్తున్నారు."

"మరి అలాగైతే పోస్టాఫీసులకు ప్రాధాన్యం తగ్గిపోతుంది కదా!"

"అంతమాత్రాన పోస్టల్ వ్యవస్థ ప్రాధాన్యం ఏమీ తగ్గలేదు. ఎన్ని సాంకేతిక సాధనాలు వచ్చినా వాటిని తపాలా వ్యవస్థ కూడా సమర్థంగా వినియోగించుకుంటోంది. టెలిగ్రాంలతో పాటు ఇ.ఎం.ఎస్ (EMS) వంటి వాటిని ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ దరఖాస్తుల కాలం వచ్చినా సరే పోటీ పరీక్షల దరఖాస్తులను పంపించడం ఇప్పటికీ మాద్వారానే జరుగుతోంది.

© SCERT not to be republished

ఇలా ప్రారంభంలో కేవలం ఉత్తరాల బట్వాడాకే పరిమితమైన తపాలా వ్యవస్థ ఆధునికమైన పోకడలను ఆకళింపు చేసుకొని, అదనపు హంగులతో, సౌకర్యాలతో ప్రజలకు మరింత చేరువ అవుతూ తన స్థానాన్ని, తన ప్రత్యేకతను నిలుపుకుంటోంది.”



“మన తపాలా వ్యవస్థ చాలా పెద్దదట కదా! నిజమేనా?”


“నిజమే! మన తపాలా వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్దది. దాదాపు లక్షాయాభైవేల పైచిలుకు పోస్టాఫీసులతో సేవలందిస్తోంది. అంతే కాదు ఇది చాలా చవకయినది కూడా. కేవలం యాభైపైసల కార్డుతో దేశంలో ఎక్కడికైనా సమాచారం పంపించవచ్చు. ఎక్కువ సమాచారం పంపాలనుకుంటే ఇన్‌లాండ్ లెటర్, కవర్ల ద్వారా పంపవచ్చు. కవర్ల బరువును బట్టి స్టాంపులు అతికిస్తే చాలు.”

“పోస్టాఫీసులు ఇంకా ఏం సేవలు అందిస్తున్నాయి?”

“సేవింగ్ అకౌంట్లు, రికరింగ్ డిపాజిట్లు, ఫిక్స్డ్ డిపాజిట్లు, సంచయిక నిధుల ద్వారా డబ్బు పొదుపు చేసుకోవచ్చు. జీవితబీమా పాలసీలను పొందే సౌకర్యం కూడా ఉంది.”

“చాలా బాగా చెప్పారు. కానీ ఎండనకా, వాననకా ఇంటింటికీ తిరుగుతూ ఉత్తరాలు బట్వాడా చేయడం పోస్ట్‌మ్యాన్‌లకు చాలా శ్రమతో కూడిన పనికదా!”

“అలాంటిదేమీ లేదు. దేశ సరిహద్దులో దేశరక్షణలో ఉండే జవాన్లు పంపే మనీ ఆర్డర్లు, ఉత్తరాలను వారిళ్లకు వెళ్లి ఇచ్చినప్పుడు వారి ముఖంలో కనిపించే ఆనందం చూస్తే మా అలసట అంతా మాయం అవుతుంది. కొందరికి బహుమతులు, పరీక్షాఫలితాలు, ఉద్యోగ నియామక పత్రాలు వస్తాయి. అలాంటప్పుడు వారు మమ్మల్ని కూడా కుటుంబ సభ్యులుగా భావించి మిఠాయిలు పంచుతారు. ఇంతకన్నా సంతోషం మాకేం ఉంటుంది!”




మీకు “ధన్యవాదాలు! ఎన్నో విషయాలు చెప్పారు. మీరు సమాజానికి చేస్తున్న సేవలు గురించి ఇప్పుడే నా స్నేహితుడు రోహిత్‌కు ఉత్తరం రాస్తాను.”

అని చెప్పి డేవిడ్ ఇంటికి వెళ్లి తపాలా వ్యవస్థ సేవలను వివరిస్తూ రోహిత్‌కు ఉత్తరం రాశాడు.

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



(అ) తపాలా కార్యాలయం ద్వారా మనం ఎలాంటి సేవలు పొందుతున్నామో చెప్పండి.

(ఆ) సమాచారం ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి ఎన్ని రకాలుగా చేరవేయవచ్చు?

(ఇ) "మాటల ప్రయాణం" పాఠం ద్వారా ఉత్తరం ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి ఎలా చేరుతుందో చెప్పండి.

(ఈ) ఉత్తరాలు రాసేవారి సంఖ్య బాగా తగ్గటానికి కారణాలు చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం రాయడం


**(అ) పాఠం చదివి కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి. రాయండి.**



1. పిన్‌కోడ్ అంటే ఏమిటి? పిన్‌కోడ్‌లో అంకెలు వేటిని గురించి తెలుపుతాయి?
2. ఉత్తరం రాసేటప్పుడు పెద్దవారిని ఎలా సంబోధిస్తారు? పిల్లలను, స్నేహితులను ఎలా సంబోధిస్తారు?
3. పొదుపు చేయడానికి పోస్టాఫీసులో గల సౌకర్యాలు ఏమిటి?
4. పోస్టుమ్యాన్‌లు ఏ ఏ సందర్భాలలో శ్రమ, అలసట మరచిపోయి ఆనందం పొందుతారు?
5. నాన్న మేరీకి రాసిన ఉత్తరంలో ఏమి రాశాడు?

**(ఆ) పాఠం చదవండి. పోస్టుమ్యాన్‌ను డేవిడ్ అడిగిన ప్రశ్నలు, ఆయన చెప్పిన జవాబులు రాయండి. ఆ వాక్యాలు లేదా పేరా ఎదురుగా డేవిడ్, పోస్టుమ్యాన్ల పేర్లు రాయండి.**

**(ఇ) కింది వాక్యాలు చదవండి. పాఠం ఆధారంగా సరిచేసి, సరియైన వాక్యాలు రాయండి.**




1. పిన్‌కోడ్‌లో మొదటి అంకె దేశాన్ని సూచిస్తుంది.
2. భారతదేశంలో వెయ్యి పోస్టాఫీసులున్నాయి.
3. దూరప్రాంతాలకు వెళ్లే ఉత్తరాలను సైకిళ్ల మీద పంపుతారు.
4. పూర్వం ఉత్తరాలను రైళ్ళు, విమానాలు, ఓడలు, బస్సుల ద్వారా పంపేవారు.
5. పోస్టాఫీసు ద్వారా ఈమెయిల్, ఎస్ఎంఎస్‌లు పంపవచ్చు.
6. పోస్టాఫీసు ద్వారా ఎక్కువ సమాచారం పంపాలంటే పోస్టుకార్డులో రాయాలి.

© SCERT not to be republished

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) ఉత్తరాలు ఎవరెవరికి రాయవచ్చు? ఎందుకు రాస్తారు?

(ఆ) రామువాళ్ల మామయ్య ఎక్లాస్‌పుర్‌లో ఉంటాడు. ఇది మంథని మండలం కరీంనగర్ జిల్లాలో ఉంది. మామయ్యపేరు రంగారావు. అడ్రస్ ఏ విధంగా రాయాలి?

(ఇ) ఉత్తరం ధారాళంగా చదివాడని డేవిడ్ వాళ్ల అమ్మ మురిసిపోయింది కదా! మీ తల్లి ఏ ఏ సందర్భాలలో నిన్నుచూసి మురిసిపోతుంది? రాయండి.

(ఈ) పోస్టాఫీసు సేవల గురించి సొంత మాటల్లో రాయండి.

## IV పదజాలం



(అ) కింది పట్టికలో నిలువు అడ్డం వరుసల్లో కొన్ని పదాలు ఉన్నాయి. ఆ పదాలను రాయండి. వీటిలోని కొన్ని పదాలతో వాక్యాలను పూరించండి.

| | | | | |
|---|---|---|---|---|
| ఫ | సాం | కే | తి | క |
| లి | వ్య | వ | స్థ | కు |
| తం | రా | తు | ప్రా | తూ |
| సే | వ | లు | చీ | హ |
| బ | ట్వా | డా | న | లం |
| చి | రు | నా | మా | రా |
| ధి | పా | దు | పు | క |

© SCERT not to be republished




1. ఉత్తరంలో ____________ రాయకపోతే అవతలివారికి చేరదు.
2. ____________కాలంలో విద్యుత్ సదుపాయం ఉండేది కాదు.
3. పోస్టుమేన్ విధులలో ఉత్తరాల ____________ ముఖ్యమైనది.
4. మనం డబ్బు ____________చెయ్యాలంటే బ్యాంక్‌లో ఖాతా తెరవాలి.
5. భారత తపాలా ____________ ప్రపంచంలో అతిపెద్దది.
6. ______ పరిజ్ఞానం వృద్ధి చెందడంవల్ల సమాచారం క్షణాల్లో అవతలి వారికి చేరుతుంది.

(ఆ) రాజు, రాణి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఏమేమి చూసి ఉంటారో రాయండి.


(ఇ) పోస్టల్ వ్యవస్థలాగే ప్రజలకు సేవలందిస్తున్న వివిధ వ్యవస్థల పేర్లు రాయండి.

(ఈ) మన చుట్టూ ఎందరో ఏదో ఒక విధంగా మనకు సేవలను అందిస్తున్నవారే! మీ మిత్రులతో చర్చించి ఎవరెవరు ఎలాంటి సేవలందిస్తున్నారో రాయండి.





| వ్యక్తులు | వారు అందించే సేవలు |
|---|---|
| ఉపాధ్యాయుడు | |
| డాక్టరు | |
| సైనికుడు | |
| పోస్టుమ్యాన్ | |
| పాఠశాల వంటమనిషి | |
| ఆరోగ్య కార్యకర్త | |
| కార్మికులు | |
| రైతులు | |
| బస్సు డ్రైవరు | |
| రోడ్లు శుభ్రంచేసేవారు | |





© SCERT not to be republished

(ఉ) కింద సమాచారాన్ని అందించే పదాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన పదాలు రాయండి.

ఉదా:- ఉత్తరం : ఊరు, తేది, అడ్రస్, విషయం, రాసినవారు, ........., .........

1. సెల్‌ఫోన్ : ____________________
2. కంప్యూటర్ : ____________________
3. వార్తాపత్రికలు : ____________________
4. పుస్తకాలు : ____________________

## V సృజనాత్మకత:



(అ) మీ పాఠశాల సమస్యల గురించి ప్రధానోపాధ్యాయులకు ఉత్తరం రాసి స్కూలు పోస్ట్‌బాక్సులో వేయండి.


(ఆ) అట్టముక్కలతో పోస్టు బాక్సు తయారు చేయండి. దాన్ని ఎలా తయారు చేశారో చెప్పండి.

**VI** **ప్రశంస :** మీ గ్రామంలోని పోస్ట్‌మ్యాన్ సేవలను ప్రశంసిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.





## VII భాషను గురించి తెలుసుకుందాం



(అ) ముందు చదివిన 14, 15 పాఠాలను చదవండి. అసమాపక క్రియాపదాలున్న వాక్యాల కింద గీత గీయండి. వాటిని చదవండి.

(ఆ) పిల్లలూ! మీ పాఠశాలలో పద్యాల పోటీ జరిగింది. ఆ పద్యాల పోటీ ఎలా జరిగిందో ఈ గుర్తులను (. , ? !) ఉపయోగించి రాయండి.



**ప్రాజెక్టు పని**

మీ బంధువుల పేర్లు వాళ్ల చిరునామాలు సేకరించండి. పట్టికను పూరించండి. ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | తపాలా కార్యాలయం ద్వారా మనం పొందే సేవల గురించి చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను/కాదు |
| 3. | తపాలా వ్యవస్థను గురించి, మనం పొందే సేవల గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | పాఠశాల సమస్యల గురించి ప్రధానోపాధ్యాయులకు ఉత్తరం రాయగలను. | ఔను/కాదు |

హోదా, హక్కు ఉన్నప్పటికి, ప్రభుత్వ ధనాన్ని, సౌకర్యాలను వినియోగించనివారే ప్రజలకు సేవచేయగలుగుతారు. - సుల్తాన్ నాసరుద్దీన్

© SCERT not to be republished

# పదాలు - అర్థాలు

### అ

అకస్మాత్తుగా = ఉన్నట్టుండి
అట్టహాసం = పెద్ద నవ్వు
అడచు = తగ్గించు/అణగగొట్టు
అత్యంత = అధికం, ఎక్కువ
అతిశయం = అధికం
ఆతిథ్యం = ఇంటికి వచ్చే వారికి ఇచ్చే మర్యాద
అద్భుతం = ఆశ్చర్యం కలిగించేది
అధిపతి = ప్రభువు, రాజు
అనంతం = అంతంలేనిది
అనన్య సామాన్యం = ఇతరులకు సాధ్యం కానిది
అనుసరించు = వెంటవెళ్ళు
అమాత్యపీఠం = మంత్రి సింహాసనం
అమాత్యలోకం = మంత్రివర్గం
అమితానందం = చాలా సంతోషం
అరుదెంచి = వచ్చి
అలికిడి = శబ్దం
అలుక = కోపం
అలుసు = చులకన
అల్పబుద్ధి = బుద్ధితక్కువవాడు
అవధి = హద్దు, మేర
అవహేళన = అవమానం, గేలిచేయు
అస్త్రం = ఆయుధం (బాణం, కత్తి, విల్లు)

### ఆ

ఆకతాయిలు = కొంటెవాళ్ళు
ఆజ్ఞ = ఇది ఇలా చెయ్యండనే ఉత్తర్వు
ఆటవిడుపు = ఆడుకోడానికి వదిలిపెట్టటం
ఆదర్శప్రాయుడు = మార్గదర్శకుడు
ఆధ్యాత్మిక = ఆత్మవల్ల కలిగేది
ఆపసోపాలు పడు = ఉస్సూరను
ఆరమగ్గిన = బాగా పండిన
ఆర్యా! = అయ్యా
ఆశ = కోరిక
ఆసరా = ఆశ్రయం, ఆధారం

### ఇ

ఇమ్ముగ = ఇంపుగా
ఇల = భూమి

### ఈ

ఈటె = ఒక విధమైన ఆయుధం, కుంతము
ఈడేరు = నెరవేరు

### ఉ

ఉడుకుబోతు = ఎవడయినా వేళాకోళం చేసినా, వెక్కిరించినా ఓర్చుకోలేక లోలోపల దుఃఖపడేవాడు
ఉన్నత రత్నపీఠం = గొప్ప సింహాసనం
ఉపకారం = మేలు
ఉరుము = గర్జన

### ఎ

ఎగతాళి = గేలి, పరిహాసం చేయుట, వెక్కిరించుట
ఎల్లరు = అందరూ

### ఏ

ఏకాగ్రత = ఒకే మనసుతో ఉండటం
ఏగు (క్రి) = వెళ్ళడం, పోవడం
ఏగుదెంచి = వచ్చి

### ఔ

ఔదార్యం = ఉదారత్వం

### క

కంపించు (క్రి) = వణకడం
కడ = చివరి
కమ్ముకొను (క్రి) = అలుముకోడం, చుట్టుముట్టడం
కరణి = విధం
కరతాళ ధ్వనులు = చప్పట్లు
కలకాలం = ఎల్లప్పుడు
కలయజూచు = అంతటా చూడడం
కలిమి = సంపద
కలియబడు (క్రి) = పోట్లాడటం, కొట్లాడటం
కలుగు = రంధ్రం
కలుషమతులు = పాపాత్ములు, దుర్బుద్ధి గలవాళ్లు
కార్యారంభం = ఏదైనా పనిని మొదలుపెట్టడం
క్రీడించు = ఆటాడుట
కుచ్చెళ్ళు = చీర వంటివి కట్టుకున్నప్పుడు సుమారు బెత్తెడు వెడల్పున కూర్చిన మడతలు
కుతూహలం = ఆసక్తి, ఉత్సుకత
కుదురుగా = నిలకడగా
కుశాగ్రబుద్ధి = చాలా చురుకైన బుద్ధి కలవారు
కూరిమి = స్నేహం
కూర్చి = ఒకటిగా చేసి, ఒక చోటికి చేర్చి
కొదవ = కొరత, లోటు
కొమ్ములు తిరిగినవాళ్ళు = ఆరితేరినవారు మంచి అనుభవజ్ఞులు
కోన = అడవి
క్షీరం = పాలు
క్షేత్రం = స్థానం, పొలం

### గ

గండ శిల = పెద్దరాయి
గంతు = దూకు

©SCERT not to be republished

గణం = సమూహం, ప్రమధుల సమూహం

గబాలున = అకస్మాత్తుగా, ఒక్కసారిగా

గాడ్పు = గాలి

గిరి = పర్వతం, కొండ

గుజ్జు = ముద్దగా ఉండే పదార్థం

గుట్టు = రహస్యం

గుబాళించు = సువాసనను వెదజల్లటం

గుబులు = భయం

గుమ్మం = ద్వారం

గుహ = కొండలో తొలిచిన రంధ్రం

గొల్లు = ఏడుపుతో బిగ్గరగా చేసే ధ్వని

గోడు = దుఃఖం

గోరీలు = సమాధులు

### ఘ

ఘంటం = తాటి ఆకుల మీద రాయడానికి వాడే ఇనుప పనిముట్టు

ఘనంగా = గొప్పగా

ఘనత = గొప్పదనం

### చ

చింత = బాధ

చిటపటలాడు = మండిపడటం

చిత్తం = మనస్సు, పెద్దవాళ్ళు చెప్పిన దానికి ఒక వ్యక్తి తన అంగీకారాన్ని తెలియజేయడం

చెలిమి = స్నేహం

చిహ్నం = గుర్తు

చేను = పంట భూములు

### ఛ

ఛత్రపతి = రారాజు

### జ

జగతి = లోకం, భూమి, జనం

జగము = ప్రపంచం

జిమ్ము (క్రి) = చుట్టుపక్కల గానీ, పైకి గాని వెదజల్లటం

### త

తగాద = గొడవ

తంత్రం = ఉపాయం

తదేకంగా = అదేపనిగా

తమాయించుకొను(క్రి) = స్తిమితపడటం

తరుము (క్రి) = వెంటాడటం, వెంబడించటం

తలపాగా = తలకు చుట్టుకునే గుడ్డ

తానం = స్నానం

తావి = సువాసన

తాళలేక = తట్టుకోలేక

తిలకించు (క్రి) = చూడటం

తీరం = దరి, ఒడ్డు

తీవ్రం = అధికము, మిక్కిలి వేడిమిగలది

తుదకు = చివరకు

తోగు = కొండవాగు, నిత్యం పారే సెలయేరు

### ద

దనుకు = వరకు

దండిగ = ఎక్కువగ

దనుజులు = అసురులు, రాక్షసులు

దరికి = ఒడ్డుకు

దస్తావేజు = ఆస్తులకు సంబంధించిన కాగితాలు

దిండు = తలగడ

దిగులు = బెంగ, చింత

దిటవు = దృఢత్వం, గట్టిదనం

దూత = రాయబారి

దృఢ = గట్టి

దృశ్యము = చూడదగినది

దోరగా = కొంచెం పండిన

దౌడు = పరుగు

### ధ

ధర = భూమి, వెల

ధాన్యం = గింజలు

ధార = పై నుంచి పడే నీరు

ధీయుక్తి = బుద్ధి, తెలివి

### న

నిక్కం = నిజం

నిమజ్జనం = స్నానం, నీళ్ళలో వేయడం

నిర్మలమైన = స్వచ్ఛమైన

నిలయం = స్థావరం

నీళ్ళు నమలడం = తడబడడం

నేడు = ఈ రోజు

నేస్తం = స్నేహం, స్నేహితుడు, స్నేహితురాలు

నైపుణ్యం = నేర్పరితనం

నొచ్చుకొను (క్రి) = బాధపడటం

### ప

పరదా = తెర

పరవశించు (క్రి) = ఆనందించడం

పరికిణీ = పావడా, గాగర (గాగ్రా)

పరిష్కరించు (క్రి) = చక్కబెట్టడం, సరిదిద్దడం

పశుపతి = శివుడు

పాదాభివందనం = పాదాలకు నమస్కరించడం

పురమాయించు (క్రి) = ఒకరికి పని అప్పగించడం

పొంచి = చాటున ఉండి

పొందు = స్నేహం

ప్రగతి = అభివృద్ధి, ముందుకు పోవడం

ప్రతిభ = సామర్థ్యం

ప్రభువు = రాజు

ప్రాంగణం = ముంగిలి

### బ

బల్లెము = పొడిచే ఆయుధము

బుద్ధికుశలత = తెలివితేటలతో ప్రావీణ్యం కలిగిన

© SCERT not to be republished

బుద్ధిమంతుడు = తెలివైనవాడు
బొజ్జ = పెద్ద పొట్ట, ఉదరం

### భ

భాండం = కుండ
భాసిల్లు (క్రి) = ప్రకాశించడం, వెలుగొందడం
భీతి = భయం
భూపాలుడు = రాజు

### మ

మంచె = చేలల్లో కూర్చుండి కాపలాకాయడానికి ఎత్తుగా వేసిన చిన్న పందిరి
మక్కువ = ప్రేమ
మనోహర = ఇంపైన
మయూరం = మగ నెమలి
మహామాత్యులు = గొప్ప మంత్రి
మహామేధానిధి = గొప్ప తెలివి కలిగినవాడు
మారాము = మొండి పట్టుదల
మారుమోగు (క్రి) = ప్రతిధ్వనించడం
మాసిపోవు (క్రి) = మురికి కావడం, చెడిపోవడం
మిత్రబృందం = స్నేహితుల సమూహం
మిత్రులు = స్నేహితులు
మిన్న = అధికం, శ్రేష్ఠం
ముదిత = 1. స్త్రీ, 2. సంతోషంతో కూడిన
ముప్పు = విపత్తు, ప్రమాదం
మురిపెం = సంతోషం
ములుకోల = ముల్లుగర్ర
మెరుపు = కాంతి
మొహం = ముఖం
మోజు = మొగ్గుదల, అభిలాష

### య

యుక్తి = ఉపాయం
యోగులు = యోగవిద్యలోనిపుణులు, సన్యాసులు
యోధులు = యుద్ధం చేసేవారు

### ర

రాలుగాయ = తుంటరి (పిల్ల / పిల్లవాడు)
రాశులు = కుప్పలు
రౌతు = గుర్రం ఎక్కి నడిపేవాడు

### ల

లత = తీగ
లీల = చేష్టలు, పనులు, క్రీడలు
లోకువ = తక్కువ

### వ

వన్నె = రంగు
వర్ణశోభితం = రంగులతో ప్రకాశించునది
వర్ధిల్లు (క్రి) = వృద్ధిచెందడం, పెరగడం
వసుధ = భూమి
వాడి = పదునైన
వాదులాట = గొడవపడుట
విందు = ప్రత్యేక సందర్భాల్లో విలువైన పదార్థాలతో పెట్టే భోజనం
విఘ్నం = ఆటంకం
విచ్చిన = వికసించిన
వినువీధి = ఆకాశం
విముక్తి = బయటపడటం
విరసం = రసంలేనిది, ద్వేషం
విరివిగా = ఎక్కువగా
విలసిల్లు (క్రి) = ప్రకాశించడం, బాగా ఉండటం
విశేషానుభవం = ప్రత్యేకమయిన అనుభవం
విస్తరి = భోజనం చేసే ఆకు
వీడి = వదలి
వీరత్వం = శూరత్వం, వీరుడి గుణం
వృషభం = ఎద్దు
వెదజల్లు (క్రి) = వ్యాపింపజేయడం
వెల = విలువ, ధర
వెల్లడించు (క్రి) = తెలియజేయడం, బయటపెట్టడం
వెల్లివిరియు = ప్రవహించడం, వ్యాపించడం
వేడుక = సంబరం, సరదా
వైభోగం = గొప్పతనం
వైరం = శత్రుత్వం
వైరి = శత్రువు

### ష

షరతు = ఒడంబడిక

### స

సఫలం = సార్థకం
సంగమం = కలయిక
సంచయం = కూడబెట్టడం
సమర్థుడు = గట్టివాడు, నేర్పరి
సంశయం = సందేహం, శంక
సంహరించు (క్రి) = చంపడం
సత్ప్రవర్తన = మంచి నడవడిక
సభాసదులు = సభలోని సభ్యులు
సమయస్ఫూర్తి = సమయానికి తగిన ఆలోచన రావడం
సవరించు (క్రి) = సరిచేయడం, చక్కబరచడం
సాధుపుంగవులు = మంచివారు
సార్వభౌముడు = రారాజు, చక్రవర్తి
సువర్ణాంగుళీయకం = బంగారు ఉంగరం
సేతువు = నీటికట్ట, వారధి
సౌఖ్యం = సుఖం, హాయి
స్వారీ = గుర్రం వంటి ప్రయాణ సాధనం మీద పోవడం, చేసే విహారం
స్ఫురించు (క్రి) = తోచడం, గుర్తుకురావడం

### హ

హతమార్చు (క్రి) = చంపడం
హర్షించు (క్రి) = సంతోషించడం
హారం = ముత్యాల పేరు
హితవు = మంచి మార్గంలో నడుచుకొమ్మని సలహా ఇవ్వడం

© SCERT not to be republished